thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 135 కరీంనగర్ గురువారం, 24 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### నీట్ పరీక్షలో డబ్బుదే కీలక పాత్ర: స్టాలిన్

చెన్నై : 'నీట్' పరీక్షలో ఆద్యంతం డబ్బు కీలక పాత్ర పోషిస్తోందని తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శించారు. 2025 యూజీ వైద్య కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షలో అవినీతికి పాల్పడి, అర్హత లేని వారికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు ఇప్పిస్తామని నగదుతీసుకుని మోసగించారంటూ మహారాష్ట్రకు చెందిన జాతీయ పరీక్షా ఏజెన్సీ అధికారి, పలువురువైద్యులపై సీబీఐ కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్ తన ఎక్స్‌లో స్పందిస్తూ... "నీట్ అనేది మెరిట్ గురించి కాదు, మార్కెట్ గురించి అని నిరూపించే మరో కేసు. అందుకే మేము 'నీట్' నీట్ కాదని గట్టిగా చెబుతున్నాము. నీట్ ప్రారంభం నుంచి చివరి వరకు డబ్బు మాత్రమే ప్రముఖ పాత్ర పోషిస్తుంది. నీట్ పరీక్షా వ్యవస్థ ఒక నైతిక కుంభకోణం" అని పోస్ట్ చేశారు.

# బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించకుండా అడ్డుకొంటున్న కేంద్రం

## బిజెపి - బిఆర్ఎస్‌లపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి




న్యూఢిల్లీ, జులై 23: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ 30లోగా నిర్వహించాలని నిర్ణయించామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లను కేంద్రం ఆమోదిస్తేనే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలహీన వర్గాలకు న్యాయం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ కుల గణన విజయవంతంగా నిర్వహించామన్నారు. బీసీ కుల గణనతో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఈ సర్వే ద్వారా 3.55 కోట్ల మంది వివరాలు సేకరించామని తెలిపారు. గత వందేళ్లుగా వాయిదా పడిన కుల గణనను నెల రోజుల్లోనే పూర్తి చేశామని వివరించారు. తెలంగాణ అసెంబ్లీలో రెండు తీర్మానాలు చేసి పార్లమెంట్‌కు సైతం పంపామని ఆయన గుర్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు రూపొందించామన్నారు. స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్ల కోసం తీర్మానం చేసి పంపామని తెలిపారు. కానీ ఈ బిల్లులను ఆమోదించకుండా జాప్యం చేస్తోందంటూ కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా నిప్పులు చెరిగారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతోపాటు పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమై.. కుల గణన, రిజర్వేషన్లపై చర్చిస్తామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాహుల్ గాంధీ ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. అలాగే మిగతా పక్షాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. కేంద్రం మెడలు వంచి అయినా సరే బీసీ రిజర్వేషన్లు సాధిస్తామని ప్రకటించారు.

అలాగే పార్లమెంట్ ఉభయ సభల్లోని కాంగ్రెస్ ఎంపీలను కలిసి.. వారికి సైతం ఈ రిజర్వేషన్లపై వివరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే బీసీ రిజర్వేషన్లపై తెలంగాణలోని బీజేపీ నేతలు వితండవాదం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వాదన వింతగా ఉందన్నారు. మీరు ఇచ్చిన హామీలను మీరే అమలు చేసుకోవాలంటున్నారని.. అంటే కాంగ్రెస్, బీజేపీకి వేర్వేరు రాజ్యాంగాలు ఉంటాయా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారంటూ బీజేపీ నేతలపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో ముస్లిం రిజర్వేషన్లు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు సాకులు వెతుకుతున్నారంటూ ఆ పార్టీ నేతల తీరును ఎండగట్టారు.
ముస్లిం రిజర్వేషన్లు తొలగించాక తెలంగాణ గురించి మాట్లాడాలంటూ బీజేపీ నేతలకు సూచించారు. ఇలాగే మాట్లాడితే తెలంగాణలో బీజేపీని ప్రజలు తుడిచి పెట్టేస్తారని జోస్యం చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు.. బీజేపీ సహా అన్ని పార్టీలు ఏకగ్రీవ తీర్మానానికి మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు. రాజ్యాంగానికి లోబడే రిజర్వేషన్లు పెంచాలంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**ఆ పదవి బండారు దత్తాత్రేయకు..** ఉప రాష్ట్రపతి పదవి తెలంగాణ వ్యక్తికి ఇవ్వాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బండారు దత్తాత్రేయకు ఆ పదవి కేటాయించాలని కేంద్రానికి ఆయన సూచించారు. దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవి ఇస్తేనే బీసీలకు న్యాయం జరిగినట్లు అవుతుందన్నారు. తెలుగు రాష్ట్రాలకు సరైన గౌరవం దక్కుతుందని అభిప్రాయపడ్డారు. దత్తాత్రేయను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటిస్తే.. తాను ఇండియా కూటమితో మాట్లాడతానని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ ఇస్తే.. దత్తాత్రేయను ఉపరాష్ట్రపతి చేయాలని కోరతానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




హైదరాబాద్: తెలంగాణ స్థానికత వివాదానికి పరిష్కారం వెతకాలని.. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణని ఆగస్టు 5వ తేదీకి వాయిదా వేసింది. నీట్ పరీక్ష రాయడానికి ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివితేనే స్థానికత వర్తిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఈ నిబంధనలు చెల్లవంటూ తెలంగాణ హైకోర్టు గతేడాది తీర్పు వెల్లడించింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది తెలంగాణ ప్రభుత్వం. గతేడాది మాత్రం పిటీషనర్లకు మినహాయింపు ఇచ్చింది రేవంత్ రెడ్డి సర్కార్. ఈ ఏడాది తమకు కూడా స్థానికత నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు విద్యార్థులు. తెలంగాణలో పుట్టి పదో తరగతి వరకు చదివినా స్థానిక కోటా దక్కడం లేదని పిటీషన్‌లో పేర్కొన్నారు విద్యార్థులు. 11, 12వ తరగతులు చదవని కారణంగా నీట్‌లో స్థానిక కోటా దక్కక నష్టపోతున్నామని తెలంగాణ విద్యార్థులు సుప్రీంకోర్టుకి వివరించారు. ఈ మేరకు సమస్యకు పరిష్కారం చూపాలని, విద్యార్థులను ఇబ్బందులు పెట్టొద్దంటూ తెలంగాణ ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానం సూచిస్తూ విచారణ వాయిదా వేసింది.

## బనకచర్లపై టెక్నికల్ కమిటీ ఏర్పాటు దిశగా కేంద్రం.. తాజా అప్‌డేట్ ఇదే!



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి – బనకచర్ల ప్రాజెక్టు అంశం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అగ్గి రాజేసిన విషయం విదితమే. తాము ఎట్టి పరిస్థితుల్లో ఆ ప్రాజెక్టుకు అంగీకరించేది లేదంటూ తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి తేల్చి చెప్పింది. అయితే, ఇరు రాష్ట్రాల మధ్య జల వివాదాలను పరిష్కరించేందకు కేంద్ర జల సంఘం ప్రత్యేక చొరవ తీసుకుంది. ఈ మేరకు 2025 జూలై 16న ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలతో సమావేశం నిర్వహించింది. ఈ భేటీలో కృష్ణా, గోదావరి నదుల జల విభజన, బనకచర్ల, పోలవరం ప్రాజెక్టులతో సహా రెండు రాష్ట్రాల మధ్య నీ టి వివాదాలపై ప్రధానంగా చర్చించారు. అదే విధంగా బనకచర్ల ప్రాజెక్టుపై సాంకేతిక, పరిపాలనా అం శాలను పరిశీలించేందుకు ఈనెల 21లోపు ఓ టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే భాగంగా మొత్తం 12 మందితో కేంద్ర జలసంఘం సాంకేతిక నిపుణుల కమిటీ ఏర్పాటు చేసేందుకు అడుగులు వేసింది. కమిటీలో సభ్యుల పేర్లను పంపాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకు సమాచారం అందజేశారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు సభ్యులుగా ఇరిగేషన్ స్పెషల్ సీఎస్ సాయి ప్రసాద్, జల వనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వర రావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహ మూర్తి పేర్లను ప్రభుత్వం ప్రతిపాదించింది.
ఇవాళ వారి పేర్లను కేంద్ర జల సంఘానికి పంపనుంది. ఇక తెలంగాణ ప్రభుత్వం నుంచి కమిటీ మెంబర్లపై ఎలాంటి ప్రకటన వెలువడలేదు. అయితే, బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలు, నీటి లభ్యత, పర్యావరణ ప్రభావాలు, రెండు రాష్ట్రాల మధ్య నీటి విభజనలో న్యాయం జరిగేలా ఓ రోడ్‌మ్యాప్ తయారు చేయడమే ఈ కమిటీ లక్ష్యమని తెలుస్తోంది.

## మళ్లీ తెరపైకి 'కూటమి కింగ్స్'

### జేడీయూకు ఉప రాష్ట్రపతి...టీడీపీకి డిప్యూటీ స్పీకర్?

## గురి చూసి కొడుతున్నారుగా!?




కేంద్రంలో బీజేపీ ఆచీ తూచీ అడుగులు వేస్తోంది అని అంటున్నారు. మ్యాజిక్ ఫిగర్ కి చాలా దూరంలో ఆగిపోయిన బీజేపీకి ఆదుకుంటున్నది ఊత కర్ర సాయం అందిస్తోంది ఏపీ నుంచి తెలుగుదేశం పార్టీ, బీహార్ నుంచి జేడీయూ అన్నది తెలిసిందే. అందుకే ఈ రెండు పార్టీలకు ఎన్డీయే పెద్దలు ఎక్కడ లేని విలువ ఇస్తున్నారు. ఇదిలా ఉంటే జేడీయూకి ఉప రాష్ట్రపతి పదవి దక్కబోతోంది అని అంటున్నారు. ఆ పార్టీకి ఇది అతి పెద్ద గౌరవంగా ఉంటుంది. అంతే కాదు ప్రాధాన్యత కూడా చాలా పెరిగినట్లే అని అంటున్నారు. జేడీయూ అధినేత నితీష్ కుమార్ అవసరం బీజేపీకి చాలా ఉంది. బీహార్ లో ఇపుడు రాజకీయం ఎన్డీయేకు ఏమంత సుఖంగా లేదు. విపక్షాలు గట్టిగానే సవాల్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జేడీయూని తమతో ఉంచుకోవడం బీజేపీకి అత్యవసరంగా మారుతోంది. ఈ క్రమంలోనే ఉప రాష్ట్రపతి పదవిని బహుమానంగా ఇస్తున్నారు అని అంటున్నారు. దీని వల్ల నితీష్ కుమార్ కూటమికి కట్టుబడి ఉంటారని అంటున్నారు. ఎందుకంటే ఎన్నికల ముందు కూటములు వేరు, ఎన్నికల తరువాత రాజకీయ సన్నివేశాలు వేరు. బీహార్ లో ఇలాంటివి చాలా జరిగాయి. పైగా గత అయిదేళ్ళలో నితీష్ రాజకీయ విన్యాసాలు దేశమంతా చూసింది. 2020లో బీజేపీతో ఎన్డీయేతో కలసి గెలిచి మధ్యలో ఇండియా కూటమికి వెళ్ళారు మళ్ళీ అటు నుంచి ఇటు మళ్ళారు. మరి బీహార్ లో అంకెల గారడి ఏలా ఉంటుందో తెలియదు బొటాబొటీగా నంబర్ వస్తే నితీష్ కుమార్ అత్యంత కీలకం అవుతారు. అందుకే ఆయన ముందర కాళ్ళకు బంధం వేసేందుకు బీజేపీ ఈ విధంగా దేశంలోనే అతి పెద్ద రెండవది అయిన రాజ్యాంగ పదవిని అందిస్తోంది అని అంటున్నారు.

మరో వైపు ఏపీలో టీడీపీని చంద్రబాబుని అలాగే చూసుకుంటున్నాబు. చంద్రబాబు వరకూ చూస్తే ఆయన పదవుల విషయంలో పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. కేంద్రం దండీగా నిధులు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. అయితే గ్రాంట్స్ విషయంలో అనుకున్నంతగా సాయం అందిస్తోందా లేదా అన్నది పక్కన పెడితే పదవుల విషయంలో మాత్రం బీజేపీ తెలుగుదేశానికి న్యాయం చేస్తోంది అని అంటున్నారు. ఇప్పటికే ఒక గవర్నర్ పదవిని ఇచ్చిన బీజేపీ రానున్న కాలంలో మరో గవర్నర్ పదవిని ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. అంతే కాదు లోక్ సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని టీడీపీకి ఇస్తారు అని ప్రచారం అయితే సాగుతోంది. ఆ పదవిని అమలాపురానికి చెందిన మాజీ స్పీకర్ గంటి మోహన చంద్ర బాలయోగి కుమారుడుకి దక్కుతుందని చెబుతున్నారు. మొత్తానికి నితీష్ ని చంద్రబాబుని ప్రసన్నం చేసుకోవడంలో బీజేపీ సక్సెస్ అవుతోందని చెబుతున్నారు.



# కాలినడకన 3 కి.మీ. అడవి దాటితేనే అక్షరాలు నేర్చేది!

వారంతా అడవి బిడ్డలు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు. పిల్లల జీవితాలు తమలా కాకూడదని భావించిన తల్లిదండ్రులు.. చిన్నారులను చదివించేందుకు ముందుకొచ్చారు. అయితే ఆ పల్లెలో బడి లేకపోకపోవడంతో చిన్నారులు అక్షరాలు దిద్దేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని కొండతోగు మారుమూల గ్రామం. అక్కడ పాఠశాల లేకపోవడంతో పిల్లలు రోజూ కాలినడకన 3 కి.మీ. దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్నారు. పదేళ్లయినా నిండని పసివారు.. ముళ్లపొదలు, రాళ్లు రప్పలు, వాగులు వంకలు దాటుకుంటూ సరస్వతీ నిలయానికి చేరుకుంటున్నారు.



# తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు బుధవారం భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి 28వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువ గోదావరికి విడుదల చేస్తున్నారు. ఎగువ ఛత్తీస్‌గఢ్‌తో పాటు తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు భారీగా వరద పోటెత్తింది. తాలిపేరుతో పాటు చింత వాగు, పగిడి వాగు, రోటెంత వాగు, రాళ్ల వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో జలాశయానికి ఒక్కసారిగా వరద నీరు వచ్చి చేరింది. తాలిపేరు ప్రాజెక్టు నుంచి వరద పరవళ్లు తొక్కుతూ ఉండటంతో దిగువ తేగడ వద్ద లో లెవల్ చప్టా నీటమునిగింది. వరద పరిస్థితిని ఏఈ సంపత్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈతవాగు వరద రోడ్డుపైకి చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు రామచంద్రాపురం, బత్తినపల్లి, బట్టి గూడెం తదితర గ్రామాల్లో వాగులు పొంగుతున్నాయి.




# కరీంనగర్‌లో భారీ వర్షం.. జలమయమైన రహదారులు

కరీంనగర్: తూర్పు, పశ్చిమ ద్రోణి ప్రభావంతో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బుధవారం వర్షం ఎడతెరపి లేకుండా కురుస్తూనే ఉంది. దీంతో ప్రధాన రహదారులపై భారీగా వరద నీరు చేరింది. ఇళ్లల్లోకి సైతం నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



# రూ.69లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాం

హైదరాబాద్: నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న 9 మందిని హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కొకైన్ సరఫరా చేస్తున్న ఆరుగురు, మెఫిడ్రీన్ సరఫరా చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 286 గ్రాముల కొకైన్, 11 గ్రాముల ఎక్స్‌టసీ, తుపాకీ, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలను సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. "డగ్స్ కేసులో రవివర్మ, సచిన్ అనే ఇద్దరు కీలక వ్యక్తులను పట్టుకుని వారి నుంచి ముఖ్యమైన సమాచారం సేకరించాం. రవివర్మకు ముంబయికి చెందిన ముఠాతో సంబంధాలున్నాయి. అక్కడ ఉన్న వాహిద్ అనే వ్యక్తికి విదేశాల నుంచి కొకైన్ వస్తోంది. అతడి నుంచి నిందితులు హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొస్తున్నారు. ప్రేమ్ ఉపాధ్యాయ్ అనే వినియోగదారుడిని అరెస్ట్ చేయడంతో ఈ ముఠా గుట్టురట్టయింది. నిందితుల నుంచి రూ.69లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాం. కాటేదాన్‌లో డ్రగ్స్ దందా చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన పవన్ భాటీని కూడా అరెస్ట్ చేశాం. హేమ్‌సింగ్ అనే మరో వ్యక్తితో కలిసి పవన్ భాటీ డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. నిందితులు ముందు జాగ్రత్తగా రివాల్వర్, బుల్లెట్లు కూడా కొనుగోలు చేశారు" అని సీపీ వివరించారు.

# భారీ వర్షాలు.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి: మంత్రి పొన్నం



హైదరాబాద్: రాష్ట్రంలో.. ముఖ్యంగా హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 3 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, కలెక్టర్ దాసరి హరిచందన, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, మెట్రో వాటర్ వార్క్స్, ట్రాఫిక్ అధికారులతో మంత్రి సమీక్షించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత వారం కురిసిన వర్షాలకు నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయని, మరోసారి అలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.



# ఎయిరిండియా ప్రమాదం.. మృతదేహాలు తారుమారు!

అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద బాధితుల కుటుంబాలకు మరో సమస్య ఎదురైంది. యుకేలో కనీసం రెండు కుటుంబాలకు చేరాల్సిన మృతదేహాలు మారిపోయినట్లు తేలింది. బాధితుల పక్షాన పనిచేస్తున్న న్యాయవాది ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ మృతదేహాలు అహ్మదాబాద్‌లోని ఓ ఆస్పత్రి నుంచి సీల్ చేసిన శవపేటికల్లో యూకేకు తరలించారు. తాజాగా బాధితుల పక్షాన కేసును చూస్తున్న 'కీస్టోన్ లా' సంస్థకు చెందిన న్యాయవాది మాట్లాడుతూ "మృతుల అవశేషాలను తప్పుగా గుర్తించి.. వాటినే యూకేకు పంపించారు. అసహజ మరణాలను పరిశీలించే కరోనర్ ఆ మృతదేహాల అవశేషాలకు తిరిగి పరీక్షలు నిర్వహించగా అసలు విషయం బయటపడింది. ఈ విషయాన్ని కరోనర్ సదరు కుటుంబానికి తెలియజేయడంతో.. అంత్యక్రియలను వాయిదా వేసుకొంది. ఆ శవపేటికలోని మృతదేహం గుర్తు తెలియని వ్యక్తిది. వారి కుటుంబ సభ్యుడిది కాదు"అని వెల్లడించారు. మరో శవపేటికలో వేర్వేరు వ్యక్తుల అవశేషాలున్నాయని సదరు న్యాయవాది చెప్పారు. "ఆ కుటుంబానికి ఇద్దరు వ్యక్తులకు చెందిన శరీర అవశేషాలను పంపించారు. వాటిని అంత్యక్రియలకు తీసుకెళ్లబోయే ముందు వేరు చేశారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా ఏఐ171 విమానం ప్రమాదానికి గురైంది. దీనిలో 241 మంది చనిపోయారు. వీరిలో 53మంది బ్రిటన్ వాసులు ఉన్నారు. చాలా మంది అంత్యక్రియలు భారత్‌లోనే ముగించారు.

కేవలం 12 మంది మృతదేహాల అవశేషాలను మాత్రమే బ్రిటన్‌కు తరలించారు. వీటికి డీఎన్ఏ పరీక్షలకు అహ్మదాబాద్‌లోని సివిల్ ఆస్పత్రిలో నిర్వహించారు. మృతుల బంధువులను ఇక్కడికే పిలిపించి వారి నుంచి డీఎన్ఏ నమూనాలు సేకరించారు. వారికి సాయం చేసేందుకు ఎయిర్ ఇండియా కెనైన్స్ ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ సర్వీసెస్ సంస్థను నియమించింది.

**రాజీనామాకు ముందు.. ముందస్తు షెడ్యూల్ లేకుండా రాష్ట్రపతి భవన్‌కు ధన్‌ఖడ్!..** తాజాగా ఈ అంశంపై బ్రిటన్ కుటుంబాలకు సాయం చేస్తున్న ఏవియేషన్ లాయర్ జేమ్స్ హేలీ ప్రాట్ మాట్లాడుతూ "నేను ఆ బ్రిటిష్ కుటుంబాలతో నెలరోజులుగా ఉన్నాను.

మొదట వారి ఆత్మీయుల మృతదేహాలను వెనక్కి తీసుకురావాలని కోరుకున్నారు. కానీ, వాటిల్లో కొన్ని మారిపోయాయి. వీటిని సరిచేయడానికి మరికొన్ని వారాలు పట్టొచ్చు" అని పేర్కొన్నారు. ఇప్పుడు శిథిలాల నుంచి మృతదేహాలను వెలికి తీసిన ప్రక్రియ నుంచి తిరిగి పరిశీలించడం మొదలుపెట్టారు.

# మహాలక్ష్మి పథకంతో లాభాల్లోకి తెలంగాణ ఆర్టీసీ: భట్టి విక్రమార్క



హైదరాబాద్: తెలంగాణలో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తెచ్చినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా ఎంజీబీఎస్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం ద్వారా నేడు ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందన్నారు. 200 కోట్ల ప్రయాణాలతో రూ.6 వేల కోట్లు ఆర్జించిందన్నారు.

కాంగ్రెస్ హయాంలో ఆర్టీసీ బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. ఆక్యుపెన్సీ రేటు ఒకప్పుడు 67 శాతం ఉంటే ఈరోజు 97 శాతానికి వచ్చిందన్నారు. ఆర్టీసీ ఇటీవల వేల సంఖ్యలో కొత్త బస్సులు కొన్నట్లు తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఖర్చుకు వెనకాడకుండా ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు.

**గత పాలకులు ఆర్టీసీని విధ్వంసం చేశారు: మంత్రి పొన్నం...** ఆర్టీసీలో కొత్తగా నియామకాలు జరుగుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. సంస్థలో పెండింగ్ బకాయిలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలతో బస్సులు కొనుగోలు చేయిస్తున్నామన్నారు. గత పాలకులు పదేళ్లు ఆర్టీసీని విధ్వంసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ బస్సుకు నిప్పు పెట్టిన ఆకతాయిలు

మిర్యాలగూడ: పార్కింగ్‌లో ఉన్న నైట్‌హాల్ట్ ఆర్టీసీ బస్సుకు ఆకతాయిలు నిప్పుపెట్టిన ఘటన నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో అర్ధరాత్రి చోటు చేసుకుంది. మిర్యాలగూడ డిపోనకు చెందిన టీఎస్ 05జెడ్ 0047 నంబర్ బస్సును రోజు మాదిరిగానే గ్రామంలోని ప్రధాన బస్‌స్టాప్ కూడలిలో పార్కింగ్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు బస్సు వెనుకవైపు నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్, కండక్టర్.. పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారమందించడంతో మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో బస్సు వెనుక భాగం టైర్లతో సహా పూర్తిగా దగ్ధమైంది. నిప్పుపెట్టిన ఆకతాయిల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.



# తెలంగాణలో రెండ్రోజులు భారీ వర్షాలు


హైదరాబాద్: తూర్పు, పశ్చిమ ద్రోణి ప్రభావంతో తెలంగాణలో ఇవాళ, రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇవాళ ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట, హనుమకొండ, వరంగల్ , జనగామ, మహబూబాబాద్, ఖమ్మం, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్‌తో పాటు మిగతా జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై ఉండడంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. అప్పుడప్పుడు జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.




# ఆల్‌టైమ్ గరిష్ఠానికి ఎటెర్నల్ షేర్లు

జొమాటో, బ్లింకిట్ పేరిట వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎటెర్నల్ షేర్లు కొత్త మైలురాయిని అందుకున్నాయి. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో మంగళవారం కంపెనీ షేర్లు రూ.311 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని తాకాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్లు దాటింది. నిఫ్టీ 50లో ప్రముఖ కంపెనీలైన విప్రో, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నెస్లే ఇండియా వంటి కంపెనీలను అధిగమించింది. నిన్నటి త్రైమాసిక ఫలితాల్లో ఎటెర్నల్ లాభాల్లో 90 శాతం క్షీణత నమోదైంది. కేవలం రూ.25 కోట్ల నికర లాభాన్ని మాత్రమే నమోదు చేసింది. అదే సమయంలో ఆదాయంలో మాత్రం 70 శాతం వృద్ధి నమోదు చేసింది. గతేడాది రూ.4,206 కోట్లుగా ఉన్న ఆదాయం రూ.7,167 కోట్లకు పెరిగింది. దీనికితోడు క్విక్ కామర్స్ విభాగమైన బ్లింకిట్ రాణించడంతో ఎటెర్నల్‌కు కలిసొచ్చింది. జొమాటో నెట్ ఆర్డర్ వాల్యూను తొలిసారి బ్లింకిట్ దాటేసింది. గతేడాదితో పోలిస్తే గ్రాస్‌ఆర్డర్ వాల్యూలో 140 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది ఇన్వెస్టర్లను మెప్పించింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పలు బ్రోకరేజీ సంస్థలు కూడా ఎటెర్నల్‌కు 'బై' రేటింగ్ ఇచ్చాయి. నొమురా ఎటెర్నల్ టార్గెట్ ప్రైస్‌ను రూ.280 నుంచి రూ.300కు పెంచగా.. నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తన టార్గెట్ ప్రైస్‌ను రూ.290 నుంచి రూ.320కి సవరించింది. జెఫ్రీస్ అయితే ఏకంగా ఎటెర్నల్ టార్గెట్ ప్రైస్‌ను రూ.250 నుంచి రూ.400కు పెంచడం గమనార్హం. ఈ కారణంగా ఎటెర్నెల్ షేర్లు దూసుకెళ్తున్నాయి. గత 12 నెలల్లో ఎటెర్నల్ షేర్లు 33 శాతం రాణించగా.. 2025లో 7 శాతం మేర పెరిగాయి. మరోవైపు ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్ విభాగంలో ఉన్న స్విగ్గీ షేర్లు కూడా రాణిస్తున్నాయి. ఎటెర్నెల్ ఎఫెక్ట్‌తో 5 శాతం లాభంతో రూ.412 వద్ద ట్రేడవుతున్నాయి.

# విశ్వ నరుడు గుర్రం జాషువా - జూలై 24... కవి కోకిల వర్ధంతి




ఒక అంటరాని వాడు, పవిత్రమైన హిందూ గ్రంథాలు ,కావ్యాలు చదువు తున్నాడని ఇటు హిందూ ఛాందసులు కన్నెర్రజేస్తే, క్రైస్తవుడై వుండి హిందూ నాటకాలు రాసి హిందూ మత ప్రచారానికి తోడ్పడు తున్నాడని క్రైస్తవ మతాధిపతుల ఆగ్రహానికి గురైనాడు జాషువా. ఒక వంక దారిద్ర్యం, మరోవంక కుల మత వివక్ష, బాల్యంనుంచే జాషువా ఎన్నో అవమానాల్ని, అవ హేళనల్ని, ఛీత్కారాలను ఎదుర్కొన్నాడు. చిన్నతనం నుంచే తిరగబడే తత్వంతో వీటన్నింటినీ అధిగమించిన జాషువా, విద్యార్థి దశనుంచే వ్యంగ చిత్రాలు గీయడం, గొల్లసుద్దులు పాడుకోవడం, లలిత కళల పట్ల ఆసక్తి పెంచు కొన్నాడు. దీపాల పిచ్చయ్యశాస్త్రి, జూపూడి హనుమచ్ఛాస్త్రి వంటి కొందరు జాషువా ఉన్నతికి తోడ్పడితే, మరి కొందరు జాషువాను కులం పేరుతో తీవ్రంగా అవమానించారు. జీవితంలో ఎన్నోసార్లు, ఎన్నోచోట్ల జాషువా కులం తెలుసుకొని అవమానించినా, ఆవేదనకు లోనైనా, నిరుత్సాహ పడక, "కళకు కుల మతాలున్నాయా?" అని ప్రశ్నిస్తూ, ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని గొప్పకవిగా ఖ్యాతిని పొందారు. "విశ్వనరుడ నేను" అని సామాజిక వాస్తవికతను నిర్భయంగా చాటారు. పుట్టుకతో దళితుడైనా, పట్టుదలతో కవిశేఖరుడై, నవయుగ కవిచక్రవర్తి, తమ కవితా ప్రతిభతో తెలుగు సాహితీ లోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి జాషువా. ఆయన సమకాలీన కవిత్వ ఒరవడి యైన భావ కవిత్వపు రీతి నుండి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశాడు. జాషువా 1895, సెప్టెంబర్ 28 న గుర్రం వీరయ్య, లింగమ్మ దంపతులకు ఆంధ్ర ప్రదేశ్ లోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించాడు. తండ్రి యాదవులు, తల్లి మాదిగ. మూఢాచారాలతో నిండిన నాటి సమాజంలో అవమానాలకు లోనైనాడు. అయినా జాషువా ఊరుకొనే వాడు కాదు, తిరగ బడేవాడు. అగ్రవర్ణాల పిల్లలు కులం పేరుతో హేళన చేస్తే, తిరగబడి వాళ్ళను కొట్టాడు. 1910లో మేరీని పెళ్లి చేసు కున్నాడు. అయినా ఆయన కుటుంబాన్ని క్రైస్తవ సమాజం నుండి బహిష్కరించారు. మిషనరీ పాఠశాలలో నెలకు మూడు రూపాయల జీతంపై ఉద్యోగం చేసేవాడు. తర్వాత రాజమండ్రి వెళ్లి 1915-16 లలో అక్కడ సినిమా వాచకుడిగా పని చేసాడు. టాకీ సినిమాలు లేని ఆ రోజుల్లో తెరపై జరుగుతున్న కథకు అనుగుణంగా నేపథ్యంలో కథను, సంభాషణలను చదువుతూ పోవడమే ఈ పని. తరువాత గుంటూరులోని లూథరన్ చర్చి నడుపుతున్న ఉపాధ్యాయ శిక్షణాలయంలో ఉపాధ్యాయుడిగా 10 సంవత్సరాల పాటు పనిచేసాడు. తరువాత 1928 నుండి 1942 వరకు గుంటూరు లోనే ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేసాడు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ప్రచారకుడిగా కూడా పనిచేసాడు. 1957-59 మధ్య కాలంలో మద్రాసు రేడియో కేంద్రంలో కార్యక్రమ నిర్మాతగా పని చేసాడు. చిన్నతనం నుండి జాషువాలో సృజనాత్మక శక్తి ఉండేది. బాల్య స్నేహితుడూ, తరువాతి కాలంలో రచయితా అయిన దీపాల పిచ్చయ్య శాస్త్రి సాహచర్యంలో ఆయనకు కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమచ్ఛాస్త్రి వద్ద మేఘసందేశం,రఘువంశం, కుమార సంభవం నేర్చుకున్నాడు. జాషువా 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు రాసాడు. కళకు కులమతాలున్నాయా? అంటూ జాషువా ప్రశ్నిస్తూ "నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి, రూపు రేఖా కమనీయ వైఖరులు గాంచి భళీభళీ యన్నవారే, మీదే కుల మన్న ప్రశ్న వెలయించి, చివాలున లేచిపోవుచో బాకున గ్రుమ్మినట్లగున్ పార్థివ చంద్ర! వచింప సిగ్గగున్!" అంటూ వెంకటగిరి రాజా గారికి తన ఆవేదన చెప్పుకున్నాడు. "కుల మతాలు గీచుకున్న గీతలు జొచ్చి పంజరాన గట్టు వడను నేను నిఖిలలోక మెట్లు నిర్ణయించిన నాకు తరుగు లేదు విశ్వనరుడ నేను'. అయితే కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ఈ మూఢాచారాలపై తిరగబడ్డాడు. జాషువా, ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందాడు. అగ్రవర్ణ దురహంకారాలను చవి చూసిన జాషువా సౌమ్య పదజాలం తోనే వాటిని ఎదిరించాడు. ఓ సందర్భంలో ఆయనే చెప్పినట్టు "నాకు గురువులు ఇద్దరు...పేదరికం, కులమత భేదం. ఒకటి సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచింది. "ఆయన కవిగా, వ్యక్తిగా విరాట్రూప ప్రదర్శనకు నేపథ్యాలు. ఆయన క్రమంగా ఆయన నాస్తికత్వం వైపు జరిగాడు. బాల్య స్నేహితుడు, తరువాతి కాలంలో రచయిత అయిన దీపాల పిచ్చయ్య శాస్త్రి సాహచర్యంలో ఆయనకు కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమచ్ఛాస్త్రి వద్ద మేఘసందేశం, కుమార సంభవం, రఘు వంశం నేర్చుకున్నాడు. జాషువా 36 గ్రంథాలు, మరెన్నో కవిత ఖండికలు వ్రాశాడు. వాటిలో ప్రముఖమైనవి...క్రీస్తుచరిత్ర , గబ్బిలం, ఫిరదౌసి, రుక్మిణీ కళ్యాణం, శ్మశాన వాటిక, వివేకానంద, జేబున్నీసా, నాగార్జున సాగరం, కాందిశీకుడు. 'నా కథ' పేరుతో ఆత్మకథను కూడా వ్రాసు కున్నారు. ఆయన మనో భావాన్ని దళిత యువకుడి ద్వారా చక్కగా చెప్పాడు."వాని నుద్ధరించు భగవంతుడే లేడు, మనుజెటట్లు వాని గనికరించు, వాడు జేసికొన్న పాపకారణ మేమొ యింత వరకు వాని కెరుకలేదు.""ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి యినుపగజ్జెల తల్లి జీవనము సేయు, గసరి బుసకొట్టు నాతని గాలిసోక నాల్గు పడగల హైందవ నాగరాజు". ఇలా చెప్పుకుంటూ పోతే, ప్రతి పద్యాన్ని ఉదహరించ వచ్చు."సుకవి జీవించు ప్రజల నాల్కల యందు" అనే ఈ పద్యంలో కవిలోకానికి జాషువా సముచిత స్థానం కల్పించాడు. తిరుపతి వెంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి, జాషువా కాలికి గండ పెండేరం తొడిగి "ఈ కవిశ్వరుని పాదం తాకి నా జన్మ ధన్యం చేసుకున్నాను" అన్నాడు. అది తనకు లభించిన "అత్యున్నత పురస్కారం"గా జాషువా భావించాడు.1964లో క్రీస్తు చరిత్రకు "కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు" లభించగా, ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి సభ్యునిగా నియమితుడయ్యాడు. 1970లో ఆంధ్ర విశ్వ విద్యాలయము కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. భారత ప్రభుత్వము పద్మభూషణ పురస్కారం అందజేసింది. విశ్వనాథ సత్యనారాయణ, జాషువా ఒక మధుర కవి అని, ఒకానొక మాధుర్యం ఆయన కవిత్వంలో శారదాదేవి అనుగ్రహం చేత లభించిందని అన్నాడు. "ఆయన వ్రాసిన శిశువు (పాపాయి) అనే ఖండికను ఘంటసాల అద్భుతంగా గానం చేశారు. ఈ సందర్భంలో ఈ పాట రికార్డింగ్ జరిగే సమయంలో జాషువా, ఘంటసాల యింటికి వెళ్ళి, బయట అరుగు మీద కూర్చున్నారట. ఘంటసాల, బయటకు వచ్చి, "ఏమిటండీ! బయటనే కూర్చున్నారు" అని అడిగితే, "నేను అంటరాని కులమునకు చెందిన వాడను, మీరు బ్రాహ్మణులు, మీ అనుమతి లేకుండా లోపలి ఎలా రాగలను?" అన్నారట జాషువా. అందుకు, ఘంటసాల "నాకు అటువంటి పట్టింపులు లేవు, మీరు స్వేచ్ఛగా లోపలి రావచ్చు. పైగా మీరు సరస్వతీ పుత్రులు. మీరు అంటరాని వారైతే, సరస్వతీ దేవి కూడా అంటరానిదనే కదా అర్థం!" అని చెప్పియింటి లోకి సాదరంగా తీసుకొని వెళ్లి, తన సహృదయాన్ని చాటుకొన్న ధన్యజీవి ఘంటసాల. కవితా విశారద, కవికోకిల, కవి దిగ్గజ - నవయుగ కవి చక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్ గా ప్రసిద్ధు డయ్యాడు. "వడగాల్పు నా జీవితమైతే, వెన్నెల నా కవిత్వం" అని జాషువా అన్నది అక్షర సత్యం. "రాజు మరణించె నొక తార రాలిపోయె, సుకవి మరణించె నొక తార గగనమెక్కె, రాజు జీవించు రాతి విగ్రహముల యందు, సుకవి జీవించు ప్రజల నాల్కల యందు". " సత్కవీంద్రుని కమ్మని కలము, నిప్పులలోన గఱగిపోయె ! యిచ్చోటబీ నే భూము లేలు రాజన్యుని యధికార ముద్రిక లంతరించె! యిచ్చోటబీ నే లేఁత యిల్లాలి నల్లపూసల సౌరు, గంగలో గలిసిపోయె! యిచ్చోటబీ నెట్టి పేరెన్నికం గనుఁగొన్న చిత్ర లేఖకుని కుంచియ, నశించె! ఇది పిశాచులతో నిటాలేక్షణుండు గజ్జె గదలించి యాడు రంగస్థలంబుబీ ఇది మరణ దూత తీక్షణమౌ దృష్టి లొలయ నవనిఁ బాలించు భస్మ సింహాసనంబు". స్మశాన వాటిక లోని ప్రతి పద్యం మన గుండెలను పిండుతుంది. చివరికి జూలై 24, 1971న గుర్రం జాషువా లోకం వదిలి వెళ్లారు. కాని ఆయన మరణవార్త బయటి ప్రపంచానికి చెప్పని ఇంటి వాతావరణం. అంతిమ యాత్ర అయిన వారు వెంట లేకుండా సాగింది. సమాజం ఆయనను చిన్న చూపు చూసింది, దూరంగా పెట్టిందని మథనపడిన జాషువా చివరి దశలో కుటుంబ సభ్యులు ఆయనను దూరం చేశారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# ఆదాయపు పన్ను దినం...ఆర్థిక చైతన్యానికి పౌర బలం - జూలై 24... ఆదాయపు పన్ను దినం

జూలై 24 - భారత ఆర్థిక చైతన్యానికి సంకేతంగా నిలిచే ఆదాయపు పన్ను దినోత్సవం. ఇది కేవలం ఓ చట్టబద్ధమైన విధానం రోజు కాదు. ఇది ప్రజల ఆర్థిక బాధ్యతను, ప్రభుత్వానికి పౌరుల భాగస్వామ్యాన్ని, నైతికతను, పారదర్శకతను గుర్తుచేసే చైతన్య దినం. భారత దేశంలో ఆదాయపు పన్ను చట్టం మూలాలు బ్రిటిష్ కాలం లోకే వెళ్తాయి. 1857 సిపాయిల తిరుగు బాటుతో ఏర్పడిన ఆర్థిక లోటును తీర్చేందుకు 1860 జూలై 24న బ్రిటన్ ఆర్థిక మంత్రి సర్ జేమ్స్ విల్సన్ పర్యవేక్షణలో ఆదాయపు పన్ను విధానం రూపొందించ బడింది. గవర్నర్ జనరల్ లార్డ్ కేనింగ్ మద్దతుతో తొలిసారిగా భారత దేశంలో ఆదాయపు పన్ను అమలు లోకి వచ్చింది. ఈ చరిత్రాత్మక నిర్ణయం భారత ఆర్థిక పరిపక్వతకు నాంది పలికింది. ఈ చారిత్రికతకు గౌరవ సూచకంగా భారత ఆదాయపు పన్ను శాఖ 2010 నుంచి ప్రతి సంవత్సరం జూలై 24ను ఆదాయపు పన్ను దినంగా అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పన్ను చెల్లింపు దారుల పట్ల కృతజ్ఞత ప్రకటిస్తూ అవగాహన కార్యక్రమాలు, సాంకేతిక శిక్షణలు, విజేతల సన్మానాలు నిర్వహించ బడుతున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961నాటి చట్టం, ఇది 1962 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం వ్యక్తులు, కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు తమ ఆదాయానికి తగిన విధంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పన్ను వసూళ్లను పర్యవేక్షించే ఆదాయపు పన్ను శాఖ దీనిని నిష్ఠతో అమలు చేస్తోంది. భారత ఆర్థిక వ్యవస్థలో ఆదాయపు పన్ను కీలకమైన వనరుగా నిలుస్తోంది. దేశానికి వచ్చే మొత్తం పన్ను ఆదాయంలో సగానికి పైగా ఆదాయపు పన్నుల ద్వారానే లభిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే ఆదాయపు పన్నుల ద్వారా రూ.10 లక్షల కోట్లకు పైగా ఆదాయం నమోదైంది. ఈ ఆదాయం తోనే ప్రభుత్వం ఆరోగ్యం, విద్య, రక్షణ, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు పెడుతోంది. పన్ను చెల్లించే వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఆదాయపు పన్ను శాఖ అనేక సంస్కరణలను ప్రవేశ పెట్టింది. ముఖ్యంగా ఫేస్‌లెస్ అసెస్మెంట్ విధానం ద్వారా అవినీతి నివారణ, ఇ-ఫైలింగ్ వేదిక ద్వారా సులభత, ప్రీఫిల్డ్ రిటర్న్‌లతో ప్రజలకు సమయాన్ని ఆదా చేసే మార్గం, డిజిటల్ చెల్లింపు పద్ధతుల ద్వారా పారదర్శకత పెరిగింది. అంతేకాక, ఆధునిక టెక్నాలజీని




వినియోగించుకుని పన్ను చెల్లింపు దారుల అనుభవాన్ని మెరుగు పరచడం జరిగింది. పన్ను విధానంలో సామాజిక సమతుల్యతకూ ప్రాధాన్యం ఇచ్చారు. అధిక ఆదాయం కలిగిన వారు అధిక పన్ను చెల్లిస్తే, తక్కువ ఆదాయం కలిగిన వారు మినహాయింపులను పొందే విధంగా వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఫలితంగా, సమాజంలోని బలహీన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయి. 2023%-%24లో దేశవ్యాప్తంగా 8.2 కోట్లకు పైగా పన్ను చెల్లింపు దారులు నమోదయ్యారు. వారిలో 60 శాతం పాత పన్ను విధానాన్ని ఎంచుకోగా, మిగిలినవారు కొత్త పన్ను విధానాన్ని అనుసరించారు. ఇది ఆదాయ స్థాయిలను బట్టి వ్యక్తులు ఎంచుకునే స్వేచ్ఛను సూచిస్తుంది. ఇదే ప్రజల ఆర్థిక చైతన్యానికి నిదర్శనం. పన్ను చెల్లించడాన్ని నేరుగా చట్టబద్ధ కర్తవ్యంగా కాక, దేశానికి చేసే సేవగా భావించాల్సిన అవసరం ఉంది. ప్రతి పౌరుడు తన ఆదాయానికి తగిన విధంగా పన్ను చెల్లిస్తే మాత్రమే సమాజంలో సమతుల్యత, అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆదాయపు పన్ను దినం అంటే కేవలం పన్ను చట్టాన్ని గుర్తు చేసే రోజు కాదు. ఇది ప్రజల ఆర్థిక బాధ్యతకు గుర్తుగా నిలిచే అవిశ్రాంత పిలుపు. ఈ సందర్భంగా 'పన్ను చెల్లించు - దేశాన్ని నిర్మించు' అనే నినాదం ప్రజల మనసుల్లో నాటుకోవాలి. జూలై 24 %-% ఇది దేశాభివృద్ధిలో పౌర సహకారానికి ఒక నిశ్చల గుర్తింపు, భవిష్యత్ భారత నిర్మాణానికి ప్రజల నైతిక ఆర్థిక చింతనకు నిలిచే శాశ్వత పిలుపు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# జాతీయ థర్మల్ ఇంజనీర్ దినోత్సవం

## - శక్తి సమీకరణకు శాస్త్ర బద్ధ సంకల్పం - జూలై 24...జాతీయ థర్మల్ ఇంజనీర్ దినోత్సవం

ఉష్ణతా నియంత్రణ శాస్త్రం ఆధారంగా సమగ్ర శక్తి నిర్వహణకు మౌలిక మద్దతుగా నిలిచే థర్మల్ ఇంజనీర్ల సేవలను గుర్తించే సందర్భమే జూలై 24న జరుపుకునే జాతీయ థర్మల్ ఇంజనీర్ దినోత్సవం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వ్యవస్థలో ఈ రంగానికి, ఈ వృత్తి నిపుణులకు ఉన్న స్థానం అమోఘం. మనం నిత్యజీవితంలో ఉపయోగించే కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్‌లు, డేటా సెంటర్లు, విద్యుత్ ప్లాంట్లు, పరిశ్రమలు, వైద్య పరికరాలు, అంతరిక్ష వ్యవస్థలు అన్నింటిలోనూ వేడి నియంత్రణ ప్రధానమైన అవసరంగా నిలుస్తుంది. ఈ నియంత్రణకు శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానంతో రూపమిచ్చే వారు థర్మల్ ఇంజనీర్లు. సమకాలీన అవసరాలనుగుణంగా తక్కువ ఇంధన వినియోగంతో గరిష్ఠ పనితీరు సాధించే సాంకేతికతలు అందించడంలో ఈ రంగ నిపుణులు చురుగ్గా పనిచేస్తున్నారు. థర్మల్ ఇంజనీర్ల కృషిని సామాన్య ప్రజానీకం ముందుకు తీసుకు రావాలన్న సంకల్పంతో 2014లో అమెరికాలోని అడ్వాన్స్‌డ్ థర్మల్ సొల్యూషన్స్ సంస్థ ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. అనేక పరిశ్రమల్లో వీరి పాత్ర ప్రధానమైనదైనా, సాఫ్ట్‌వేర్ లేదా డిజైన్ ఇంజనీరింగ్‌లా వీరి సేవలు ప్రత్యక్షంగా ప్రజలకు కనిపించవు. ఈ కారణంగా వీరిపై ప్రజల్లో అవగాహన తక్కువగా ఉండటం చూశారు. ఈ లోపాన్ని తీర్చడమే లక్ష్యంగా, సంవత్సరంలో అత్యంత వేడిగల రోజుల్లో ఒకటైన జూలై 24ను థర్మల్ ఇంజనీర్ దినోత్సవంగా ప్రకటించారు. ఇది వేడి పీడనాన్ని ఎదుర్కొంటూ పనిచేసే థర్మల్ ఇంజనీర్ల కృషికి ఒక ప్రాతినిధ్యమే. థర్మల్ ఇంజనీర్ అనగా వేడి ఉత్పత్తి, మార్పిడి, వినియోగం, శీతీకరణ వంటి ప్రక్రియలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సమర్ధవంతమైన పరిష్కారాలు అందించే నిపుణులు. వీరు థర్మోడైనమిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఫ్లూయిడ్ మెకానిక్స్ వంటి శాస్త్ర విభాగాలలో నిపుణులై ఉండాలి. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో వేడి నీటిని ఆవిరిగా మార్చి టర్బైన్‌లను నడిపించడం, %ఎవాూజ% వ్యవస్థలు రూపకల్పన చేయడం, డేటా సెంటర్లలో వేడి నియంత్రణ, వైద్య పరికరాల లోపల నిగూఢంగా ఉన్న కూలింగ్ సిస్టమ్‌లు వంటి వాటికి నిశ్శబ్ద సూత్రధారులే థర్మల్ ఇంజనీర్లు. ఈవిధంగా వేడి నియంత్రణ మార్గాల ద్వారా పరికరాల పనితీరు, విశ్వసనీయత, ఆయుష్షు పెరుగుతుంది. ఈ రంగంలోని సేవలు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, పరిశ్రమల ఉష్ణ వ్యవస్థలు, ఆటోమొబైల్ శక్తి వినియోగ నియంత్రణ, వైమానిక పరిశోధనలలో అంతరంగిక భాగస్వామ్యం కలిగిన హీట్ షీల్డ్ డిజైన్, మెడికల్ డివైజ్‌లలో టెంపరేచర్ మేనేజ్‌మెంట్ వరకు విస్తరించాయి. ప్రత్యేకించి తాజా కాలంలో ఎలక్ట్రానిక్ పరికరాలు ఎక్కువ వేడి ఉద్గరిస్తుండటంతో, అతి చిన్న గ్యాడ్జెట్ నుండి భారీ ప్రాసెసింగ్ యూనిట్ వరకు హీట్ డిసిపేషన్ మెథడ్స్, థర్మల్ ఇన్సులేషన్ టెక్నాలజీలు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉన్నాయి. ఈ రంగంలో థర్మల్ ఇంజనీర్‌లు వినూత్నమైన మార్గాలపై శోధనలు సాగిస్తున్నారు. విద్యా రంగంలో మెకానికల్ ఇంజనీరింగ్ ఉపశాఖగా థర్మల్ ఇంజనీరింగ్ అభివృద్ధి చెందింది. పలు సాంకేతిక విశ్వ విద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలలు ఈ రంగంలో ప్రత్యేక కోర్సులు అందిస్తున్నాయి. హీట్ ఎక్స్ఛేంజర్లు, బాయిలర్ టెక్నాలజీ, థర్మల్ పవర్లాంటి కోర్సులు విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు




అనుగుణంగా శిక్షణనందిస్తున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు అయిన ఎన్టీపీసీ, భేల్, ఐఓసీఎల్, ప్రైవేటు విద్యుత్, పరిశ్రమల సంస్థలు, అంతర్జాతీయ సంస్థలలో థర్మల్ ఇంజనీర్‌లకు విస్తృత అవకాశాలున్నాయి. అంతేకాక, పునరుత్పాదక శక్తి రంగంలో కూడా థర్మల్ ఇంజనీర్లు కీలక భాగస్వాములుగా మారుతున్నారు. సౌర శక్తి, జియోతర్మల్, బయోమాస్ ఆధారిత థర్మల్ మేనేజ్‌మెంట్‌పై పరిశోధనలు నడుస్తున్నాయి. ఈ దినోత్సవం సందర్భంగా థర్మల్ రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రదర్శించడం, పరిశోధనా పత్రాలను సమర్పించడం, విద్యార్థులకు శిక్షణా శిబిరాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించడం ద్వారా పరిశ్రమ-విద్యా రంగాల మధ్య అనుసంధానం పెరుగుతోంది. పరిశ్రమలలో పనిచేస్తున్న ఇంజనీర్‌లకు గుర్తింపుగా సంస్థలు ప్రత్యేక అభినందనలు, అవార్డులు ప్రకటిస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా ప్రచార కార్యక్రమాలు, చర్చలు కూడా జరుగు తున్నాయి. యువతలో ఈ రంగంపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇది ఒక దిశానిర్దేశక వేదికగా నిలుస్తోంది. భవిష్యత్తు శక్తి అవసరాలను తీర్చేందుకు సుస్థిర శక్తి ఆధారిత అభివృద్ధి మార్గంలో థర్మల్ ఇంజనీర్లకు కీలక పాత్ర ఉంది. పర్యావరణ పరిరక్షణతోపాటు శక్తి సామర్థ్యం పెంపు, నష్టాల తగ్గింపు, ఖర్చుల నియంత్రణ వంటి అంశాలపై అధిక దృష్టి అవసరం. థర్మల్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న సాంకేతిక అవకాశాలను మనం సమర్థంగా వినియోగించుకున్నప్పుడే అభివృద్ధి, ఆవిష్కరణలు, పర్యావరణ హితశక్తి సమన్వయం సాధ్యమవుతాయి. ఈ దినోత్సవం సందర్భంగా ఉష్ణశక్తి నియంత్రణ శాస్త్రాన్ని అభివృద్ధి చేయడంలో తమ మేధస్సుతో పాటు శ్రమను కూడా సమర్పిస్తున్న థర్మల్ ఇంజనీర్‌లకు సమాజం తరపున కృతజ్ఞతలు తెలియజేసే బాధ్యత మనపై ఉంది. శక్తి స్థిరత్వానికి శ్రమించే ఈ నిశ్శబ్ద వీరులకు హృదయపూర్వక వందనాలు. దేశ సాంకేతిక భద్రతకు, పారిశ్రామిక వృద్ధికి మూలస్తంభాలైన ఈ మేధావుల సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలవాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# హ్యాకర్ల దాడికి 158 ఏళ్ల కంపెనీ బలి

ఒక చిన్న పొరపాటు ఎంతటి విపత్తుకు దారితీస్తుందో యూకేకు చెందిన ప్రముఖ లాజిస్టిక్స్ సంస్థ KNP గ్రూప్ ఉదంతం మరోసారి స్పష్టం చేసింది. దాదాపు 158 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ సంస్థ, ఇటీవల జరిగిన భయంకరమైన సైబర్ దాడి కారణంగా పూర్తిగా మూతపడింది. ఈ ఘటన వల్ల 700 మంది ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోయి వీధిన పడటం, అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**-శక్తివంతమైన బ్రాండ్ పతనం...** యూకేలో KNP లాజిస్టిక్స్ ఒక విశ్వసనీయమైన రవాణా సంస్థగా పేరుగాంచింది. సుమారు 500 ట్రక్కులను 'ది నైట్స్ ఆఫ్ ఓల్డ్' పేరుతో నిర్వహిస్తూ, రవాణా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంది. ఈ సంస్థకు సైబర్ బీమా ఉన్నప్పటికీ, అకిరా గ్యాంగ్ దాడి నుంచి రక్షణ పొందలేకపోయింది.

**- అకిరా గ్యాంగ్ దాడి.. డేటా బందీ...** ప్రసిద్ధ 'అకిరా' హ్యాకింగ్ గ్యాంగ్ KNP సిస్టమ్‌లలోకి చొరబడి, సంస్థ డేటాను ఎన్‌క్రిప్ట్ చేసింది. దీంతో ఉద్యోగులు తమ సిస్టమ్‌లను యాక్సెస్ చేయలేక, పనిని కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది. హ్యాకర్లు డేటాను తిరిగి ఇవ్వడానికి భారీ మొత్తంలో రాన్సమ్ ధనం డిమాండ్ చేశారు. "మీరు ఇది చదువుతున్నారంటే, మీ అంతర్గత సమాచారం నాశనం అయిందని




అర్థం. కన్నీళ్లు మింగుకొని చర్చలకు సిద్ధమవ్వండి" అంటూ హ్యాకర్లు బెదిరింపు సందేశం పంపారు. నిపుణుల అంచనా ప్రకారం.. హ్యాకర్లు దాదాపు 5 మిలియన్ పౌండ్లు (రూ. 58 కోట్లు) డిమాండ్ చేసి ఉండవచ్చు. అయితే, ఇంత భారీ మొత్తాన్ని చెల్లించలేకపోయిన KNP గ్రూప్ చివరకు మూతపడాల్సి వచ్చింది.

**-సైబర్ భద్రతపై ప్రశ్నలు...** KNP డైరెక్టర్ పాల్ అబాట్ ప్రకారం, హ్యాకర్లు ఉద్యోగుల లాగిన్ పాస్‌వర్డ్‌లను ఉపయోగించి సిస్టమ్‌లలోకి ప్రవేశించినట్లు తేలింది. అయితే, ఏ ఉద్యోగి వివరాల ద్వారా ఇది జరిగిందో మాత్రం వెల్లడించలేదు. ఈ ఘటనపై స్పందించిన నేషనల్ సైబర్ సెక్యూరిటీ సెంటర్ సీఈవో రిచర్డ్ హెార్న్ "ఈ డిజిటల్ యుగంలో వ్యాపారాలు సురక్షితంగా ఉండాలంటే, తమ సిస్టమ్‌లను మరింత పటిష్టంగా, భద్రత కలిగిన విధంగా రూపొందించాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు. ఇలాంటి సైబర్ దాడులకు గతంలో యూకేలోని ఎం అండ్ ఎస్, కో-ఆప్, హారోడ్స్ వంటి అనేక ప్రముఖ కంపెనీలు కూడా బలయ్యాయి. కో-ఆప్ సంస్థలో అయితే 6.5 మిలియన్ల మంది కస్టమర్ల డేటా దొంగిలించబడింది. ఈ దురదృష్టకర సంఘటన మరోసారి సైబర్ భద్రత యొక్క ప్రాముఖ్యతను ప్రపంచానికి గుర్తుచేసింది. డిజిటల్ ప్రపంచంలో, ఒక చిన్న పాస్‌వర్డ్ లోపం కూడా వందలాది మంది ఉద్యోగుల జీవితాలను ప్రభావితం చేయగలదని స్పష్టమవుతోంది. 158 సంవత్సరాలుగా నిలబడిన ఒక సంస్థను ఒక్క దెబ్బతో నేలకూల్చిన ఈ హ్యాకర్ల దాడి, ఇప్పుడు అంతర్జాతీయంగా కొత్త హెచ్చరికగా మారింది.

# కేరళను వీడిన బ్రిటన్ ఎఫ్-35 ఫైటర్ జెట్

## 5 వారాల రహస్య మిషన్‌కు ముగింపు

బ్రిటన్‌కు చెందిన అత్యాధునిక యుద్ధ విమానం ఎఫ్-35బీ ఎట్టకేలకు భారత గగనతలాన్ని వీడి తిరిగి తన ప్రయాణాన్ని ప్రారంభించింది. సాంకేతిక లోపంతో భారత వాయుమార్గంలో అత్యవసరంగా ల్యాండ్ చేసిన ఈ సూపర్ ఫైటర్ జెట్, సుమారు ఐదు వారాల పాటు కేరళలోనే నిలిచిపోయింది.

**-జూన్ 14న అత్యవసర ల్యాండింగ్..** జూన్ 14వ తేదీన తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేసిన ఈ యుద్ధ విమానం, హైడ్రాలిక్ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా క్రియారహితమైంది. మార్గమధ్యంలో ఇంధన లోపం , తీవ్ర వాతావరణ పరిస్థితులు ఏర్పడటంతో పైలట్ అత్యవసరంగా అత్యంత సమీపంలోని విమానాశ్రయాన్ని ఎంచుకొని భారత భూమిపై దిగిపోవాల్సి వచ్చింది.

**-రహస్య మరమ్మతులు, టెస్టింగ్‌లు...** ఈ విమానాన్ని మళ్లీ గగనతలంలోకి పంపేందుకు బ్రిటన్ ప్రభుత్వం ప్రత్యేక నిపుణుల బృందాన్ని భారతదేశానికి పంపించింది. బ్రిటిష్ డిఫెన్స్ టెక్నాలజీ



నిపుణులు విమానానికి నిశితంగా పరీక్షలు నిర్వహించి, హైడ్రాలిక్ సమస్యను పరిష్కరించారు. అనంతరం అనేక రహస్య టెస్టింగ్‌ల తరువాత తాజాగా విమానానికి టేకాఫ్‌కు అనుమతి మంజూరైంది. ఈ ప్రక్రియ అంతా అత్యంత గోప్యంగా సాగింది. విమానం సమీప ప్రాంతాన్ని బ్రిటన్ భద్రతా బలగాలు కాపలా వేశారు. స్థానిక అధికారులు, మీడియాకు కూడా సమాచారం అందకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అంతేగాక, విమానం మరమ్మతులు జరిగే ప్రాంతాన్ని పరదాలతో మూసివేయడంతోపాటు, డ్రోన్‌లు లేదా కెమెరాల వినియోగాన్ని కూడా నిషేధించారు.

- ఎఫ్-35బీ ప్రత్యేకతలు : ప్రస్తుతం ఈ ఎఫ్-35బీ యుద్ధవిమానం ఆస్ట్రేలియా దిశగా ప్రయాణాన్ని కొనసాగిస్తోందని సమాచారం. ఇది ప్రపంచంలో అత్యధికంగా ఉపయోగించే స్టెల్త్ ఫైటర్ జెట్‌లలో ఒకటి. తక్కువ అవశేషంతో గాలిలో ఎగిరే సామర్థ్యం, తక్కువ స్పష్టతతో శత్రు రాడార్‌లను మోసం చేసే శక్తి దీనికి ఉన్నది.

**-అంతర్జాతీయ సంబంధాలపై ప్రభావం....** భారత గగనతలంలో బ్రిటన్ యుద్ధవిమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయడం, అంతర్రాష్ట్ర సంబంధాల్లో నూతన మలుపు తిప్పింది. అంతర్జాతీయ భద్రతా రంగంలో భారత్ ప్రాధాన్యతను ఈ ఘటన మరింత స్పష్టంగా చాటింది.

చురకలు

## సంపాదకీయం

# ఐఫోన్ 17కు భారీ ధర అవసరమా? లగ్జరీనా?

ఆపిల్ కంపెనీ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐఫోన్ 17 సిరీస్‌ను 2025 సెప్టెంబర్ ప్రారంభంలో భారత్‌లో విడుదల చేయనుంది. ఈ సిరీస్‌లోని మోడళ్లలో అనేక అప్‌గ్రేడ్‌లు ఉంటాయని ఊహిస్తున్నారు. అయితే ధరల విషయంలో మాత్రం ఇప్పటికే భారత వినియోగదారులలో చర్చ మొదలైంది. ఇది వాస్తవంగా అవసరమా లేక లగ్జరీ దోపిడీనా అన్నదే ప్రశ్న.

**ఐఫోన్ 17 ధరల అంచనాలు...** ఐఫోన్ 17 ప్రాథమిక మోడల్ ధర సుమారు రూ. 79,900గా ఉండే అవకాశం ఉంది. ఇది కొత్త ఐఫోన్‌ను కొనాలనుకునే యూజర్లకు అందుబాటులో ఉండే ధరగా భావించవచ్చు. ఈ మోడల్‌తో ప్రో వెర్షన్ మధ్యలో ఉండే ఐఫోన్ 17 ఎయిర్ మోడల్ ధర రూ. 90, 000 ప్రాంతంలో ఉండనుందని అంచనా. ఇది ప్రీమియం లుక్, పనితీరుతో పాటు “ప్రో” ఫీచర్లలో కొన్ని సమతుల్యంగా ఉండేలా డిజైన్ చేసిన మోడల్‌గా భావిస్తున్నారు. టెక్నాలజీ అభిమానులు, యువ వృత్తిపరులు దీన్ని బలమైన ఎంపికగా పరిగణించవచ్చు. ఎందుకంటే ఇది రూ. 1 లక్ష మార్క్‌ను దాటదు. అత్యున్నతంగా ఉండే ఐఫోన్ 17 ప్రో మోడల్ ధర రూ. 1,45,000 వరకు ఉండే అవకాశం ఉంది. ఇందులో అత్యాధునిక కెమెరా వ్యవస్థ, మెరుగైన బ్యాటరీ లైఫ్, అభివృద్ధి చెందిన AI ఫీచర్లు ఉండనున్నాయని సమాచారం. ఆపిల్ కంపెనీ తమ ఉత్పత్తుల ధరలను న్యాయంగా నిలబెట్టడానికి “ఇన్నోవేషన్”, బిల్డ్ క్వాలిటీ, , బ్రాండ్ విలువలను ప్రస్తావిస్తూ వస్తోంది.

**– భారత మార్కెట్‌లో ఆపిల్ స్థానం...** భారత మార్కెట్‌ను చూస్తే, ఈ ధరలు ఎంతో ఖరీదైనవి. ఎందుకంటే ఇటువంటి స్పెసిఫికేషన్లతో కూడిన అనేక శక్తివంతమైన ఆండ్రాయిడ్ ఫోన్లు సగం ధరకు లభ్యమవుతున్నాయి. అందుకే సాధారణ వినియోగదారుల దృష్టిలో ఐఫోన్ ఇంకా ఒక అవసరంగా కాకుండా లగ్జరీగా భావించబడుతుంది. అయినప్పటికీ, ఆపిల్ యొక్క రీసేల్ విలువ, దాని మద్దతు ఇకోసిస్టం, స్టేటస్ సింబల్‌గా భావించబడే బ్రాండ్ మన్నన, ఇవన్నీ కలిసి నగరాల్లో నివసించే వర్గాల్లో ఐఫోన్‌కు బలమైన గిరాకీని కలిగించాయి. EMI ప్లాన్లు, ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, పండుగ డిస్కౌంట్లు వంటి అవకాశాలతో మరిన్ని మందిని ఐఫోన్ కొనాలన్న ఆసక్తికి నెట్టిచెప్పే పరిస్థితి ఏర్పడుతోంది. ఇంకా, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాల్లో ఆపిల్ రిటైల్ స్టోర్లు, దేశీయంగా తయారీ విస్తరణ, సర్వీసు సెంటర్‌లు పెరుగుతున్న నేపథ్యంలో బ్రాండ్ ఆకర్షణ మరింత పెరిగింది. ఐఫోన్ 17 సిరీస్, దాని ఫీచర్లు, డిజైన్, బ్రాండ్ ప్రతిష్టతో, భారత మార్కెట్‌లో టాప్ క్లాస్ టెక్ ప్రియులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. మొత్తం చూస్తే ఈ ఐఫోన్ 17 సిరీస్ భారత్‌లో లగ్జరీగా పరిగణించబడుతున్నా, అదే సమయంలో వినియోగదారుల్లోని “ఆసక్తి, ఆత్మవిశ్వాసం, అభిమానం” అనే మూడు అంశాలతో, మార్కెట్‌లో తన స్థానాన్ని నిలుపుకునేలా ఉంది.

ఇప్పుడు చూడాల్సిందల్లా... సెప్టెంబర్‌లో విడుదలయ్యే ఈ సిరీస్‌కి భారత ప్రజలు ఎలాంటి స్పందన ఇస్తారన్నదే.

# విశేష ఫల దాయిని చుక్కల అమావాస్య






ఆషాఢమాసంలోని చివరి రోజైన చుక్కల అమావాస్య రోజున పితృదేవతలను తల్చుకున్నా, గౌరీవ్రతం చేసినా, దీపపూజ నిర్వహించినా గొప్ప ఫలితం దక్కుతుందని నమ్మకం. హిందూ పంచాంగంలో జనవరిలో వచ్చే మకర సంక్రాంతికి ఎంత ప్రాముఖ్యత ఉందో, జులై మాసంలో వచ్చే కర్కాటక సంక్రాంతికి కూడా అంతే ప్రాధాన్యత ఉంది. మకర సంక్రాంతి సమయంలో ఉత్తరాయణం మొదలైతే, కర్కాటక సంక్రాంతికి దక్షిణాయనం మొదలవుతుంది. దక్షిణాయన కాలంలో పితృదేవతలు మనకు సమీపంలోనే ఉంటారని చెబుతారు. అందుకనే దక్షిణాయంలో వచ్చే తొలి అమావాస్య రోజున వారికి ఆహ్వానం పలుకుతూ తర్పణాలను విడిస్తే మంచిదని సూచిస్తారు. అదే చుక్కల అమావాస్య. ఇక ఆషాఢ మాసంలో చేసే జప తపాలకు, దాన ధర్మాలకు విశేషమైన ఫలితం లభిస్తుందని పెద్దల మాట. కాబట్టి ఈ రోజున పెద్దలని తల్చుకుంటూ పితృ కర్మలు నిర్వహించినా, వారి పేరున దాన ధర్మాలు చేసినా పెద్దల ఆత్మ శాంతిస్తుందని విశ్వాసం. ఆషాఢ అమావాస్య రోజున గౌరీ పూజ చేయడం కూడా మంచిది. ఆషాఢ అమావాస్య మర్నాటి నుంచి శ్రావణ మాసం మొదలవుతుంది. శ్రావణ మాసం అంటే పెళ్లి ముహూర్తాలు మొదలయ్యే కాలం. కాబట్టి ఈ శ్రావణంలో అయినా మంచి పెళ్లి సంబంధం కుదరాలని కోరుకుంటూ, మాసానికి ముందు రోజున కన్నెపిల్లలు గౌరీదేవిని పూజిస్తారు. ఇందుకోసం పసుపు ముద్దని గౌరీదేవిగా భావించి, ఆమెను కొలుచు కుంటారు. బియ్యపు పిండితో చేసిన కుడుములను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ రోజు గౌరీపూజ చేసుకుని ఆమె రక్షను ధరించిన అవివాహితులకు త్వరలోనే వివాహం జరుగుతుందని నమ్ముతారు. ఈ అమావాస్య రోజున అవివాహితలే కాదు... కొత్త కోడళ్లు, వివాహితులు కూడా ‘చుక్కల అమావాస్య’ పేరుతో ఒక నోముని నోచుకుంటారు. ఇందుకోసం గౌరీపూజని చేసి, సందెవేళ వరకు నిష్టగా ఉపవాసాన్ని ఆచరిస్తారు. అమ్మవారి ముందు నిర్ణీత చుక్కలు పెట్టి వాటి మీద దారపు పోగులను ఉంచుతారు. ఆ దారపు పోగులను ఒక దండగా అల్లి మరునాడు ధరిస్తారు. స్తోమత ఉన్నవారు నోము సందర్భంగా బంగారపు చుక్కలను కూడా దానం చేసేవారట. అషాఢమాసంతో సూర్యుడు దక్షిణాయనానికి మరలుతాడు. రాత్రివేళలు పెరుగుతాయి, చలి మొదలవుతుంది. చలి, చీకటి అనేవి అజ్ఞానానికి, బద్ధకానికీ, అనారోగ్యానికీ చిహ్నాలు. వాటిని పారద్రోలి వెలుగుని, వేడిని ఇచ్చేవి దీపాలు. అందుకు సూచనగా దీపపూజని చేస్తారు. లక్ష్మీప్రదమైన శ్రావణమాస ప్రారంభానికి ముందు వచ్చే అమావాస్య కనుక ఈ రోజు అధికసంఖ్యలో దీపాలను పెట్టి లక్ష్మీదేవిని పూజించడం మంగళ ప్రదమని ధర్మశాస్త్ర వచనం. ఇలా దీప ప్రజ్జ్వలనము చేయడం వలన పితృదేవతలు సంతోషించి వారి ఆశీస్సులు మనకు అందిస్తారని విశ్వాసం. ఆషాడ అమావాస్యను మహారాష్ట్రలో ‘గటారి అమావాస్య’ అని కూడా అంటారు. రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ వంటి భారతదేశ ఉత్తర పరిస్థితులలో హరియాలీ అమావాస్య ఆనందం చాలా గొప్పది. ఇది వివిధ ప్రాంతాలలో ప్రసిద్ధి చెందింది, ఆషాఢ అమావాస్యను కర్ణాటకలో ‘భీమన అమావాస్య’, ఆంధ్ర ప్రదేశ్‌లో ‘చుక్కల అమావాస్య’, ఒరిస్సాలో ‘చిటలగి అమావాస్య’, గుజరాత్ రాష్ట్రంలో ‘హరియాలి అమావాస్య’గా కూడా జరుపుకుంటారు. వివాహిత మహిళలు సంతోషకరమైన వైవాహిక జీవితం కోసం గౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. మంచి జీవిత భాగస్వాముల కోసం కొన్ని చోట్ల అవివాహిత మహిళల వ్రతాచరణ ఉంది. దక్షిణాయనం ఖగోళానికి సంబంధించిన పండుగ కాబట్టి, ఆకాశంలో చుక్కలను సూచిస్తూ ఈ నోము మొదలై ఉండవచ్చని భావిస్తారు. తమ మాంగళ్యం కల’కాలం’ ఉండాలన్నదే ముత్తయిదువుల కోరిక. **రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# అపర భగీరథుడు ఆర్థర్ కాటన్ - జూలై 24... సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి

**“నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయోమహామతిః,**
**స్మరామ్యాంగ్లేయ దేశీయం కాటనుం తం భగీరథం”**


ఆంధ్ర ప్రదేశ్ లోని ఉభయ గోదావరి నదీ తీర వాసులు గోదావరీ స్నానాల సమయంలో సంకల్పం చేసేప్పుడు పఠించే సాంప్రదాయం ఆచరిస్తారు. అపర భగీరుథుడైన ఆంగ్లేయ ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ కారణంగా తాము నిత్యం ఉదయాన్నే గోదావరి స్నానమా చరించే భాగ్యం కలిగిందన్నది దాని సారాంశం. కేవలం గోదావరి స్నానమాచరించే అవకాశమే కాదు, తమ జీవితాల్లో సమూల మార్పులకు మూలం ఆర్థర్ కాటన్ ఆలోచనే అని గోదావరి తీర వాసులు నేటికీ విశ్వసిస్తారు. అందుకు అనుగుణంగా ఆయనను నిత్యం తమ పూజా మందిరంలో కొలిచేవాళ్లు, తమ ఇంటి వద్ద, సమీపాలలో కాటన్ మహాశయుని విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఆరాధించేవాళు చాలామంది కనిపిస్తారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రగతిలో అనేక అంశాలలో గోదావరి, కృష్ణా తీరం ముందు ఉండడంలో కాటన్ శ్రమ ఉందని భావించక తప్పదు. కాటన్ దొర అని గోదావరి ప్రజలు అభిమానంగా పిలుచుకొనే జనరల్ సర్ ఆర్థర్ కాటన్ (మే 15, 1803 – జూలై 24, 1899) బ్రిటిషు సైనికాధికారి, నీటిపారుదల ఇంజనీరు. కాటన్ తన జీవితాన్ని బ్రిటిషు భారత సామ్రాజ్యములో నీటిపారుదల, నావికాయోగ్యమైన కాలువలు కట్టించడానికి జీవితాన్ని ఫణంగా పెట్టిన మేధావి, కార్యశీలి. కాటన్ 15 ఏళ్ల వయసులో ఈస్ట్ ఇండియా కంపెనీ ఇంజనీరింగు సర్వీసుల్లో చేరి శిక్షణ పొందారు. 1819లో రాయల్ ఇంజనీర్స్ దళంలో సెకండ్ లెఫ్టెనెంట్‌గా నియమితుడైన ఆయన విధి నిర్వహణలో భాగంగా 18 ఏళ్ల వయసులో భారత దేశానికి వచ్చి మొదటిసారిగా మద్రాస్‌లో ఉద్యోగిగా పనిచేశారు. అక్కడి నుంచి ఈస్ట్ ఇండియా కంపెనీ తరుపున దక్షిణ భారత చెరువుల శాఖకు ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆ సమయంలో 1828–29 మధ్య కాలంలో కావేరీ నది వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేశారు. కరువు పీడిత ప్రాంతం గోదావరి డెల్టాగా రూపాంతరం చెందడంలో ధవళేశ్వరం వద్ద నిర్మించిన ఆనకట్ట ప్రధాన పాత్ర పోషించింది. అప్పటి జిల్లా అధికారిగా ఉన్న సర్ హెన్రి మౌంట్ పంపించిన నివేదిక ఆధారంగా ఆనకట్ట నిర్మాణం ఆలోచన తెరమీదకు వచ్చింది. ఆర్థర్ కాటన్ అనే ఇంజనీరుకు సదరు ప్రతిపాదన అప్పగించి, సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని బ్రిటీష్ ప్రభుత్వం అప్పగించడంతో ఆయన అందుకు అనువైన ప్రాంతం కోసం సుదీర్ఘ అన్వేషణ చేశారు. అలా 1840లోనే కృష్ణా నదిపై ఆనకట్ట నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఆయన రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను అప్పటి మద్రాసు గవర్నరు మార్కస్ ట్వేల్ డేల్ ఆమోదించారు. లండన్‌లోని బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఆమోదానికి పంపించారు. ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించిన తర్వాత, 1846 ధవళేశ్వరం వద్ద గోదావరిపై ఆనకట్టను కాటన్ ఆధ్వర్యంలో నిర్మించేందుకు లండన్ నుంచి అనుమతి లభించింది. 1847 ఏప్రిల్ నెలలో ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆనకట్ట నిర్మాణంలో పది వేలమంది కూలీలతో పాటుగా ఐదు వందల మంది వడ్రంగులు, ఐదు వందల మంది కమ్మరులను వినియో గించారు. ధవళేశ్వరం వద్ద గోదావరి సుమారుగా 6 కి.మీ. వెడల్పు ఉంటుంది. 1847 అగస్టు మూడో వారంలో రైల్వే వ్యాగన్ల ద్వారా ఉక్కు, రాయిని ధవళేశ్వరానికి తరలించారు. దాంతో యంత్ర సామాగ్రితో నిర్మాణపు పనులు ముమ్మర మయ్యాయి. నది ఒడ్డుకు చేర్చిన రాళ్లు, ఇతర సామగ్రిని పడవల ద్వారా నదిలోని నిర్మాణ ప్రాంతానికి రవాణా చేసేవారు. ఇందుకు 25 టన్నుల భారం మోయగల 18 నావలను వినియోగించారు. కాటన్ కు కూలీలతో పాటుగా ఇంజనీర్లయిన భారతీయులు కూడా కొందరు తోడుగా ఉన్నారు. వారిలో తొలి నాటి ఇంజనీర్లలో ఒకరైన రాజ్ బహుదూర్ వీణం వీరన్న కూడా ఉన్నారు. కాటన్ పర్యవేక్షణలో ఈ ఆనకట్టను వేగంగా పూర్తి చేశారు. తర్వాత 1852 గన్నవరం అక్విడక్టు పనులు కూడా కాటన్ ప్రారంభించారు. ఐదేళ్ల లోనే నిర్మాణం జరగడంతో 1852 నాటికి అందుబాటు లోకి వచ్చింది. ధవళేశ్వరం వద్ద ప్రస్తుతమున్న సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌కి పూర్వ రూపంగా ఆనకట్ట ఉండేది. అనేక వరదల తాకిడికి ఆనకట్ట



దెబ్బ తినడంతో చివరకు 1970వ దశకంలో కొత్తగా బ్యారేజ్ నిర్మాణం చేశారు. 20వ శతాబ్దం తొలినాళ్లలోనే ఆయా ప్రాంతాల్లో వెనువెంటనే ఆరు లక్షల ఎకరాల భూమి సాగు కిందికి రావడం తో పాటు, పారిశ్రామి కాభివృద్ధి, విస్తారంగా పంటలు, రవాణా సదుపాయాలు ధవళేశ్వరం ఆనకట్ట ద్వారా గోదావరి జల ప్రవాహం ద్వారా లభించాయి. కృష్ణానదిపై విజయవాడ వద్ద ఆనకట్టకు ప్రోద్బలం కూడా కాటన్ దే. ఆయన బెంగాల్, ఒడిసా, బీహారు, మొదలైన ప్రాంతాల నదులను మానవ ఉపయోగం చేయడానికి ఎన్నో పరిశోధనలు, పరిశీలనలు చేశాడు. తెలుగు వారే కాదు తమిళులు, ఒరియాలు, బెంగాలీలు, ఒరియాలు, బీహారీలు మొత్తం భారతీయులే ఆయనకు ఎంతో రుణ పడి ఉంటారు. తమపాలిట దుఖఃదాయినిగా ఉన్న గోదావరిని, ప్రాణదాతగా మార్చిన ఆర్థర్ కాటన్... అపర భగీరథునికి, ప్రాతః స్మర స్మరణ చేయడం తప్ప ఏమిచ్చుకో గలరు.

**రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# తెలంగాణ ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపం కే.వి.రంగారెడ్డి - జూలై 24... కొండా వెంకట రంగారెడ్డి వర్ధంతి




తెలంగాణ ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపం ఆయన. తెలంగాణ కోసం నెహ్రూతో సైతం ఢీకొనడానికి వెనుకాడనని ప్రాంతీయ అభిమాని. పదవీ త్యాగానికి వెన్ను చూపని త్యాగశీలి. చేయాలను కున్నది ఎన్ని అడ్డకుం లెదురైనా చేసిన ధీశాలి. నిజాం వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా పోరాడి జైలుకు కూడా వెళ్ళిన పోరాట యోధుడు. 1950లోనే ఆయన తెలంగాణ వాదం వినిపించారు. నిజాం పాలన, ఆ తర్వాత మిలిటరీ గవర్నర్ పాలన, వెల్లోడి పాలనలో మహారాష్ట్రులదే పైచేయి ఉండటాన్ని ఆయన నిరసించారు. దీన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో ఒక బహిరంగ సభ కూడా పెట్టారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బూర్గులను నిలిపి గెలిపించింది కూడా ఆయనే. ఆయనే కొండా వెంకట రంగారెడ్డి. ఆంధ్ర ప్రదేశ్ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ప్రముఖ న్యాయవాదిగా, పలు సంస్థల వ్యవస్థాపక బాధ్యునిగా ఆయన బహుముఖ సేవలు అందించిన నేతగా చరిత్రలో నిలిచి పోయారు. కొండా వెంకట రంగారెడ్డి (డిసెంబరు 12, 1890 – జూలై 24, 1970) స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తొలితరం రాజకీయ నాయకులు. ఆయన పేరు మీదుగానే రంగారెడ్డి జిల్లాకు ఆ పేరు వచ్చింది. రంగారెడ్డి ప్రస్తుత రంగారెడ్డి జిల్లా తెలంగాణ రాష్ట్రం లోని మొయినాబాదు మండలం, పెద్దమంగళారం గ్రామంలో 1890, డిసెంబరు 12 న జన్మించారు. 1959 నుండి 1962 వరకు దామోదరం సంజీవయ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈయన ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. రంగారెడ్డి, నీలం సంజీవరెడ్డి మంత్రివర్గములో కూడా మంత్రి పదవి నిర్వహించారు. అయన నైజాం శాసనసభలో, హైదరాబాదు రాష్ట్ర శాసనసభలోనూ, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో ప్రాతినిధ్యం వహించారు. 1936లో ఆయన శాసనసభకు ఎన్నిక కావడంతో ప్రజలకు సేవ చేసే అవకాశం కలిగింది. సభలో 24 శాసనాలను, కొన్ని సవరణలు ప్రవేశపెట్టారు. అందులో స్త్రీలకు వారసత్వపు హక్కు కలిగ జేయడం, వర్ణాంతర వివాహం చేసుకుంటే వారి సంతానం సక్రమ సంతానమని నిరూపణ, బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలన, అస్పృశ్యతా నివారణ, జాగీర్ల రద్దు, ఉద్యోగాల నియామకానికి పబ్లిక్ సర్వీసు కమిషన్ ఏర్పాటును తన రెండేళ్ల పదవి కాలంలో చేయగలిగారు. కేవీ రంగారెడ్డి పూర్తి పేరు కొండా వెంకట రంగారెడ్డి. ఆయన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల తాలుకాలోని పెద్ద మంగళారంలో 1890 డిసెంబరు 12న కొండా చెన్నారెడ్డి, బుచ్చమ్మ దంపతులకు జన్మించారు. ఉన్నత విద్యను అభ్యసించారు. కేవీ రంగారెడ్డి మనస్సు ఎప్పుడూ అనాధరణకు గురైన స్త్రీల దుర్గతిపైన, దళితుల, పేదల ఆర్థిక దుస్థితిపైన ఉండేది. దీన్ని ఎలాగైనా రూపు మాపాలని అనుకునేవారు. స్త్రీ తన భర్త చనిపోగానే ఎలాంటి ఆస్తి లేకుండా నిరాధరణకు గురయ్యేది. అలాగే నిమ్న జాతుల వారు కూడా నిరాధరణకు గురయ్యేవారు. జాగీరుదారులకు, పేద రైతులక మధ్య వివాదాలు వచ్చినపుడు పేదల పక్షాన నిలిచేవారు. పేదల పక్షాన ఉచితంగా వాదించేవారు. రంగారెడ్డి ఆంధ్ర మహాసభ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని మహబూబ్ నగర్ జిల్లా షాద్‌నగర్లో జరిగిన ఐదవ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. హైదరాబాద్‌లో అనేక సాంఘిక, సాంస్కృతిక సేవాసంస్థల ఆవిర్భావంలో ప్రధాన పాత్ర పోషించారు. 1940 వరకు జిల్లా కోర్టు, హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. 1943లో జరిగిన ఏడవ ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. అంతేకాదు సాహిత్యాభివృద్ధి కోసం1943లో ఆవిర్భవించిన ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయం, శ్రీవేమన భాషా నిలయం స్థాపనకు తోడ్పడ్డారు. హింధీ ప్రచార సభకు, గోలకొండ పత్రికకు, రయ్యత్ పత్రికకు చేయూత నందించారు. నిజాం సంస్థానం భారత్‌లో విలీనం అయిన తర్వాత బూర్గుల మంత్రి వర్గంలో రెవెన్యూ, ఎక్సైజ్, కస్టమ్స్ తదితర శాఖలను నిర్వహించారు. నాటి ముఖ్యమంత్రి బూర్గులను ఏ కారణం లేకుండానే ముఖ్య మంత్రిగా రాజీనామా చేయాలని కోరినపుడు ఆ నిర్ణయాన్ని కేవీ తీవ్రంగా వ్యతిరేకించారు. అంతే కాకుండా మేం మళ్లీ బూర్గులనే సీఎంగా ఎన్నుకుంటే మీరేం చేస్తారని నిలదీసిన ధీరుడు. 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత కూడా నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గంలో హెూం శాఖ, రెవెన్యూ శాఖలను నిర్వహించారు. 1960లో నీలం సంజీవరెడ్డి అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడిగా వెళ్లగా ఇక్కడ ముఖ్యమంత్రి పదవిని దామోదరం సంజీవయ్యను వరించింది. ఆయన కాలంలో రంగారెడ్డి ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి ఆయన మేనల్లుడు. ఏనాడు ఏ విషయంలోనూ రాజీపడని మనస్తత్వం కొండాది. సంస్థానంలో మహారాష్ట్రులకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌ను పెట్టినా, తెలంగాణ ప్రాంతం నుంచే ముఖ్యమంత్రిని ఎంపిక చేయించినా, విశాలాంధ్రకు వ్యతిరేకత వ్యక్తం చేసినా అన్ని సదరు అదరక బెదరక చేసేవారు. చాలా వరకు పేదలకు ఉచితంగా పనులు చేసి పెట్టేవారు. విద్యార్థి దశలో తాను ఎదుర్కొన్న కష్టాలను పేద విద్యార్థులెవరూ ఎదుర్కొన కూడదనే ఉద్దేశంతో రెడ్డి హాస్టల్ కట్టించారు. బాలుర పాఠశాల, ఆంధ్రసరస్వతి, బాలికల పాఠశాల, రెడ్డి బాలికల హాస్టల్, ఆంధ్ర విద్యాలయం మొదలైన వాటిని కట్టించారు. 1970, జూలై 24 న రంగారెడ్డి మరణించారు. ఆయన స్మృత్యర్థం 1978, ఆగస్టు 15న హైదరాబాదు జిల్లాను విభజించి నూతనంగా ఏర్పడిన జిల్లాకు రంగారెడ్డి జిల్లా అని పేరుపెట్టారు. **రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# టర్బయిన్ పనుల్లో కదలిక

నల్గొండ: నాగార్జునసాగర్‌లోని జలవిద్యుత్తు ప్రాజెక్టులో 8వ యూనిట్ టర్బైన్ ఏప్రిల్ నెల నుంచి పనిచేయడంలేదు. జెన్కోకు చెందిన ఈ ప్లాంట్‌లో దేశీయ పరిజ్ఞానంతో 'భెల్' సంస్థ ఎనిమిదో యూనిట్‌ను రూపొందించింది. 8వ టర్బయిన్ పనులు నెలాఖరు నాటికి పూర్తయ్యే అవకాశాలున్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. మరోసారి ట్రయల్ రన్ చేసిన అనంతరం ఆగస్టు మొదటి వారం నుంచి జలవిద్యుత్తు ఉత్పత్తి ప్రక్రియకు ఉపయోగించనున్నారు.

**ఉపముఖ్యమంత్రి పరిశీలనతో పనులు వేగిరం**

రాష్ట్రంలో జల, పవన, సౌర విద్యుదుత్పత్తి కేంద్రాలు సజావుగా పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. వాటి మరమ్మతులు, పునరుద్ధరణకు నిధులు మంజూరు చేస్తామని ఇటీవల సాగర్ జలవిద్యుత్తు ప్రాజెక్టును సందర్శించిన సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వ్యాఖ్యానించారు. రెండేళ్ల క్రితం 15వేల మెగావాట్ల మేర, గతేడాది 17,162 మెగావాట్ల విద్యుత్తు వినియోగించారు. అంటే ఒక్క ఏడాదిలోనే అదనంగా 2వేల మెగావాట్ల అవసరం పెరిగింది. రాష్ట్రంలోని అన్ని హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్రాజెక్టులోని యూనిట్లను వినియోగంలోకి తీసుకురావాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో నాలుగునెలలపాటు నిలిచిన 8వ యూనిట్



యంత్రం స్థానంలో కొత్తది బిగించే పనులను అధికారులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా 'ఓవరాయిలింగ్' ప్రక్రియ 60 శాతం పూర్తిచేశారు. మిగిలిన పనులు పూర్తయ్యేందుకు మరో వారం రోజులు పట్టనుంది. జెన్కో అధికారులు సైతం త్వరితగతిన ఈ పనులను పూర్తి చేసి విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ ప్లాంట్ వద్ద భద్రత ప్రమాణాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అత్యవసర నెంబర్ బోర్డు వద్ద నల్గొండ ఎస్పీ, మిర్యాలగూడ పోలీసులకు సంబంధించిన పాత నెంబర్లు మాత్రమే కనిపిస్తున్నాయి. కనీసం ఆ నెంబర్లు మారిపోయిన విషయం ఆ అధికారులకు తెలియకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**పురాతన ప్రాజెక్టులో తరచూ మొరాయిస్తూ..**

ఈ ప్లాంటు నిర్మించి 50 ఏళ్లు దాటగా ప్రధాన విద్యుత్తు కేంద్రంలో ఉన్న మొత్తం 8 యూనిట్లలో ఏడు జపాన్, మిగిలిన ఒకటి దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. ఈ ప్రాజెక్టు 810 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ 21 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తుంది. పురాతన ప్రాజెక్టు కావడంతో ఏప్రిల్ నెల నుంచి తరచూ సాంకేతిక మొరాయింపులు చోటు చేసుకుంటున్నాయి. జపాన్ టెక్నాలజీతో నిర్మించిన యూనిట్లలోనూ అప్పుడప్పుడు యంత్రాలు పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నారు.

# టీకా... అందక..!

మిర్యాలగూడ: నిరుపేదల వైద్యం కోసం ప్రభుత్వం ఏటా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఆశించిన మేర ఫలితాలు రాకపోగా, అభం శుభం ఎరుగని చిన్నారులకు బాల్యంలో అందించాల్సిన టీకాలు అందక వ్యాధుల బారిన పడుతున్నారు. పేద, ధనిక తేడా లేకుండా ఎక్కడ జన్మించిన శిశువులకైనా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి బుధ, శనివారాల్లో టీకాలు వేస్తున్నారు. ఏటా సాధారణ రోజులతో పాటు పల్స్ పోలియో రెండుసార్లు, ఇంద్ర ధనుస్సు పేరుతో ఏడాదికి రెండుసార్లు టీకాలు అందిస్తున్నారు. ఇంత చేస్తున్నా చిన్నారులకు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించే టీకాలు పూర్తి స్థాయిలో



వేయించడం లేదని పలు సర్వేలు చెబుతున్నాయి.

**ఉచితంగా ఇచ్చే వ్యాక్సిన్లు**

క్షయవ్యాధి నివారణకు బీసీజీ, పోలియో వ్యాధి రాకుండా ఓపీవీ, ఐపీవీ, కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, కామెర్లు, మెదడువాపు, న్యూమోనియా వ్యాధులు రాకుండా పెంటా వాక్సిన్, తట్టు, రుబెల్లాకు ఎంఆర్ వ్యాక్సిన్, మెదడు వాపునకు జేఈ వ్యాక్సిన్, అంధత్వ నివారణకు విటమిన్ ఏ ద్రావణం, జ్వరం, శ్వాసలో ఇబ్బంది, నిరంతర దగ్గు, స్పృహ కోల్పోవటం వాటికి పీసీవీ వ్యాక్సిన్ అందిస్తున్నారు.

**అందకపోవడానికి కారణాలు**

గ్రామాల్లో మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ఆశ, ఏఎన్ఎంలు వివరాలు నమోదు చేసి అవసరమైన టీకాలు అందిస్తున్నారు. ప్రసవించిన తర్వాత శిశువులకు ప్రాథమిక టీకాలు వేయించిన తర్వాత తల్లిదండ్రులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. దీంతో వారు నివాసం ఉండే ప్రాంతంలో టీకాలు వేయించేందుకు ఆసక్తి చూపడం లేదు. గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు టీకాల విషయంలో పర్యవేక్షించి ముందస్తు సమాచారం ఇస్తుంటారు. దూర ప్రాంతాలకు వెళ్లిన తల్లిదండ్రులు వ్యాక్సిన్‌లు సకాలంలో వేయించడం లేదు. తల్లిదండ్రుల చరవాణి నెంబర్లకు ముందస్తుగా వ్యాక్సిన్‌లు వేయించే విషయమై సమాచారం అందిస్తే కొంత మేర మార్పు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇచ్చే వ్యాక్సిన్‌లతోపాటు నివురుగప్పిన నిప్పులా వ్యాపిస్తున్న క్యాన్సర్‌కు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందించాల్సిన అవసరం ఉంది. ప్రైవేటుగా వ్యాక్సిన్ వేయించాలంటే వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది.

**తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి**–డా.కేసా రవి, జిల్లా ఉపవైద్యాధికారి వలస వెళ్లిన వారికి సైతం ఆశ, ఏఎన్ఎంలు ఫోన్ చేసి వ్యాక్సిన్ల విషయం సమాచారం ఇస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పదో ఏడాది వచ్చేంత వరకు అప్రమత్తంగా ఉండాలి.

# భద్రాచలం కొండ.. అభివృద్ధికి అండ



భద్రాచలం : రామాలయం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. నూతన నిర్మాణాలకు ప్రణాళిక తయారు చేయాలని మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల, పొంగులేటి భావిస్తున్నారు. భద్రాచలాన్ని యాదగిరి గుట్ట తరహాలో అభివృద్ధి చేయాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ గతంలో నిర్వహించిన సమీక్షల్లో ప్రస్తావించారు. దీంతో దేవాదాయశాఖలో కదలిక వచ్చింది. ఇలాంటి నిర్మాణాలలో విశేష అనుభవమున్న సీనియర్ ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ, స్థపతి వల్లినాయగంలను ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఉంటున్న వీరిద్దరితో పాటు ఇదే రంగంలో అనుభవం ఉన్న ఇంజినీర్ల సలహాలు, సూచనలు తీసుకునే అవకాశం ఉంది. రెండ్రోజుల్లో సర్వే పనులు మొదలు కానున్నాయి.

**సువిశాల ప్రాంగణం కోసం...**

కోవెలకు మూడు వైపులా ఉన్న 41 ఇళ్ల నిర్వాసితులకు పరిహారంతో పాటు కాలనీ ఏర్పాటుకు రూ.60.20 కోట్లు అవసరం ఉండగా ఇప్పటికే రూ.34.45 కోట్లు మంజూరయ్యాయి. ముప్పై మందికి పైగా నిర్వాసితులు తమ ఇళ్లను ఖాళీ చేయగా మిగతావారు వారంలో చేస్తారు. ఇలా స్వాధీనం చేసుకున్న 1.3 ఎకరాల్లో మళ్లీ ఆక్రమణలకు ఆస్కారం లేకుండా బోర్డులు, కంచె ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మిథిలా ప్రాంగణం 3 ఎకరాలు ఉంది. 2 ఎకరాల్లో ప్రధాన ఆలయ పరిసరాలున్నాయి. దీనికి ఆనుకుని మాడవీధి విస్తరణ కోసం 1.3 ఎకరాలు కలవనుంది. ఈ మొత్తం 6.3 ఎకరాల్లో బృహత్తర ప్రణాళిక అమలు చేయనున్నారు.

**ఆధ్యాత్మిక పర్యాటకం**

రామాలయ దర్శనానికి నిత్యం ఐదారు వేల మంది వస్తుండగా సెలవు రోజుల్లో ఇది పెరుగుతోంది. గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు 23.74 లక్షల మంది వచ్చారు. అదే ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 13.69 లక్షల మంది దర్శించుకున్నారు.

ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 14.78 లక్షల మంది వచ్చారు. భక్తుల సంఖ్య రానున్న రోజుల్లో పెరిగే వీలుంది. ఇక్కడి ఆధ్యాత్మిక పర్యాటక అవసరాలను తీర్చేలా రూ.200 కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేస్తారని సమాచారం. అవసరమైతే ఇంకొంత స్థల సేకరణ ఉంటుంది.

మాడవీధుల్లో ఎత్తుపల్లాలు లేకుండా పనులు చేయాలని నిర్ణయించారు. ఇది సాకారమైతే భద్రగిరిపై ప్రధాన ఆలయం మరింత సుందరంగా కనిపించనుంది.

**నిపుణులను పిలిపిస్తున్నాం**

రవీంద్రనాథ్, రామాలయం ఈఈ

బృహత్తర ప్రణాళిక అమలుకు నిపుణులు త్వరలోనే ఇక్కడకు రానున్నారు. నూతన నిర్మాణాల గురించి స్పష్టత రావాల్సి ఉంది. భవిష్యత్తు అవసరాలను తీర్చేలా పనులు ఉంటాయి.

# సర్దుబాటు.. తడబాటు



ఖమ్మం : విద్యుత్తు సరఫరాలో ఉపకేంద్రాల్లో ఆపరేటర్ల పాత్ర కీలకం. నలుగురు పనిచేయాల్సిన చోట ఒకరిద్దరు శ్రమిస్తుండటంతో పని ఒత్తిడి పెరిగి ఆపరేటింగ్ లోపాలు తలెత్తుతున్నాయి. గుత్తేదారుల నిర్వహణలో సాగిన ఉపకేంద్రాల్లోని సిబ్బంది(కాంట్రాక్ట్ వర్కర్స్)ని నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం ఆర్టిజన్లుగా గుర్తించింది. తదుపరి కొందరు ఉద్యోగ విరమణ చేయడం, ఉపకేంద్రాల సంఖ్య పెరుగటం, కొత్త నియామకాలు లేకపోవట వంటి కారణాలతో ఆపరేటర్ల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. సర్కిల్ పరిధిలో 150మంది కొరత ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నియామకం లేకపోవడంతో ఇతర విభాగాల్లోంచి సర్దుబాటు చేస్తున్నారు.

**తీవ్రమైన పని ఒత్తిడి..**

ఉపకేంద్రాల్లో ఆపరేటర్ల కొరతతో విధుల్లో ఉన్న వారిపై పని ఒత్తిడి పెరుగుతోంది. ఎల్‌సీలు తీసుకునే సమయంలో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. జిల్లాలోని ఉపకేంద్రాల్లో ఇద్దరు మాత్రమే ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల ఒక్కరే ఉండటం విశేషం.

**కనీసం ముగ్గురు అవసరం**

ఒక్కో ఆపరేటర్ 8 గంటల పనివేళలతో లెక్కిస్తే ఉపకేంద్రంలో ముగ్గురు అవసరం. గతంలో ముగ్గురు ఆపరేటర్లతోపాటు, వాచ్‌మెన్ పనిచేసేవారు. ఆర్టిజన్ వ్యవస్థ ప్రారంభమైన తర్వాత వాచ్‌మెన్‌లను తొలగించారు. ఖమ్మం సర్కిల్ పరిధిలో మొత్తం 125 విద్యుత్తు ఉపకేంద్రాలున్నాయి. కొత్తగా మరో 18 నిర్మించాలని నిర్ణయించారు.

ఉద్యోగ విరమణ చేసిన 56 మంది, సింగరేణి కాలరీస్‌లో పదవీ విరమణ చేసిన మరో 14 మంది ఉపకేంద్రాల్లో పనిచేస్తున్నారు. కొన్నిచోట్ల జేఎల్‌ఎంలు విధులు నిర్వహిస్తున్నారు.

మామిళ్లగూడెం(బుర్హాన్‌పురం) ఉపకేంద్రంలో ఆపరేటర్ ఒకరే ఉన్నారు. ఈయనకు తోడు విశ్రాంత ఉద్యోగి, ఒక జూనియర్ లైన్ మెన్(జేఎల్ఎం) విధులు నిర్వహిస్తున్నారు.

ఖమ్మం రామాలయం ఉపకేంద్రంలో ఒక్క ఆర్టిజన్ కూడా లేరు. రెగ్యులర్ ఉద్యోగికి, ఇద్దరు విశ్రాంత ఉద్యోగులు పనిచేస్తున్నారు. జేఎల్‌ఎంలు మీటరు రీడింగ్, కొత్త కనెక్షన్లు ఇవ్వడం, ఫ్యూజ్ ఆఫ్ కాల్, నియంత్రికల నిర్వహణ చేయాలి. ఉప కేంద్రాల్లోనూ పనిచేయాల్సి రావడంతో ఒత్తిడి పెరుగుతోంది.

'ఉపకేంద్రాల్లో ఆపరేటర్ల కొరత ఉన్నమాట వాస్తవమే. సంస్థ పరిధిలో కొత్త నియామకాలు లేవు. సీఎండీ ఆధ్వర్యంలో నియామకాలకు కసరత్తు జరుగుతోంది.'

శ్రీనివాసాచారి, ఎస్ఈ, ఖమ్మం

ఆర్టిజన్ కార్మికులు: 285

ఖమ్మం డివిజన్: 82.

ఖమ్మం గ్రామీణం: 76.

సత్తుపల్లి: 71.

వైరా: 25 మంది. (ఎంఆర్‌టీలో ఆరుగురు, సర్కిల్ కార్యాలయంలో 25 మంది పనిచేస్తున్నారు)

# ఖాళీలు చెప్పి.. కొలువులు చూపి

సూర్యాపేట : ప్రభుత్వ పథకాలు, నూతన పరిశ్రమల్లో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని నిరుద్యోగులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో నిరుద్యోగుల సంఖ్య, ఉపాధి చేపట్టాలనే వారి పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నిరుద్యోగిత రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి తీసుకొచ్చిన 'రైసింగ్ ఆక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్' (ఆర్ఏఎంపీ)లో భాగంగా డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్ ఆఫ్ తెలంగాణ(డీట్) యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌పై పరిశ్రమల శాఖ, పంచాయతీ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ యాప్ ఆవశ్యకత, డౌన్‌లోడ్ చేసుకునే విధానం, దీంతో ప్రయోజనం తదితరాలను పాఠశాలల్లో, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు వివరించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 486 గ్రామ పంచాయతీల్లో త్వరలో అవగాహన చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించనున్నారు.

**నిరుద్యోగ యువతకు డీట్ యాప్**

డీట్ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీంతో ఎప్పటికప్పుడు సమాచారం అందుతుంది. అందులో ఉద్యోగార్థిగా చేరి ఇంటి పేరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, పుట్టిన తేదీ, లింగం, విభిన్న వికలాంగులు, సామాజిక స్థితి, చిరునామా వంటి ప్రాథమిక సమాచారాన్ని నమోదు చేయాలి. తెలిసిన భాషలు, విద్యార్హత, నైపుణ్యాలు, విద్య, అనుభవం తదితర వివరాలను పూరించాలి. తరువాత మెనూకు వెళ్లి కొలువులను అన్వేషించాలి. ఉద్యోగాన్ని ఆమోదిస్తే ఉద్యోగ సంస్థతో సంభాషించాలి. మౌఖిక పరీక్షకు పిలిస్తే వెళ్లే తేదీ తెలుస్తుంది. కొలువుకు ఎంపికైతే నియామక పత్రాన్ని పొందుతారు.

ప్రయోజనాలు: డీట్ యాప్‌తో పరిశ్రమల్లో ఖాళీల వివరాలు, నిరుద్యోగుల వివరాలు తెలుసుకోవచ్చు. ఉపాధిలో రాణించాలనుకునే యువత నైపుణ్యం పెంచుకునేందుకు శిక్షణ సంస్థల సమాచారం అందిస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి

–సీతారామ్, పరిశ్రమలశాఖ మేనేజర్, సూర్యాపేట

డీట్ యాప్ గురించి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన చేపట్టనున్నాం. త్వరలో పోస్టర్లను ఆవిష్కరించి పల్లెల్లో ప్రదర్శిస్తాం. గ్రామాల్లోని నిరుద్యోగులు ఈ పోర్టల్ ద్వారా నమోదు చేసుకుంటే ఉద్యోగవకాశాలు పొందే వీలుంటుంది. దీన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి.

# ఆపదలో ఆదుకునే టోల్‌ఫ్రీ నెంబర్లు

భువనగిరి : నిత్యం ఎదురవుతున్న సమస్యలకు టోల్‌ఫ్రీ ఫోన్ పరిష్కారం చూపుతుంది. ఇటీవల పెరిగిపోతున్న ఆన్‌లైన్, వస్తు కొనుగోళ్లలో కొనసాగుతున్న మోసాలతో పాటు పలు సామాజిక అంశాలు, సమస్యలకు టోల్‌ఫ్రీ ఫోన్ నంబర్లను ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు అందుబాటులోకి తెచ్చాయి. మోసానికి, సమస్య పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలన్న విషయమై టోల్‌ఫ్రీ ఫోన్ నంబర్లు దారి చూపుతున్నాయి. సామాజిక భద్రత అంశాలపై భరోసా కల్పిస్తున్నాయి. ఏ నెంబర్ నుంచి ఎలాంటి సాయం పొందవచ్చో మీకోసం...అత్యవసర పరిస్థితుల్లో 100కు ఫోన్ చేస్తే తక్షణమే పోలీసులు సహాయం పొందవచ్చు. ఫిర్యాదు అంశం మేరకు పోలీసులు సమస్య పరిష్కరిస్తారు. సైబర్ నేరాల బారిన పడినప్పుడు ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 1930 ఫోన్ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. బ్యాంకు ఖాతాల్లో డబ్బు ఎవరైనా కాజేసినా వెంటనే ఫిర్యాదు చేసిన పక్షంలో డబ్బు తిరిగి పొందే అవకాశం ఉంది. ఫిర్యాదులో ఆలస్యమైన పక్షంలో నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుంది.

బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మికుల, బాల్య వివాహాల నియంత్రణకు 18001801551 నెంబర్‌ను వినియోగించుకోవచ్చు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు బాలలకు విముక్తి కల్పిస్తారు. విద్యుత్తు సమస్యల పరిష్కారానికి విద్యుత్తు సంస్థ 1912 నెంబరును అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫోన్ చేసి సమస్య పరిష్కరించుకునే అవకాశం ఉంది. మహిళలు గృహహింస ఎదుర్కొంటే 181కు ఫోన్ చేయవచ్చు. మహిళా సహాయక కేంద్రం సిబ్బంది స్పందించి సహాయం అందిస్తారు. పనిచేసే చోట వేధింపులు, లైంగిక, వరకట్న వేధింపులతో పాటు ఆడ శిశువుల విక్రయం, మానవ అక్రమ రవాణా సంబంధిత



అంశాలపై నేరుగా ఫిర్యాదు చేసి సహాయం పొందవచ్చు.

**స్టేషన్ బెయిల్ ఎలా ఇస్తారంటే**

వివిధ నేరాల్లో నిందితులపై పోలీసులు భారతీయన్యాయ సంహిత(బీఎన్ఎస్) చట్ట ప్రకారం వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తుంటారు. తీవ్రమైన నేరాలతో పాటు ఏడేళ్లలోపు శిక్షలు విధించే కేసుల్లో నిందితులు విచారణకు సహకరించే వారికి అన్ని కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇచ్చే అధికారం పోలీసులకు ఉంది. పోలీసులు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టంలోని సెక్షన్ 35(3) ప్రకారం నోటీసు ఇచ్చి నేర విచారణతోపాటు చట్టంలో పేర్కొన్న నిబంధనలు పాటిస్తారని పోలీసులు భావిస్తే స్టేషన్ అధికారి బెయిల్ ఇవ్వవచ్చు. కేసులో ఉన్న నిందితులు వ్యక్తిగత వివరాలు, గుర్తింపు ధ్రువపత్రాలు, జామీను బాండ్‌ను సమర్పించాల్సి ఉంటుంది. నిందితులు సెక్షన్ 35(4) నోటీసు నిబంధనలు, షరతులు పాటించాలి.

సెక్షన్ 35(5) ప్రకారం నిబంధనలు పాటిస్తున్నప్పటికి పోలీసులు అరెస్టు చేయాలని భావిస్తే ఆ కారణాన్ని రికార్డు చేయాలి. నిబంధనలు పాటించని నిందితులను న్యాయస్థానం ఆదేశాలకు లోబడి సెక్షన్ 35(6) ప్రకారం అరెస్ట్ చేయవచ్చు. ఏడేళ్లలోపు శిక్షలు విధించే కేసుల్లో ఉన్న నిందితులు పోలీసుల విచారణకు సహకరించరని అనుకుంటే సెక్షన్ 35(1)బీ నోటీసు ఇవ్వకుండా అరెస్ట్ చేయవచ్చు.

ఏడు సంవత్సరాలు కంటే ఎక్కువ శిక్షలు ఉన్న కేసుల్లో సెక్షన్ 35(1)సీ అరెస్టుకు కారణం చూపాల్సిన అవసరం లేదు. నేరుగా అరెస్టు చేయవచ్చు. అరెస్టులపై పోలీసులకు విచక్షణాధికారం ఉన్నప్పటికి అర్నేష్‌కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ 2014 కేసులో సుప్రీంకోర్టు తన తీర్పును వెల్లడించింది. ఏడేళ్లలోపు శిక్షలు పడే కేసుల్లో నోటీసు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇవ్వాలని తన తీర్పులో పేర్కొంది. అరెస్ట్ సమయంలో పోలీసుల విచక్షణాధికారాల గురించి ఈ తీర్పు చెబుతుంది.

# బియ్యం.. బలవర్ధకం

మిర్యాలగూడ : గ్రామీణ, పట్టణ ప్రాంతాల నిరుపేదలకు ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా మూడేళ్లుగా ఫోర్టిఫైడ్ బియ్యం (బలవర్ధక బియ్యం) సరఫరా చేస్తుండగా వీటిలో ఉన్న పోషకాల విషయంలో ఇటీవల చర్చ మొదలైంది. గ్రామీణ ప్రాంత పేదలకు సరైన పోషకాలు అందకపోవటంతో తరచూ రక్తహీనత, ఎముకల సమస్యలు, కంటి చూపు, శారీరక రుగ్మతలతో ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం పౌర సరఫరాల ద్వారా పేదలకు అందించే బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ 12




వంటి సూక్ష్మ పోషకాలను కలిపి అందిస్తున్నారు.

**రేషన్ దుకాణాలకు ఫోర్టిఫైడ్ బియ్యం..**

ఐకేపీ కేంద్రాల ద్వారా పౌరసరఫరాలశాఖ కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం రైస్ మిల్లులకు కస్టమ్ మిల్లింగ్‌కు ఇస్తున్నారు. మర పట్టిన అనంతరం బియ్యంను రైస్ మిల్లుల వారు భారత ఆహార సంస్థ వారికి అప్పగించాల్సి ఉంది. మిల్లుల్లో ప్రత్యేకంగా ఫోర్టిఫైడ్ మిక్సింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని ఎఫ్‌సీఐకి ఇచ్చే బియ్యంలో సూక్ష్మపోషకాలు కలుపుతున్నారు. పౌరసరఫరాలశాఖ వారే ఆయా మిల్లులకు ఇచ్చిన కస్టమ్ మిల్లింగ్ ధాన్యానికి అనుగుణంగా సూక్ష్మపోషకాల బస్తాలను అందిస్తున్నారు. మిల్లుల్లో బస్తాలను ప్యాకింగ్ చేసే సమయంలో బస్తాకు ఒక కిలో సూక్ష్మపోషకాలను కలిపి ప్యాకింగ్ చేసి ఎఫ్‌సీఐకి పంపుతున్నారు. నాణ్యత నియంత్రణ అధికారులు ప్రత్యేకంగా బియ్యం నాణ్యతతో పాటు సూక్ష్మపోషకాల శాతం గుర్తించిన తరువాతే ఎఫ్‌సీఐ తీసుకుంటుంది. ఈ బియ్యం రేషన్ దుకాణాల ద్వారా నిరుపేదలకు అందిస్తున్నారు. బీ మొదట్లో కొందరు బియ్యం రంగుమారి వస్తున్నట్లు గా అపోహలు చెందినప్పటికీ అధికారులు అవగాహన కల్పించడంతో ప్రస్తుతం వాటినే వినియోగిస్తున్నారు.

**పిల్లలకు ఎంతో ఆరోగ్యం–డాక్టర్ జి.అంజయ్య, చిన్నపిల్లల వైద్య నిపుణులు**

సాధారణంగా తినే పాలిష్ బియ్యంలో బలవర్ధకమైన పోషకాలుండవు. అందుకే ప్రభుత్వం ఇచ్చే ఫోర్టిఫైడ్ బియ్యంను గంజి వార్చకుండా వండి తింటే చిన్నపిల్లలకు, పెద్దలకు ఎంతో మంచిది. వీలైతే కుక్కర్‌లో వండితే అన్ని విధాలుగా మేలు. వీటిపై ఎలాంటి అపోహలకు లోనుకావొద్దు.

# మెట్రో విస్తరణ.. చేవెళ్లలో ఎక్కువ.. భువనగిరిలో తక్కువ

హైదరాబాద్: మెట్రోరైలు రెండోదశ మొదటిభాగంలో ప్రతిపాదించిన మార్గాలు ఐదు లోక్‌సభ స్థానాల పరిధిలో ఉన్నాయి. ఎంపీలకు అవగాహన కోసం ఏ లోక్‌సభ పరిధిలో ఎన్ని స్టేషన్లు వస్తాయి? ఎన్ని కిలోమీటర్ల మెట్రోరైలు రాబోతుందనే వివరాలను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్‌ఏఎంఎల్) రూపొందించింది. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎంపీలకు ఇప్పటికే ఈ వివరాలను అందజేసింది.

**అనుమతులివ్వాలని విజ్ఞప్తులు..**

నగరంలో మెట్రోరైలు రెండోదశ 2(ఏ)లో 5 కారిడార్లలో 54 స్టేషన్లతో 76.4 కి.మీ. మార్గాలను ప్రతిపాదించారు. డీపీఆర్‌లను గత ఏడాది నవంబరులో కేంద్రానికి పంపించారు. కేంద్రం, రాష్ట్ర సంయుక్త ప్రాజెక్ట్‌గా చేపట్టాలని.. అందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. ఇప్పటికే పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని



మోదీని, కేంద్రమంత్రులను కలిసి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తులు చేశారు. డీపీఆర్‌లు పరిశీలనలో ఉన్నాయని కేంద్రం అంటోంది. ఇటీవల పుణే మెట్రోకి కేంద్రం అనుమతి ఇచ్చింది. 20 వరకు చిన్న నగరాలకు కేంద్రం మెట్రో మంజూరు చేసిందని.. హైదరాబాద్ మెట్రోకి త్వరితగతిన అనుమతులు వచ్చేందుకు పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని, కేంద్రంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంపీలను కోరింది. మెట్రో విస్తరణ అనుమతుల కోసం ఎంపీలతో సమన్వయం చేసుకోవాలని హెచ్‌ఏఎంఎల్ అధికారులకు సీఎం ఇప్పటికే పలుమార్లు సూచించారు. వీటన్నింటి దృష్ట్యా ఎంపీలు, ఎమ్మెల్యేల పరిధిలో మెట్రో ప్రతిపాదనల వివరాలను రూపొందించింది. మెట్రోరైలు 2(ఏ) విస్తరణ ప్రతిపాదనల్లో చేవెళ్ల లోకసభ స్థానం పరిధిలోనే అత్యధికంగా 39.09 కి.మీ, 30 స్టేషన్లు రాబోతున్నాయి. మల్కాజిగిరి ఎంపీ పరిధిలో 11 స్టేషన్లు 12.28 కి.మీ., హైదరాబాద్ ఎంపీ స్థానంలో 13.32 కి.మీ. 11 స్టేషన్లు, మెదక్ పరిధిలో 8.16 కి.మీ., భువనగిరి ఎంపి పరిధిలో 3.6 కి.మీ. విస్తరణ ప్రతిపాదనలు ఉన్నాయి.

# చెత్త తీయరు.. బాధ తీరదు

బషీరాబాద్: ఇంటింటి చెత్త సేకరణకు పంచాయతీ సిబ్బంది మంగళం పాడారు. పంచాయతీల్లో నిధుల్లేవని, ట్రాక్టరు నిర్వహణ, డీజిల్‌కు సొంతంగా ఖర్చు చేసేవారు లేకపోవడంతో చెత్త సేకరణ నిలిచిందని పంచాయతీ సిబ్బంది తెలిపారు. ఫలితంగా ఇళ్లలోని చెత్త పేరుకుపోతోందని గృహిణులు వాపోతున్నారు. కనీసం వారానికి ఒక రోజైనా వచ్చి తీసుకెళ్లాలని కోరుతున్నారు.

**సర్పంచులు లేకపోవడంతో..**

తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్, తాండూరు, యాలాల, పెద్దేముల్ మండలాలున్నాయి. సుమారు 2 లక్షలకుపైగా జనాభా నివాసముంటోంది. తాండూరు పట్టణానికి సమీపంలోని కొన్ని పంచాయతీల్లో సాధారణ నిధులు కొంతమేరకు ఉన్నాయి. మిగతా వాటిలో నిధుల లేమి వేధిస్తోంది. ప్రస్తుతం సర్పంచులు లేకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయాయి. కేవలం పన్నులు, సాధారణ నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎస్‌ఎఫ్‌సీ నిధులు పంచాయతీ సిబ్బంది వేతనాలు, ఇతర అత్యవసర



ఖర్చులకే సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో రోజూ ఉదయం, సాయంత్రం ట్రాక్టర్‌లో డీజిల్ వేయడం, ఇతర నిర్వహణకు ఇబ్బందిగా మారిందని పంచాయతీ సిబ్బంది చెత్త సేకరించడం మానేశారు.

**ఇంట్లో పెట్టుకోలేక.. బయట పారేయలేక..**

రోజూ ట్రాక్టర్, మూడు చక్రాల సైకిల్ బండితో ఇంటింటికీ వచ్చి చెత్త సేకరించేవారు. సుమారు నెల రోజులు కావొస్తున్నా.. బండి రాకపోవడంతో ఇళ్లలోని చెత్త డబ్బాలు పేరుకుపోతున్నాయి. గతంలో ఊరి చివరన పెంటకుప్పలుండేవి. రోజూ వాటిలో పారబోసేవారు. ఈ విధానం మారడంతో ఇంట్లో చెత్తను పెట్టుకోలేక.. బయట పడేయలేక గృహిణులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ద్విచక్రవాహనాలపై ఊరి శివారు దారుల పక్కన పడేసి వస్తున్నారు. ఫలితంగా రోడ్ల పక్కన మురుగు మారుతోంది. పంచాయతీల్లో నిధుల్లేకనే చెత్త సేకరణ మానేశామని, రాగానే ట్రాక్టర్లు నడిపే అవకాశం ఉందని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు.

# వరదకు ‘దారి’చూపారు

హైదరాబాద్ : రహదారి ముంపు సమస్యను తగ్గించడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ చేపట్టిన భూగర్భ వరద నీటి నిల్వ ట్యాంకుల నిర్మాణం పూర్తయింది. మొదటి దశలో చేపట్టిన 11 నిర్మాణాలు 100 శాతం అందుబాటులోకి వచ్చాయి. రెండో దశలో మరిన్ని ప్రాంతాల్లో నిర్మించేందుకు ఇంజినీరింగ్ విభాగం కసరత్తు ప్రారంభించింది.**రెండో దశకు ప్రతిపాదనలు..:** మొదటి దశలో భాగంగా ఖైరతాబాద్ జోన్‌లోని కేసీపీ కూడలి, రాజ్‌భవన్‌రోడ్డు, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లరు నం.264 వద్ద, జూబ్లీహిల్స్ రోడ్డు నం.45లోని మొంగనీస్ బేకరీ వద్ద, బైరామల్‌గూడ పైవంతెన కింద, సచివాలయం ముందున్న బస్టాపులో నిర్మించిన భూగర్భ ట్యాంకులు విజయవంతమైనట్టు జీహెచ్ఎంసీ పేర్కొంది. ఈ నేపథ్యంలో రెండో దశ కింద మరిన్ని ప్రాంతాల్లో ట్యాంకులు నిర్మించేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలని కేంద్ర కార్యాలయం ఇటీవల జోనల్ ఇంజినీర్లను కోరింది.

**రహదారులపై నీరు నిలవదు**నగరవ్యాప్తంగా 142 చోట్ల వర్షాలొచ్చినప్పుడు రోడ్లు మునుగుతున్నాయి. మొదటి దశలో 11 ప్రాంతాల్లో రూ.15.69 కోట్లతో పనులు పూర్తి చేశాం. ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో చేపట్టిన ట్యాంకు నిర్మాణంలో కేవలం 5శాతం పనులు మిగిలి ఉన్నాయి. అవి రెండు రోజుల్లో పూర్తవుతాయి. అన్ని ట్యాంకుల వద్ద భారీ మోటార్లు సిద్ధంగా ఉంచుతున్నాం. వరద రోడ్డుపై నిలవకుండా.. భూగర్భ ట్యాంకుల్లోకి చేరుతుంది. అందులోని ఇంజక్షన్ బోరు బావులతో కొంతనీరు భూగర్భంలోకి ఇంకుతుంది. మిగిలిన నీటిని భారీ మోటార్లతో చుట్టుపక్కలున్న వరద నాలాల్లోకి ఎత్తిపోస్తాం.

ఆర్వీ కర్ణన్, కమిషనర్, జీహెచ్ఎంసీ

# అసైన్డ్ అడ్డొచ్చింది.. అక్రమార్కులకు కలిసొచ్చింది



హైదరాబాద్ : ఈ చిత్రం చూశారా... బౌరంపేట ఔటర్ సర్వీస్ రోడ్డును కలుపుతూ వేస్తున్న రహదారి... ఇది ప్రజల రాకపోకల కోసం కాదు.. ప్రైవేటు వెంచర్లకు మాత్రమే పరిమితం. ఒకటిన్నర కిలోమీటర్ల రోడ్డు వేస్తుండగా మధ్యలో 800 మీటర్ల అసైన్డ్‌భూములు అడ్డుగా వచ్చాయి. మనల్ని అడ్డుకునేదెవరని రియల్టర్లు అసైన్డ్‌భూమిని కలిపేసుకున్నారు.. దర్జాగా రహదారి వేసేస్తున్నారు. రెండుమూడు రోజుల నుంచి పనులు జరుగుతున్నా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు..

ప్రభుత్వ, అసైన్డ్ భూములు కబ్జాచేస్తే కఠినంగా వ్యవహరిస్తామని కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో ఎక్కడా పనిచేయడం లేదని నగర శివారులోని మున్సిపాలిటీల్లో పరిశీలిస్తే ఇట్టే తెలిసిపోతుంది. రియల్టర్లు అసైన్డ్‌భూములను కబ్జా చేస్తున్నా.. వాటిల్లోంచి రహదారులు వేస్తున్నా అధికారులు అటువైపు తొంగిచూడడం లేదు.

**హెచ్ఎండీఏ అనుమతించాలంటే...** దుండిగల్ మున్సిపాలిటీలోని బౌరంపేట ప్రాంతం ఔటర్‌కు దగ్గరగా ఉండడంతో గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జోరందుకుంది. వీటి నిర్మాణాలకు హెచ్ఎండీఏ అనుమతులిస్తోంది. అయితే అనుమతులు కావాలంటే ఆయా నిర్మాణాలకు అనుసంధాన రహదారులు కనిష్ఠంగా 40 అడుగులుండాలి. కొన్ని వెంచర్ల ప్రతినిధులు వారి నిర్మాణాల నుంచి ప్రైవేటు పట్టాభూములు లేకపోవడంతో సర్కారు భూములు, అసైన్డ్ స్థలాల్లో కొంతభాగాన్ని ఆక్రమించి రహదారులు వేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ముగ్గురు రియల్ వెంచర్ల ప్రతినిధులు బౌరంపేటలోని అసైన్డ్‌భూముల్లో రోడ్లు వేసుకుంటున్నారు.గిఫ్ట్‌డీడ్ ఇవ్వకుండా.. ఇష్టారాజ్యంగా..

నగర సమీపంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రియల్టర్లు రోడ్లు వేసుకోవాలంటే లే-అవుట్‌లో కచ్చితంగా మున్సిపాలిటీకి రోడ్లు, ఉద్యానాలకు స్థలాలు కేటాయించాలి. వాటిని సంబంధిత మున్సిపాలిటీకి గిఫ్ట్‌డీడ్‌గా ఇవ్వాలి. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రహదారులు విస్తరించేందుకు ఇవి ఉపయోగపడతాయి. ఇందుకు విరుద్ధంగా దుండిగల్, శంషాబాద్ మున్సిపాలిటీల్లో కొందరు స్థిరాస్తి వ్యాపారులు గిఫ్ట్‌డీడ్‌లు కాదు కదా... ఏకంగా ప్రభుత్వ స్థలాలు, ఎసైన్డ్‌భూములను ఆక్రమిస్తున్నారు. బౌరంపేట్ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 166/3లోని ఎసైన్డ్ భూమి నుంచి రహదారులు వేస్తున్నారు. ఈ విషయంపై స్థానికులు మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో వారు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో కొద్దిరోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు స్పందిస్తారేమోనని ఎదురుచూస్తున్నారు.

# గమ్యం చేరేలా.. ముందే మేల్కొనేలా



హైదరాబాద్: మహానగర పరిధి పెరుగుతోంది. 7,200 చదరపు కిలోమీటర్ల నుంచి పదివేల కిలోమీటర్లు..11 జిల్లాల్లోకి విస్తరించింది. దీనికి సంబంధించి ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్-2050కు రూపకల్పన జరుగుతోంది. పకడ్బందీ ప్రణాళిక, ఆర్థికాభివృద్ధి, ప్రజారవాణా, నీటి వనరుల సంరక్షణ ఇలా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని కొత్త ప్లాన్‌కు సిద్ధమవుతోంది. సెప్టెంబరులో ముసాయిదా విడుదలకు హెచ్ఎండీఏ రంగం సిద్ధం చేస్తోంది. నూతన బిల్డింగ్ కోడ్‌కు సంబంధించి కొత్త నియమావళిని తీసుకొచ్చేందుకూ కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే కన్సల్టెంట్ నియమకానికి నోటిఫికేషన్ జారీ చేశారు. కీలకమైన పట్టణ ప్రణాళికలో భాగంగా రవాణాధారిత అభివృద్ధి కేంద్రాలపై దృష్టి పెట్టనున్నారు.

**కోటిన్నర జనాభా.. 80 లక్షల వ్యక్తిగత వాహనాలు**

హెచ్ఎండీఏ పరిధి వరకు కోటిన్నర జనాభా నివసిస్తోంది. ప్రస్తుతం గ్రేటర్‌లో 80 లక్షల వరకు వ్యక్తిగత వాహనాలు ఉన్నాయి. నిత్యం 3 వేల కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. మున్ముందు వాటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. భవిష్యత్తులో భాగ్యనగరం కాలుష్యంలో మరో దిల్లీ కాకముందే మేల్కొనేలా పాలసీలకు రూపకల్పన చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**ఏమిటీ.. రవాణాధారిత కేంద్రాలు**

చాలామందికి నివాసం ఒక చోట...పని ప్రదేశం మరో చోట ఉండటం వల్ల ఎక్కువగా వ్యక్తిగత వాహనాలు వినియోగిస్తుంటారు. రోడ్లపైకి వేలాది వాహనాలు రావడంతో ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బంది లేకుండా విస్తరిత ప్రాంతాల్లో ఎక్కువ శాతం రవాణాధారిత అభివృద్ధికి చోటు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. పనిచేసే చోట నుంచి సులువుగా ప్రజారవాణా ఉపయోగించుకోవడం వల్ల వ్యక్తిగత వాహనాల సంఖ్య తగ్గించొచ్చని చెబుతున్నారు. అందులో భాగంగా మెట్రో విస్తరణ, ఆర్టీసీ సేవలు మెరుగు తదితర ప్రజా రవాణా సేవలను పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇప్పటికే వచ్చే 20 ఏళ్లలో మెట్రోను 600 కిలోమీటర్లకు విస్తరించాలనేది కీలక ప్రతిపాదనగా ఉంది. ఈ నేపథ్యంలో పలు కారిడార్లలో డీపీఆర్‌లు సిద్ధం చేసిన హెచ్ఎండీఏ అనుమతులకు కేంద్రానికి పంపించింది. వీటితోపాటు ఆర్టీసీ సేవలు పెంపు, ఇతర ప్రత్యామ్నాయ ప్రజా రవాణా సేవలపై దృష్టి సారించినట్లు ఓ అధికారి తెలిపారు.

# నాణ్యత నగుబాటు!



టేకులపల్లి : సింగరేణి ఇల్లెందు ఏరియా పరిధిలోని కోయగూడెం ఉపరితలగని (కేఓసీ)లో ఉత్పత్తి అవుతున్న బొగ్గులో నాణ్యత లోపించింది. మరో నాలుగేళ్ల పాటు కోయగూడెం ఓసీ పిట్-1 కాలపరిమితి ఉంది. ఈ గని నుంచి రోజు పది వేల టన్నుల బొగ్గును సింగరేణి ఉత్పత్తి చేస్తోంది. ఇక్కడ ఉత్పత్తి అయిన జీ-13 బొగ్గును ఇల్లెందు, రుద్రంపూర్ సీహెచ్‌పీలకు టిప్పర్ల ద్వారా రవాణా చేసి అక్కడి నుంచి రైలు బోగీల ద్వారా వీటీపీసీ, ఎన్‌టీపీసీ, మహా జెన్‌కో, చంద్రాపూర్ తదితర పవర్, సిమెంట్ పరిశ్రమలకు తరలిస్తుంటారు. అయితే కేఓసీలో ప్రస్తుతం జీ-14, జీ-15 బొగ్గు ఉత్పత్తి అవుతుండటంతో వినియోగదారులు కేఓసీ బొగ్గును తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు.

**పర్యవేక్షణ లోపంతోనే..** కోయగూడెం ఓసీలో సుమారు 150 మీటర్ల లోతులో ప్రస్తుతం కోల్‌బెంచ్ ఉంది. ఇక్కడ సర్ఫేస్ మైనర్ యంత్రం ద్వారా బొగ్గును తీస్తుంటారు. బొగ్గు ఉత్పత్తి సమయంలో బొగ్గు (కోల్), రాళ్లు తదితరాలు (షేల్)ను వేరు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం సింగరేణికి సంబంధించిన అండర్ మేనేజర్, ఓవర్‌మెన్, మట్టితీత (ఓబీ)కు సంబంధించిన పర్యవేక్షకుడు ఉంటారు. ఇలా కోల్‌ను, షేల్‌ను వేరు చేసి లోడర్ ద్వారా వోల్వోకు లోడ్ చేసి కోల్‌యార్డుకు తరలించాలి. కానీ ఇక్కడే కొందరు అధికారులు పర్యవేక్షణ మరిచి చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో కోల్, షేల్ కలిసిపోవడంతో బొగ్గు నాణ్యత అమాంతం పడిపోతోంది. రాత్రి షిఫ్టుల్లో ఈ పరిస్థితి ఇంకా ఎక్కువగా ఉంటుందని, దగ్గరుండి పర్యవేక్షించాల్సిన సింగరేణి అధికారులు విధి నిర్వహణ ప్రాంతాలను వదిలి గని మొత్తం తిరుగుతుంటారని ఈ కారణంగానే సమస్య తలెత్తుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆర్డర్లు తిరస్కరణకు గురవుతున్నాయనే ఆరోపణలున్నాయి.

కేఓసీలో రోజు పది వేల టన్నులు బొగ్గు ఉత్పత్తి అవుతుంది. ఇల్లెందు సీహెచ్‌పీకి రోజు 6 వేల టన్నులు, రుద్రంపూర్ సీహెచ్‌పీకి 6 వేల టన్నులు రవాణా చేయాలి. బొగ్గు నాణ్యత లేకపోవడంతో జూన్ 24 నుంచి ఇల్లెందు సీహెచ్‌పీకి సరఫరా నిలిచిపోయింది. రుద్రంపూర్ సీహెచ్‌పీకి రోజు 1500 టన్నులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. దీంతో కేఓసీలో నెలరోజులుగా లక్షన్నర టన్నులకు పైగా బొగ్గు నిల్వలు పేరుకుపోయాయి. పరిశ్రమల నుంచి ఆర్డర్లు రావడం లేదు.’

తుకారాం, ఇల్లెందు ఏరియా డీవైజీఎం (పర్సనల్).

# సామగ్రి కొనలేం.. ఇల్లు కట్టలేం!

కరీంనగర్ : దేవుడు కరుణించినా.. పూజారి కరుణించలేదనట్లుగా మారింది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. లబ్ధిదారులను ఎంపిక చేయడంతో వారు పనులను ప్రారంభించారు. దీనిని అదునుగా భావించి కొందరు భవన నిర్మాణ సామగ్రి వ్యాపారులు ధరలు పెంచుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము సరిపోదని భయపడుతున్నారు.

**రూ.5 లక్షలు సరిపోతాయా?**

పైలట్ ప్రాజెక్టు కింద మొదట జిల్లాలోని 15 మండలాల్లో దాదాపు 477 ఇళ్లు మంజూరు చేశారు. నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాలతోపాటు హుస్నాబాద్‌లోని రెండు మండలాలను కలిపి దాదాపు 14 వేలకు పైగా ఇళ్లు కేటాయించాలని భావించారు. ఇందులో 8000కు పైగా మంజూరై..



చాలా చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. మార్కెట్లో నిర్మాణ సామగ్రి ధరల పరిస్థితితో రూ.5 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా లేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మేస్త్రీలు నిర్మాణ ధరలు, కూలీల ధరలు కూడా పెంచారు.

**జిల్లా, మండల కమిటీల ఏర్పాటు..**

నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణకు జిల్లాలో కమిటీలు వేయాలని ప్రభుత్వం కలెక్టర్లకు సూచించింది. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా, కన్వీనర్‌గా హౌసింగ్ శాఖ పీడీ, సభ్యులుగా అదనపు కలెక్టరు, ఇతర అధకారులు ఉంటారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, తదితర అధికారులు ఉంటారు.

**నిర్మాణం పూర్తి చేసేదెలా?**

– గడ్డం గీత, వెన్కేపల్లి

ఇల్లు మంజూరు కాకముందుతో పోలిస్తే ధరలు ఇప్పుడు చాలా పెరిగాయి. కంకర, సలాక, మొరం, సుతారి, కూలీ రేట్లు 40 శాతం వరకు పెంచారు. ఈ ధరలు తగ్గకపోతే ఇంటి నిర్మాణం పూర్తిచేయలేం.

# అనుమతులు వచ్చినా అంతులేని జాప్యం

ధర్మపురి : నిజామాబాద్-జగ్దల్‌పూర్ జాతీయ రహదారి-63ని పనులకు మొన్నటి వరకు రిజర్వు అటవీ అనుమతుల్లో జాప్యం జరిగింది. ఇటీవల దీనికి అనుమతులు వచ్చినా టెండర్లు ఖరారు చేయడంలో జాప్యం జరుగుతోంది. నిజామాబాద్-జగ్దల్‌పూర్ జాతీయ రహదారిని హామ్(హైబ్రిడ్ యాన్యూటీ మోడ్) పద్ధతిలో రూ.3,850 కోట్ల వ్యయంతో చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టు పొడవు 131 కిలోమీటర్ల పొడవును 4 ప్యాకేజీలుగా విభజించారు. ఆర్మూర్-మెట్‌పల్లి, మెట్‌పల్లి-జగిత్యాల, జగిత్యాల-రాయపట్నం, రాయపట్నం- మంచిర్యాలగా పనులను విభజించారు. 2023 డిసెంబరు నుంచి టెండర్ తుది ప్రక్రియ జరుగుతోంది. దీన్ని పలుమార్లు పొడిగించినా ఖరారు కాకపోవడమే జాప్యానికి కారణం అని అధికారుల ద్వారా తెలుస్తోంది.

**కదలిక వచ్చినా.. నిలిచిన ప్రక్రియ**

రెండు నెలల కిందట ఈ జాతీయ రహదారి ప్రక్రియలో కొంత కదలిక వచ్చింది. పుణ్య క్షేత్రాలు, పట్టణాలైన ధర్మపురి, గూడెంలతోపాటు



జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలను కలపకుండా బయట నుంచి నాలుగు వరుసలుగా విస్తరించేందుకు అధికారులు కసరత్తు చేశారు. ఆర్మూర్-మెట్‌పల్లి మధ్య 35 కి.మీ, మెట్‌పల్లి-జగిత్యాల మధ్య 28 కి.మీలు, జగిత్యాల-రాయపట్నం 31 కి.మీలు, రాయపట్నం-మంచిర్యాల మధ్య 35 కి.మీల రహదారిని నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ రహదారి భూసేకరణ ప్రక్రియ అంతా పూర్తయింది. 248 మంది రైతుల నుంచి 250 హెక్టార్ల భూమిని సేకరించే ప్రక్రియ పూర్తయింది. రైతులకు సంబంధించిన అభ్యంతరాలపై మరోమారు రెవెన్యూ అధికారులు సర్వే చేసి నివేదికలను సమర్పించారు. అయితే రెండు నెలల కిందటే బుగ్గారం, ధర్మపురి మండలాల్లోని గుట్టల్లోని రిజర్వు అటవీ భూములకు అనుమతులు వచ్చాయి. ఇక కదలిక వచ్చిందనుకున్న సమయంలో టెండర్లు ఓపెన్ కావడం లేదని తెలుస్తోంది. కోర్టు కేసులు లేనిచోట్ల పరిహారం కోసం అవార్డుల ప్రక్రియ పూర్తయింది. టెండరు ఓపెన్ చేయాల్సి ఉంటుందని, టెండరు పూర్తయితేనే పనులు ప్రారంభించే అవకాశముందని సమాచారం.

# జీవాలకు మందులేవీ?

గంభీరావుపేట : జిల్లాలో పశువైద్యం గాలిలా దీపంలా మారింది. పాడి రైతులు, పశు పోషకులకు ఆదరువుగా నిలిచే జీవాలు పలురకాల వ్యాధులతో బాధపడుతుండగా.. ప్రైవేటు వైద్యంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ఏటా వర్షాకాలం ఆరంభంలో గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. మేకలు, గొర్రెలు, పశువులకు నట్టల నివారణ మందులు అందించేవారు. 16 నెలల నుంచి జిల్లాలోని పశు వైద్యశాలలకు మందులు రావటం లేదు. సంవత్సరంలో నాలుగు సార్లు మందులు రావాల్సిన ఉండగా.. కొన్ని మాత్రమే వస్తున్నాయని.. అవి ఎటూ సరిపోవటం లేదని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. దాదాపు రెండు సంవత్సరాల నుంచి మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేయటం లేదని తెలుస్తోంది. దీంతో ప్రైవేటు దుకాణాల నుంచి మందులు తెచ్చుకుంటున్నారు.

**సిబ్బంది కొరత** జిల్లా వ్యాప్తంగా 17 ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, 13 పశువైద్య ఉప కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 17 మంది వైద్యులకు 13 మంది ఉన్నారు. నాలుగు పశు వైద్య కేంద్రాల్లో డాక్టర్లు లేరు. జిల్లాలోని పశు వైద్యశాలల్లో అటెండర్, కౌంపౌండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో పశువులకు సరైన వైద్య అందక పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు.

చురకలు



# రుణానికి ఎదురుచూపులు

జగిత్యాల: స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకం కింద ప్రభుత్వం అందించనున్న రుణాల మంజూరు ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోవడంతో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. దీని కింద సకలంలో స్వయం ఉపాధి రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసింది. ఇందులో రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2 లక్షలు, రూ.4 లక్షల చొప్పున కుటుంబంలో ఒక్కరికే రుణం అందించేలా పథకం రూపొందించింది. వ్యవసాయ రంగంలో 7 అంశాలు, పశుపోషణ విభాగంలో మరో 8, వ్యాపారం కేటగిరిలో 75, మొత్తం కలిపి 90 రకాల వ్యాపారాలు చేసేవారికి రుణాలు మంజూరు చేయాలని సంకల్పించింది.



**వెల్లువెత్తిన దరఖాస్తులు**

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ తదితర అన్ని వర్గాలవారు వేల సంఖ్యలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మొదటి విడత కింద రుణాలు అందించేందుకు మౌఖిక పరీక్ష నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. ఈ క్రమంలో మొదటగా రూ.50 వేలు, రూ.లక్ష కేటగిరీల్లో వచ్చిన దరఖాస్తుదారులకు అందించేందుకు వడపోత చేపట్టి లబ్ధిదారులను ఎంపిక చేశారు.

**తాత్కాలికంగా నిలిపివేత**

ఈ పథకం కింద మంజూరైన రుణాలు చేతికి వస్తాయని లబ్ధిదారులు ఎదురుచూస్తున్న తరుణంలో మంజూరు ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోయింది. ప్రభుత్వ యంత్రాంగం నుంచి సైతం ఎలాంటి స్పష్టత లేదు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా రుణ మంజూరు ప్రక్రియను వాయిదా వేసినట్లు సమాచారం. అత్యధిక సంఖ్యలో దరఖాస్తులురాగా, విడతల వారీగా అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల తరుణంలో కొంతమందికే రుణాలు మంజూరు చేస్తే వ్యతిరేకత ఎదురవుతుందనే భావనతో తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం.

# ఉపాధి హామీ పనులు ఇక చాలు!

ఆదిలాబాద్ : గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు కేటాయించిన లేబర్ బడ్జెట్ లక్ష్యం పూర్తయిపోయింది. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై వడు నెలలైనా పూర్తి కాకముందే ఏకంగా 145 శాతం పని దినాలు నమోదయ్యాయి. సాధారణంగా పనిదినాల లక్ష్యం ఏటా వేసవిలో ఫిబ్రవరి, మార్చి నెలలో పూర్తవుతుంది. ఈ సంవత్సరం కేంద్రం పనిదినాల్లో సగానికి పైగా కోత విధించింది. తొలిసారిగా వర్షాకాలంలోనే లక్ష్యం దాటిపోయింది. పనిదినాల పొడిగింపుపై ఇంకా ఎలాంటి ఆదేశాలు రాక జిల్లాలో పనులు తగ్గించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**10.92 లక్షల పనిదినాలు అధికం**

కేంద్రప్రభుత్వం ఏటా రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి పనులు, కూలీల హాజరును బట్టి పనిదినాలను కేటాయిస్తోంది. అందుకు అనుగుణంగా జిల్లాల వారీగా లక్ష్యం విధిస్తారు. గతేడాది కొన్ని జిల్లాల్లో లక్ష్యానికి మించి ఉపాధి పనులు జరగడంతో కేంద్ర ప్రభుత్వం కేంద్ర బృందాలను పంపించి విచారణ చేయించింది. క్షేత్రస్థాయిలో కూలీలు వాస్తవంగా పనులకు హాజరవుతున్నారా లేదా అని ఆరా తీసింది. కొన్ని పనులు కేంద్రప్రభుత్వం సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా జరగడం లేదని తేలడంతో రాష్ట్రవ్యాప్తంగా పనిదినాల్లో భారీగా కోత విధించింది. జిల్లాలో గతేడాది 54లక్షల పని దినాలు జరగగా.. ఈసారి కేవలం రూ.23.81లక్షల పనిదినాలను మాత్రమే కేటాయించింది. జిల్లాలో ఇప్పటికే 34.73లక్షల పనిదినాలు నమోదయ్యాయి. అంటే లక్ష్యం కంటే 10.92 లక్షల పనిదినాలు ఎక్కువగా జరిగాయి.

**పొడిగింపుపై రాని స్పష్టత**

పనిదినాలలో రాష్ట్ర లక్ష్యం 6.50కోట్ల పనిదినాలు ఉండగా ఇప్పటికే 4.50 కోట్లకు పైగా పనిదినాలు జరిగాయి. కొన్ని జిల్లాల్లో లక్ష్యం మించిపోగా, మరికొన్ని జిల్లాల్లో ఇంకా లక్ష్యం చేరుకోలేదు. దినసరి కూలీ రూ.307కు పెంచడం, జిల్లాలో కూలీల సంఖ్య ఎక్కువగా ఉండటం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ఆశలతో ఈసారి జిల్లాలో లక్ష్యం కంటే అదనంగా 10.92లక్షల పనిదినాలు ఎక్కువగా నమోదయ్యాయి. ఏప్రిల్ 18 వరకు శ్రామికులకు చెల్లింపులు జరిగాయి. ఆ తర్వాత జరిగిన పనులకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం వర్షాకాలం ఆరంభం కావడంతో కూలీలు ఉపాధి పనులు మానేసి వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. అక్టోబరు, నవంబరు వరకు వ్యవసాయ పనులు కొనసాగుతాయి. ఆ తర్వాత డిసెంబరు నుంచి కార్మికులు తిరిగి ఉపాధి పనులకు వెళ్తారు. ఆర్థిక సంవత్సరం మరో తొమ్మిది నెలలు ఉండడంతో కేంద్రప్రభుత్వం నుంచి పనిదినాలు పెంచుతూ ఉత్తర్వులు వస్తే తప్ప కార్మికులకు పనులు చూపించే పరిస్థితులు లేవు.

**కేంద్రం పెంచితేనే.. రవీందర్ రాథోడ్, డీఆర్డీఓ**

జిల్లాలో ఈసారి కేటాయించిన లక్ష్యానికి మించి పనిదినాలు నమోదయ్యాయి. వనమహోత్సవం పూర్తికాగానే పనులు తగ్గించాలని ఆదేశాలు వచ్చాయి. ఇప్పటిదాకా పనులు చేసిన శ్రామికులందరికీ చెల్లింపులు జరుగుతాయి. కేంద్రం లేబర్ బడ్జెట్ పెంచితే అందుకు అనుగుణంగా పనులు కల్పిస్తాం.

# సర్కారు ప్రోత్సాహం.. అన్నదాత ఉత్సాహం

బెజ్జూరు: సాధారణంగా దేశంలో వంటనూనెల వినియోగం ఎక్కువ. విదేశాలనుంచి పామాయిల్ గింజలను దిగుమతి చేసుకుంటున్నాం. ఆయిల్ పామ్ సాగుతో విదేశాలకు ఎగుమతులు చేస్తూ.. మలేషియా వంటి దేశాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయి. తెలంగాణలోనూ స్వయం సమృద్ధి సాధించాలని ప్రభుత్వం దీని సాగుపై ప్రోత్సహిస్తోంది. పంట విస్తీర్ణం పెంచడానికి రాయితీలు, మెలకువలు, ప్రోత్సాహకాలు అందిస్తూ రైతులను చైతన్యపరుస్తున్నారు. అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తుండటంతో.. జిల్లాలోనూ సాగుపై ఆసక్తి పెరుగుతోంది. జిల్లాలో ఏటా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈఏడాది వెయ్యి ఎకరాల లక్ష్యం పెట్టుకోగా.. ఇప్పటికే 120 ఎకరాల్లో మొక్కలు నాటారు. 2022–23లో 1100 ఎకరాలకు 470, 2023–24లో 1000కి 520, 2024–25లో 700కు 329 ఎకరాల్లో సాగవుతోంది. రెబ్బెన, పెంచికల్‌పేట్ మండలాల్లో మొదటి సంవత్సరంలో సాగు చేసిన ఆయిల్‌పామ్ కోత దశకు వచ్చింది. సిర్పూర్ డివిజన్‌లోనే ఎక్కువగా సాగవుతుండగా.. ఇందిరా జల సౌర గిరివికాసం అమలైతే ఆసిఫాబాద్ డివిజన్‌లోనూ సాగు పెరిగే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**పలు రాయితీలు..**

ఆయిల్‌పామ్ సాగు రైతులకు 90శాతం రాయితీతో ప్రభుత్వమే మొక్కలను అందిస్తుంది. ఒక మొక్క విలువ రూ.193 కాగా రైతు రూ.20 చెల్లిస్తే చాలు. అయిదు ఎకరాల్లోపున్న వారికి బిందు సేద్యంపై బీసీలకు 90 శాతం, 5–12.50 ఎకరాల వరకు ఉన్న వారికి 80 శాతం, ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీపై పరికరాలను సైతం అందజేస్తారు. ఏటా ఎకరానికి రూ.4200 చొప్పున నాలుగేళ్ల వరకు అందజేస్తారు. దీంతోపాటు ఆయిల్‌పామ్ సాగులో వివిధ అంతర్గత పంటలు వేసుకునే అవకాశం ఉంది.

**మంచి ఆదాయం**

సాగు చేసిన నాలుగో సంవత్సరం నుంచే మొక్కల నుంచి గెలలు వస్తుంది. దాదాపు 4–35 సంవత్సరాల వరకు దిగుబడులు వస్తాయి. ఎకరానికి 10–12 టన్నుల దిగుబడి వచ్చే అవకాశాలుంటాయి. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం టన్నుకు రూ.19,200 ఉంది. ఎకరానికి రూ.1.20 లక్షలు రాగా రూ.20 వేలు ఖర్చులకు పోను రూ.లక్ష మిగులుతుందని అధికారులు చెబుతున్నారు. కేటాయించిన సంస్థనే మార్కెట్ సదుపాయం కల్పించి పంటను కొనుగోలు చేస్తుంది. వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులను జమచేస్తుంది.

# వరదొస్తేనే వరప్రదాయనికి జలకళ



జగిత్యాల : ఉమ్మడి జిల్లా వరప్రదాయని అయిన శ్రీరామసాగర్ ప్రాజెక్టులో పూడిక పేరుకుపోయి నీటినిల్వ సామర్థ్యం 112 టీఎంసీల నుంచి 80.5 టీఎంసీలకు తగ్గిన ప్రభావం మనపై అధికంగా పడనుంది. వానాకాలం సీజనులో కీలకమైన జూన్ నెల చివరకు వస్తున్నా ఎస్సారెస్పీలోకి ఆశించినట్లుగా వరద రాలేదు. ఈ నేపథ్యంలో జులై 1న మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరిపైగల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తనుండటంతో ఎస్సారెస్పీలోకి వచ్చే వరద నీటిపైనే సాగు భవితవ్యం ఆధారపడనుంది.

**మరమ్మతులు ముఖ్యమే..**

ఈ వానాకాలంలో 12.44 లక్షల ఎకరాల్లో ఆహార, 92 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లోనూ సగటు వర్షపాతం నమోదైతే 9.60 లక్షల ఎకరాలతో వరి ప్రధాన పంటగా తదుపరి పత్తి, మక్క, పసుపు పంటలు ఉండనున్నాయి. అయితే చివరి ఆయకట్టుకు నీరుపారేలా కాలువలు, తూములు, డ్రాపులు తదితరాలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలి. ప్రాజెక్టుల నుంచి అన్ని చెరువుల్లోకి నీటిని తరలించే తూముల నిర్మాణం, వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేస్తే పరోక్షంగానూ భూగర్భ జలమట్టం కనిష్ఠ స్థాయిలో కొనసాగి పైర్ల సాగుకు ఆసరాగా ఉంటుంది.

**బాబ్లీ నుంచి మన వాటా ఎంతంటే..**

శ్రీరామసాగర్ ప్రాజెక్టు అంతర్భాగంలో, బ్యాక్ వాటర్ నిల్వ ప్రాంతంలో గోదావరిపై మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్టును నిర్మించింది. దీనిపై తెలంగాణ రాష్ట్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీం తీర్పు ప్రకారం ఏటా జులై 1న మహారాష్ట్ర బాబ్లీగేట్లను ఎత్తి నాలుగు మాసాలపాటు వచ్చిన వరద నీటిని వచ్చినట్లే దిగువ ఎస్సారెస్పీలోకి వదలాలి. తిరిగి అక్టోబరు 28న బాబ్లీ గేట్లను మూసివేసి మిగిలిన ఎనిమిది మాసాల్లో వచ్చే 2.74 టీఎంసీల నీటిని మహారాష్ట్ర వినియోగించుకోవాలి. ఉమ్మడి జిల్లా తాగునీటి అవసరాల నిమిత్తం వేసవిలో 0.60 టీఎంసీల నీటిని బాబ్లీనుంచి ఎస్సారెస్పీలోకి విడుదల చేయాలి.

**వరద నీరే ఆధారం**

ఎస్సారెస్పీలోకి 2021 వర్షాకాలంలో 678 టీఎంసీలు, 2022 వర్షాకాలంలో 595 టీఎంసీలు, 2023లో 209 క్యూసెక్కులు, 2024లో 298 క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరింది. కాగా ప్రస్తుతం ఎగువన వర్షాల్లేక ఎస్సారెస్పీలోకి అత్యంత పరిమితంగానే ఇన్‌ఫ్లో ఉంది. బాబ్లీ ప్రాజెక్టు గేటెత్తితే కొంతనీరు వచ్చే అవకాశముండగా గోదావరి పరీవాహక ప్రాంతంలో సమృద్ధి వర్షాలు కురిస్తేనే శ్రీరామసాగర్ నిండే అవకాశం ఉంటుంది. 2023, 2024 వానాకాలాల్లో ఎల్లంపల్లి నుంచి వరద కాలువ ద్వారా కొంత నీటిని ఎస్సారెస్పీలోకి ఎత్తిపోయగా ప్రస్తుతం ఎల్లంపల్లిలోనూ నీరు తక్కువగానే ఉండటంతో ఎత్తిపోసే అవకాశం లేదు. ఎగువన వర్షాల్లేకున్నా ఎస్సారెస్పీ దిగువన వర్షాలు కురిసి ఎల్లంపల్లిలోకి నీరొస్తే ముస్ముందు ఎత్తిపోతలను చేపట్టి నంది, గాయత్రి పంపుహౌస్‌ల ద్వారా మధ్యమానేరు, దిగువమానేరు జలాశయాలను, చెరువులు, కుంటలను నింపవచ్చు, వరదకాలువద్వారా కొంతనీటిని ఎస్సారెస్పీలోకి ఎత్తిపోసే వీలుకూడా ఉంటుంది. తద్వారా పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు జల అభయం కలుగుతుంది.

శ్రీరామసాగర్ నిల్వ సామర్థ్యం : 80.501 టీఎంసీలు
ప్రస్తుతం నీటినిల్వ : 14.451 టీఎంసీలు
ఇప్పటివరకు వచ్చిన నీరు : 2.946 టీఎంసీలు
ప్రస్తుత ఇన్‌ఫ్లో : 1,693 క్యూసెక్కులు
ఎల్‌ఎండీ ఎగువన ఆయకట్టు – 4,42,920 ఎకరాలు
ఎల్‌ఎండీ దిగువన ఆయకట్టు – 5,05,720 ఎకరాలు

# నకిలీ విత్తు.. నిఘాతోనే చిత్తు



జగిత్యాల : జిల్లాలో వానాకాలం సాగు మొదలైన క్రమంలో పల్లెల్లో విత్తనాలు, ఎరువుల అమ్మకాలు జోరందుకున్నాయి. 4.34 లక్షల ఎకరాల్లో జిల్లా రైతులు అన్ని రకాల సాగుచేసే అవకాశముండగా.. నకిలీ పంట ఉత్పాదకాలు కర్షకులకు చేరకుండా అధికారులు గట్టి చర్యలు చేపట్టాల్సి ఉంది.

**గత మోసాలపై కనువిప్పు కలిగితేనే..**

జిల్లాలో గత పంట కాలాల్లో పెద్దఎత్తున నకిలీ సేంద్రియ ఎరువులు పట్టుబడ్డాయి. అయితే గుట్టుగా చాలా రకాలైన నకిలీ పంట ఉత్పాదకాలు రైతులకు చేరి నిండా ముంచుతున్నాయి. వానాకాలంలో సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతుండగా.. ఇదే అదనుగా మోసపూరిత విత్తనాలను అన్నదాతలకు అంటగడుతున్నారు. వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు మాత్రమే తమ దుకాణాలు, గోదాముల నుంచి బిల్లులపై విక్రయాలు జరపాల్సి ఉంది. అయితే కొంతమంది ఎలాంటి బిల్లులు లేకుండా నేరుగా విక్రయిస్తున్నారు. మరోవైపు ఆయా సంస్థల ప్రతినిధులు రైతులనుంచి అడ్వాన్సు తీసుకొని సేంద్రియ ఎరువు బస్తాలను వారి ఇళ్ల వద్దకే సరఫరా చేస్తున్నారు.

**అయోమయంలో అన్నదాతలు**

మిశ్రమ ఎరువులు, జింకు సల్ఫేట్, వర్మి కంపోస్టు, బయో ఫర్టిలైజర్స్, పోషక మందుల పేరిట మోసపూరిత ఉత్పత్తులను రైతులకు అంటగడుతున్నారు. కొన్నిచోట్ల నకిలీ పత్తి, మిరప, కూరగాయల విత్తనాలు, కలుపు నివారణ రసాయనాలనుసైతం నేరుగా విక్రయిస్తున్నారు. రైతులు ప్రశ్నిద్దామంటే బిల్లులు వంటివేవీ లేకపోవడంతో ఏమీ చేయలేకపోతున్నారు. కనీసంఅధికారులకు ఫిర్యాదు చేద్దామన్నా విక్రయించిన వారి ఆచూకీ లేదు.

**తెలిసినా పట్టింపులేదు**

వ్యవసాయశాఖ అనుమతించిన దుకాణంలో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయనందునా సదరు నమూనాలను పరీక్షకు పంపలేకపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో అధికారులకు తెలిసినా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, ఏఈవోలు.. అన్నదాతలను అప్రమత్తం చేసి నకిలీ ముఠా అమ్మకాలను అరికట్టాల్సి ఉంది. అలాంటివి అమ్మినవారిపై పీడీ చట్టాన్ని ప్రయోగిస్తేనే రైతులకు మేలు జరగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**గ్రామాల్లో నేరుగా కొనొద్దు**

రైతులు అప్రమత్తంగా ఉండాలి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పోషకాల మిశ్రమాలు తదితర అన్నింటినీ వ్యవసాయశాఖ అనుమతించిన దుకాణాల్లోనే బిల్లులపై కొనాలి. బిల్లు లేకుండా నేరుగా విక్రయించే ఎలాంటివి కొనవద్దు. గ్రామాల్లో అడ్వాన్సు బుకింగులు, అమ్మకాలపై తగిన సమాచారమిస్తే పట్టుకుని వారిపై కేసులు నమోదు చేయించేలా చూస్తాం.భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

# లెక్కల్లోనే మొక్కలు.. లక్ష్యం ముక్కలు



మోత్కూరు : పురపాలిక కేంద్రాలకు వచ్చే రహదారులు పచ్చదనంతో వెల్లివిరియాలని 'పట్టణ హరితహారం' కార్యక్రమాన్ని నాలుగేళ్ల క్రితం చేపట్టింది గత ప్రభుత్వం. అవెన్యూ ప్లాంటేషన్ పేరుతో రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటారు. రూ.లక్షలు ఖర్చుచేసి చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ల నిర్వహణ లేక మొక్కలన్నీ ఎండిపోతున్నాయి. జిల్లాలోని ఆరు పురపాలికల్లో అవెన్యూ ప్లాంటేషన్లను పరిశీలించగా పలు అంశాలు వెలుగుచూశాయి.భువనగిరి పట్టణంలో ఇప్పటివరకు రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేసి పట్టణంలోని ఎనిమిది అంతర్గత రహదారులకు ఇరువైపులా 53,080 మొక్కలు నాటినట్లు పురపాలక సంఘం రికార్డుల్లో నమోదై ఉంది. నాటిన మొక్కల్లో 87 శాతం బతికి ఉన్నట్లు అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేకపోవడం గమనార్హం. ఎండిన మొక్కల స్థానంలో కొత్తగా 3000 మొక్కలను నాటినట్లు అధికారులు రికార్డుల్లో నమోదు చేశారు. మున్సిపల్ కమిషనర్ రామలింగంను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఎండిన మొక్కల స్థానంలో జులై నెలలో మొక్కలను నాటుతామని, సంరక్షణకు ట్రీగార్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

చౌటుప్పల్ పరపాలిక పరిధిలో నాలుగేళ్ల క్రితం జాతీయ రహదారికి ఇరువైపులా లక్కారం నుంచి లింగోజిగూడెం వరకు కోనోకార్పస్ మొక్కలు నాటారు. పట్టణంలో ఉపరితల వంతెన నిర్మాణం కోసం మూడు నెలల క్రితం 1.80 కి.మీ. పొడవునా నాటిన మొక్కలను నరికివేశారు. చిన్నకొండూరు రోడ్డులో మల్లన్నగుడి నుంచి పెట్రోల్‌బంక్ వరకు ఇరువైపులా మొక్కలు మూడేళ్ల క్రితం నాటారు. వాటిలో సగమే బతికాయి. వలిగొండ రోడ్డుకు రెండేళ్ల క్రితం ఇరువైపులా నాటిన మొక్కల్లో సగం మాత్రమే ఉన్నాయి.ఆలేరు పురపాలికలో గతేడాది పట్టణ హరితహారంలో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రెండు వేల మొక్కలు నాటారు. నీరు అందించకపోవడం, సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో అనేక మొక్కలు ఎండిపోయాయి. యాదగిరిగుట్ట పురపాలికలోని వంగపల్లి, రాజాపేట, మల్లాపురం రోడ్ల వెంట రూ.5 లక్షలు ఖర్చుచేసి 50 వేల మొక్కలను రెండు పర్యాయాలు నాటారు. అధికారులు నిర్లక్ష్యం వహించడంతో 30 వేలకు పైగా మొక్కలు ఎండిపోయాయి. మోత్కూరు పురపాలిక పరిధిలోని భువనగిరి, తిరుమలగిరి, నార్కట్‌పల్లి, గుండాల రహదారులకు ఇరువైపులా 1,400 మొక్కలు నాటారు. రూ.1.70 లక్షలు ఖర్చుచేసి ఘట్‌కేసర్ నర్సరీ నుంచి మొక్కలు తెచ్చి నాటారు. మోత్కూరు నుంచి భువనగిరి రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలన్నీ తొలగించారు. గతేడాది మళ్లీ నాటారు. ప్రతీ ఏడాది జూన్ మాసంలో ఎండిన మొక్కల స్థానంలో మళ్లీ నాటుతున్నారే తప్ప వాటిని సంరక్షించే చర్యలు చేపట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ కె.సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా... వానలు ప్రారంభం కాగానే మళ్లీ మొక్కలు నాటించి సంరక్షణ చర్యలు చేపడతామన్నారు.

# అతివలకే ప్రాధాన్యం

సూర్యాపేట : మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా వారికి వానాకాలం, యాసంగికి సంబంధించి ధాన్యం కొనుగోళ్ల బాధ్యతలు కేటాయించింది. ఐకేపీ కొనుగోళ్లలో కీలకపాత్ర పోషిస్తూ రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. తద్వారా వారికి కమీషన్ పొందుతున్నారు. రైతులకు, రైస్ మిల్లర్లను సమన్వయం చేసుకుంటూ శభాష్ అనిపించుకుంటున్నారు. 2024–25 యాసంగి సీజన్‌లో 50 శాతం మేరకు వారికే కేటాయించారు. గతంలో 80–90 శాతం సహకార సంఘాల ఆధ్వర్యంలోనే నడవగా మిగతావి ఐకేపీ కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరిగేవి. కొద్ది సంవత్సరాలుగా మహిళలకే ఎక్కువ కేంద్రాలను కేటాయిస్తున్నారు.

**సమగ్ర శిక్షణ..ప్రణాళిక**

గ్రామ సమైఖ్య సంఘాల ద్వారా ముగ్గురు నుంచి ఆరుగురు సభ్యులు కలిసి ఒక్కో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కొనుగోళ్లను సమర్థంగా చేపట్టేందుకు ముందస్తుగా వీరికి శిక్షణ ఇచ్చారు. తొలుత సంఘాల సభ్యులు కమిటీ వేసుకుని ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యత అప్పగించారు. ఒకరు లారీలు చూసుకోవడం, మరొకరు ధాన్యం తూకం వేయడం, మరొకరు గన్నీ సంచులు లెక్కలు చూడటం, రైతుల వరుస క్రమం చూడటం వంటివి నిబద్ధతతో నిర్వహించారు. ఇది కాకుండా మహిళలు, రైతులు కలిసి మరో కమిటీ ఏర్పాటు చేసుకున్నారు.



కేంద్రాల్లో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులును ఈ కమిటీ తెలుసుకుని చర్యలు తీసుకునేవారు.

**సఫలీకృతులయ్యారు: – అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట**

ధాన్యం సేకరణలో మహిళలు ఈసారి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పూర్తిచేశారు. కొనుగోలు దగ్గరి నుంచి మిల్లులకు తరలించే వరకు ప్రణాళిక ప్రకారం నడచుకొన్నారు. కొనుగోళ్లలో జాప్యం లేకుండా, రైతుల వద్ద నుంచి ఎలాంటి ఫిర్యాదు లేకుండా సఫలీకృతులయ్యారు.

**అడ్డంకులను అధిగమించి కొనుగోలు: – ఉప్పుల పద్మ, మూడో సంఘబంధం అధ్యక్షురాలు, తుమ్మలపెన్‌పహాడ్**

కొనుగోలు ప్రారంభంలో అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. వరుసగా కురిసిన వర్షాలు, గన్నీసంచులు, లారీల కొరతతో ఇక్కట్లను ఎదుర్కొన్నాం. అయినా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లి 28వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగలిగాం. విక్రయించిన 560మంది రైతుల ఖాతాల్లో బిల్లులు జమయ్యాయి. తుమ్మలపెన్‌పహాడ్, బోట్యాతండా, దాచారం నుంచి రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు రానీయకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. హమాలీలు, అధికారులు, రైతులు చక్కగా సహకారం అందించారు.

# కొత్త కార్డుదారుల పరేషాన్!

మేళ్లచెరువు : గంపెడాశలతో కొత్త ఆహార భద్రత కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తొలి అనుభవంగా నిరాశే ఎదురైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ప్రజాపాలన పేరిట ఆరు గ్యారంటీలకు దరఖాస్తులను ఆహ్వానించిన విషయం విదితమే. ఇందులో మిగతా సంక్షేమ పథకాల కంటే.. కొత్త ఆహార భద్రత కార్డుల కోసమే అధిక దరఖాస్తులందాయి. నిన్నా మొన్నటి వరకు వాటి పరిశీలనే జరగలేదు. మళ్లీ మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో.. ఆయా కేంద్రాలను జనం సంప్రదించారు. ఆ దరఖాస్తులను జిల్లా పౌర సరఫరాల శాఖ వాటిని పరిశీలించింది. కొత్త కార్డులను మంజూరు చేసింది. ఈ సంతోషంతో.. కార్డుదారులు రేషన్ డీలర్ల వద్దకు పరుగులు తీయగా.. వీరందరికీ జూన్ నెల రేషన్ కోటా రాలేదని డీలర్లు చెప్పేశారు. ఇదే కాదు.. జులై, ఆగస్టు నెలల కోటా కూడా రాదని తేల్చి చెప్పేయడంతో.. చేసేదేమీ లేక వేల మంది కార్డుదారులు నిరాశతో ఇంటిదారి పట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

**నాడు అలా..:**

సుదీర్ఘకాలం తర్వాత 2018లో భారాస ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించింది. దరఖాస్తులు ఆహ్వానించింది. వాటిలో 2021 నాటికి కొందరికి మాత్రమే అధికార యంత్రాంగం ఆహార భద్రత కార్డులు పంపిణీ చేసి చేతులు దులుపుకొంది. అప్పటికి కుటుంబాల్లో చనిపోయిన వారి పేర్లను ఉన్న కార్డుల్లో తొలగించినప్పటికీ.. పెరిగిన సభ్యుల సంఖ్యను మాత్రం నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులు అందుకోలేని పరిస్థితి.

**నేడు ఇలా..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 లక్షల ఆహార భద్రత కార్డులు ఉండగా, 3,24,222 లక్షలు సూర్యాపేట జిల్లాకు సంబంధించినవే. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందు వరకు కూడా కుడి, ఎడమగా కార్డుల సంఖ్య ఇదే. ప్రజా పాలనలో భాగంగా కొత్త రేషన్ కార్డుల కోసం దాదాపు 90 వేల దరఖాస్తులు అందాయి. ఒక్క సూర్యాపేట జిల్లాలోనే.. తమ కుటుంబ సభ్యుల్లో కొందరి పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చాలని కోరుతూ దాదాపు 15 వేల దరఖాస్తులందాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే సరిపడా రేషన్ అందింది. కొత్త కార్డులు మంజూరైన వారికి రేషన్ అందలేదు. జూన్ నెలలోనే మూడు నెలలకు సరిపడా.. అంటే ఆగస్టు వరకు రేషన్ బియ్యం ఇచ్చేశారు. ఇప్పుడు కొత్త కార్డుదారులు రేషన్ బియ్యం అందుకోవాలంటే.. సెప్టెంబరు వరకు ఆగాల్సిందేనని రెవెన్యూ అధికారులు, డీలర్లు పేర్కొంటుండడం గమనార్హం.

**రెండు నెలలు ఆగాలన్నారు – ప్రవీణ్‌రెడ్డి**

గతంలో మా తల్లిదండ్రుల కార్డులో నా పేరుంది. ఆ కార్డులో నా పేరు తొలగించాక.. ఇప్పుడు నేను, నా భార్య, ఇద్దరు పిల్లల పేర్లతో కొత్త రేషన్ కార్డు మంజూరైంది. డీలరు దగ్గరకు బియ్యం కోసం వెళ్లా. రేషన్ కోటా మా కార్డు పేరుతో రాలేదన్నారు. జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన కోటా వివరాలను మే నెలలోనే పంపించారట. అందుకే సెప్టెంబరు వరకు ఆగాలన్నారు. కార్డు మంజూరైనా మూడు నెలల రేషన్ దక్కలేదు.

చురకలు



## ప్లాస్టిక్ నిషేధంపై తొలి అడుగు

కాకినాడ : జిల్లా పరిపాలనా కేంద్రం కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలని నిర్ణయించారు. ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లేట్లు, సంచులు వంటివి శనివారం నుంచి వినియోగించవద్దని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేశారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ వారం 'అంతం-ప్లాస్టిక్ కాలుష్యం' అనే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. దీనిలో భాగంగా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ నిషేధాన్ని శనివారం నుంచి అమల్లోకి తేనున్నారు. దీనిపై డీఆర్వో జె.వెంకటరావు శుక్రవారం విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ బాటిల్‌తో తాగునీరు వెంట తెచ్చుకుంటే ఆ ఉద్యోగికి ఆ రోజు సీఎల్‌గా పరిగణిస్తామని పేర్కొన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని మూడు క్యాంటీన్లలోనూ నిషేధం అమలు చేయనున్నారు. రీ-యూజ్ ప్లాస్టిక్ వస్తువులు మినహా, మిగతా ఏ ఇతర ప్లాస్టిక్ సామగ్రిని కలెక్టరేట్‌లో వినియోగించకూడదని ఆదేశాలు జారీ చేశారు.

**రూ.లక్షతో ఆర్వో ప్లాంటు**



కలెక్టరేట్‌లో 100 మంది ఉద్యోగులున్నారు. సెలవు రోజు మినహా మిగతా అన్ని రోజుల్లో కలెక్టర్, జేసీ, డీఆర్వో జిల్లాస్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ నెలకు సుమారు 7,500 వరకు ప్లాస్టిక్ నీటి సీసాలు వినియోగిస్తున్నారు. కార్యాలయ సిబ్బంది తాగునీటి అవసరాలకు నెలకు 200 ప్లాస్టిక్ బబుల్స్(20 లీటర్లవి) కొనుగోలు చేస్తున్నారు. వీటన్నింటికీ నెలకు రూ.25 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా వీటికి స్వస్తి పలకనున్నారు. రూ.లక్ష వ్యయంతో వెయ్యి లీటర్ల సామర్థ్యంతో ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు నిర్ణయించారు. స్టీల్ సీసాలను కొనుగోలు చేయనున్నారు. సమీక్షల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు వీటినే వినియోగిస్తారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలోనూ దీనిని అమలు చేస్తారు.

**ఆదర్శంగా నిలవాలని..** ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని ఎప్పటి నుంచో ప్రభుత్వాలు సూచిస్తు న్నా.. కార్యాచరణలోకి రావడం లేదు. ఈసారి కచ్చితంగా కలెక్టరేట్‌లో ప్రారంభించి, మిగతా శాఖలకు ఆదర్శంగా నిలవాలని భావిస్తున్నారు. కాకినాడ కేంద్రంగా పనిచేస్తున్న వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల కార్యాల యాల్లో దశలవారీగా దీనిని అమలు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ భావిస్తున్నారు.

## అన్నదాత గుండెకోత

రావులపాలెం : గోదావరికి వరద వచ్చిందంటే చాలు లంక రైతుల్లో ఆందోళన మొదలవుతోంది. భూమి కోతకు గురై నదిలో కలిసిపోతుండటంతో ఏం చేయలేని పరిస్థితుల్లో కూలీలుగా మారాల్సి వస్తోంది. ఆయా ప్రాంతాల్లో గ్రోయిన్‌లు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

కొత్తపేట నియోజకవర్గంలో గౌతమి, వశిష్ట గోదావరి పాయలకు ఇరువైపులా ఉన్న లంక భూములు గల్లంతవుతున్నాయి. ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, మండలాలు ఈ పాయల మధ్యలో ఉంటాయి. ఆలమూరు మండలం గౌతమి గోదావరిని ఆనుకుని ఉంటుంది. బొబ్బర్లంక మొదలుకొని రావులపాలెం, కొమరాజులంక మీదుగా కొత్తపేట వరకు.. అటు అంకంపాలెం, ర్యాలీ, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, గోపాలపురం వరకూ ఉన్న లంక భూములు నదిలో కలిసిపో



తున్నాయి. రూ.లక్షలు విలువచేసే భూములను తమ పాస్ పుస్తకాల్లో చూసుకుంటున్నామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించినా..**

గోపాలపురంలో 450, ర్యాలి-లక్ష్మీపోలవరం ప్రాంతాల్లో 160, పులిదిండి పరిసర ప్రాంతాల్లో 90, బడుగువానిలంక సమీపంలో 100, కొమరాజులంకలో 95 ఎకరాల చొప్పున కోతకు గురైనట్లు గతంలో అధికారులు గుర్తించారు. రెండేళ్ల క్రితమే బొబ్బర్లంక, కొమరాజులంక, గోపాలపురం, పులిదిండి ప్రాంతాల్లో గ్రోయిన్స్ నిర్మించాలని హెడ్‌వర్క్స్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కొత్తగా మళ్లీ నియోజకవర్గంలో గ్రోయిన్, రివిట్‌మెంట్ నిర్మాణాలకు రూ.160 కోట్లు అవసరమని ప్రణాళిక వేశారు. 'గోదావరి వరద నేపథ్యంలో లంక భూములు కోతకు గురవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఏయే చర్యలు తీసుకోవాలో, ఎక్కడెక్కడ నిర్మాణాలు చేపట్టాలో పరిశీలించి ఉన్నతాధికారులకు పంపిస్తాము'. హెడ్‌వర్క్స్ ఏఈ ప్రసాద్ తెలిపారు.

## కాలువలు బాగుంటేనే చెరువులకు జలకళ

పుట్టపర్తి : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 17న మల్యాల వద్ద ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీనీవాకు నీటిని విడుదల చేశారు. నీటిపారుదల సాఫీగా సాగాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మల్యాల నుంచి జీడిపల్లి జలాశయం వరకు హంద్రీనీవా ప్రధాన కాలువ కాంక్రీట్ లైనింగ్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టింది. చాలావరకు పనులు పూర్తయ్యాయి. శ్రీశైలం నుంచి చిత్తూరు వరకు నీటిని తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదట జిల్లాలోని జలాశయాలను.. ఆపై చెరువులను నింపేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. **అదే నిర్లక్ష్యం పునరావృతం కాకుండా..**

ఉమ్మడి అనంత జిల్లావ్యాప్తంగా హంద్రీనీవా, హెచ్చెల్సీ ద్వారా వందలాది చెరువులకు నీరందనుంది. గత ప్రభుత్వంలో హంద్రీనీవా నీటిని తూతూమంత్రంగా చెరువులకు అందించినప్పటికీ ఆయకట్టుకు అందిన దాఖలాల్లేవు.. దీంతో చెరువుల ఆయకట్టు కాలువలు పిచ్చిమొక్కలతో నిండి, పలుచోట్ల పూడిక పేరుకుపోయింది. జగన్ సర్కారు కనీసం చెరువుకట్టలు, కాలువలకు మరమ్మతులు చేయించిన పాపానపోలేదు. ఆరేళ్లుగా నిర్వహణకు నోచుకోని కాలువలు రూపు కోల్పోయాయి. అదే నిర్లక్ష్యం పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వివాదాలు రానీయకుండా..

శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 1,186 చెరువులు ఉన్నాయి. వీటి కింద 83,485 ఎకరాల ఆయకట్టు ఉంది.

# కాలుష్య కోరల్లో కాలువ గట్లు



కడియం : అంతర్జాతీయంగా పేరొందిన ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ సమీపంలోని తూర్పు డెల్టా కాలువ గట్టు మీద పంచాయతీ సిబ్బంది యథేచ్ఛగా వ్యర్థాలు వేస్తున్నారు. అవన్నీ గోదావరిలో కలిసి కలుషితం అవుతోంది. మేజర్ పంచాయతీగా పేరొందిన ధవళేశ్వరంలో వ్యర్థాల తరలింపు ఓ ప్రహసనంగా మారింది. ఇక్కడ డంపింగ్ యార్డు సమస్య ఉండటంతో బొమ్మూరు జాతీయ రహదారి చెంతనున్న డంపింగ్ యార్డుకు తరలించేవారు. గత కలెక్టరు ఆదేశాలతో ఇక్కడకు తరలించడం ఆపేశారు. అప్పటి నుంచి సేకరించిన వ్యర్థాలన్నీ గోదావరి కాలువ గట్లపై డంపింగ్ చేస్తున్నారు. ఆపై వాటిని జేసీబీలతో నదిలోకి తోసేయడం పరిపాటిగా మారింది.

**ఫిర్యాదులు చేసినా..**

కొన్ని సందర్భాల్లో కాటన్ బ్యారేజీ దిగువన వ్యర్థాలను కుప్పలుగా పోసి నిప్పు పెడుతున్నారు. దీంతో అటుగా ప్రయాణించే వాహన చోదకులు, సమీపంలోని పాఠశాల విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవట్లేదనే విమర్శలు ఉన్నాయి. బ్యారేజీ నుంచి అదనపు జలాలను విడుదల చేసే సమయంలోనూ ఈ వ్యర్థాలు పెద్దఎత్తున నదిలో కలుస్తున్నాయి. అవి మత్స్యసంపదపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులస లభ్యత తగ్గుతోందని వాపోతున్నారు. నదుల పర్యవేక్షణకు నదీ కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఇంత జరుగుతున్నా ఎలాంటి చర్యలు ఉండట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం అప్రమత్తమై పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**నివేదికలు సిద్ధం చేస్తున్నాం..** – జి.శ్రీనివాస్, డీఈ గోదావరి హెడ్‌వర్క్స్, ధవళేశ్వరం కాలువ గట్లపైకి చెత్త తరలించొద్దని ధవళేశ్వరం పంచాయతీ అధికారులకు పలుసార్లు నోటీసులు ఇచ్చాం. నగరపాలక సంస్థతో ముడిపడిన అంశం కావడంతో జాప్యమవుతోంది. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నదీ కాలుష్య నియంత్రణకు ప్రాధాన్యం ఇస్తాం. ధవళేశ్వరం నుంచి వేమగిరి, కడియం వరకు కాలువ గట్ల నిర్వహణ, సుందరీకరణకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. వాటికి అవసరమైన ప్రణాళికలు తయారు చేస్తున్నాం. ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధి అంశం పరిశీలనలో ఉంది.

# కడలి కోతకు చికిత్స!



కాకినాడ: కాకినాడ జిల్లాలో ఉప్పాడ తీరం కోత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ తీర రక్షణపై చేస్తున్న ప్రకటనలు స్థానికుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. రూ.323 కోట్ల వ్యయంతో రక్షణగోడ నిర్మాణానికి కేంద్రం సానుకూలంగా ఉందని ఇటీవల ఎంపీ వెల్లడించారు. ఈనెల 30న దిల్లీలో కేంద్ర హోంశాఖ కార్యదర్శితో జరిగే సమావేశంలో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, ఇతర ఉన్నతాధికారులతో కూడిన సబ్ కమిటీ పాల్గొననుంది. తద్వారా మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**సాగరంలో కలిసిపోతూ..**

కాకినాడ సాగర తీరంలో కెరటాల ధాటికి సుబ్బంపేట నుంచి ఉప్పాడ మీదుగా కోనపాపపేట వరకు మత్స్యకార గ్రామాలు మాయమవుతున్నాయి. ఇప్పటికే వందల సంఖ్యలో ఇళ్లు, ఆలయాలు, ఆస్తులు కడలిలో కలిసిపోయాయి. ఉప్పాడ కొత్తపల్లి రోడ్డు కోతకు గురవుతోంది. వీటి రక్షణకు గతంలో నిర్మించిన జియోట్యూబ్ చెల్లాచెదురైపోయింది. కొన్నేళ్లుగా సమస్య మరింత తీవ్రం కావడంతో స్థానికులంతా నేతలకు విన్నవిస్తూ వస్తున్నారు. వైకాపా హయాంలో కేంద్ర బృందం వచ్చి పరిశీలించినా పరిష్కారానికి అప్పటి నేతలు చొరవ చూపలేకపోయారు. పిఠాపురం నుంచి ఎన్నికైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉప్పాడ తీర రక్షణపై ప్రత్యేక దృష్టిసారించారు. శాశ్వత పరిష్కారం కోసం నిపుణులతో మాట్లాడి రక్షణ గోడ నిర్మాణానికి రూ.323 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. కేంద్రం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకువెళ్తూ ఈ భారీ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు కృషిచేస్తున్నారు.

**ప్రతిపాదనలు పరిశీలించి..** దేశవ్యాప్తంగా తీర ప్రాంతాల్లో కోత నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. పరిశీలించిన కేంద్రం విశాఖపట్నం, కాకినాడ జిల్లాల డీపీఆర్‌లను తుది దశ సమీక్షకు తీసుకున్నట్లు సమాచారం. ఉప్పాడ తీర ప్రాంతం ఎక్కువ కోతకు గురవడం, ఇళ్లు నేలమట్టమవ్వడంతో కాకినాడ జిల్లా అధికారులు ప్రతిపాదించిన డీపీఆర్ ఆమోదానికి ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల భాజపా రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన మాధవ్ కూడా ఈ ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. సుబ్బంపేట నుంచి కోనపాపపేట వరకు సుమారు 15 కి.మీ మేర రక్షణ గోడ నిర్మించి మత్స్యకార గ్రామాలకు ముంపు ముప్పు నుంచి పరిష్కారం చూపనున్నారు.

# సాగు తరుణం.. కానరాని జలం



కాకినాడ : ఓవైపు జలాశయాలన్నీ అరకొర నీటితో ఉన్నాయి. వర్షాలు తగినంతగా కురవడం లేదు. ఏలేరు నుంచి తాండవ వరకు వరుణుడి వైపే చూస్తున్నాయి. ఈ దఫా ఖరీఫ్ పరిస్థితి ఏమిటో తెలియక మెట్ట రైతులు ఆందోళన చెందుతున్నారు. బోర్లు, ఇతర నీటి వనరులున్న చోట నారు, ఊడ్పులు అక్కడక్కడ జరుగుతున్నా అధికశాతం విస్తీర్ణం ప్రాజెక్టులపైనే ఆధారపడ్డాయి. ప్రత్తిపాడు మండలంలో 10వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ఇ.గోకవరం సమీప మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్‌లో నీటిమట్టం 79 మీటర్లుగా ఉంది. పూర్తిస్థాయి మట్టం 87 మీటర్లు కాగా ఏజెన్సీ, ఉపప్రణాళిక మన్యంలోని 40 చదరపు మైళ్ల విస్తీర్ణంలో కురిసిన వర్షం ఈ ప్రాజెక్టుకు చేరాలి. జులైలో గట్టిగా సెం.మీ. కూడా కురవలేదు. ఆగస్టు మొదటి వారంలో ఊడ్పులకు సుబ్బారెడ్డిసాగర్ జలాలు విడుదల చేయాల్సి ఉన్నా ఆ పరిస్థితి కనిపించడం లేదు.

**వాన రాకడ ఇంతే..!**

కాకినాడ జిల్లాలో జులై 1 నుంచి 16వ తేదీ వరకు 92.54 మి.మీ. వర్షం కురవాలి. కేవలం 40.46 మి.మీ. కురిసింది. జూన్ 1 నుంచి జులై 16 వరకు వర్షం కురిసిన రోజులు 14 మాత్రమే..! మేలో 109.77కు 115.48 మి.మీ వాన పడగా వేసవి ఉపశమనానికే ఉపయోగపడింది.

**పంపా దిగువన ఖాళీగా..**

అన్నవరంలోని పంపా రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. తొండంగి మండలంలోని 12,005 ఎకరాలకు పంపా నుంచే సాగునీరు అందుతుంది. గరిష్ఠ నీటిమట్టం 105 అడుగులు కాగా ఈ ఏడాది కేవలం 91.5 అడుగులే ఉంది. ఇది ఎటూచాలని పరిస్థితి. కనీసం 101 అడుగులకు చేరి నీటిని విడుదల చేస్తే రైతులకు ప్రయోజనం. దీంతో ఆయకట్టు పరిధిలో కేవలం బోర్ల కింద మాత్రమే తక్కువగా వరినాట్లు వేశారు. **ఏలేరులోనూ అంతంతమాత్రమే..!** రుతుపవనాలు కరుణించక ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. ప్రాజెక్ట్‌పై ఆధారపడి మెట్టలో 53 వేల ఎకరాల సాగు జరగాలి. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 86.56 మీటర్లు (24.11 టీఎంసీలు). ప్రాజెక్టులో కేవలం 10.60 టీఎంసీల జలాలు మాత్రమే ఉన్నాయి. ఈ నిల్వల్లో 6 టీఎంసీలను కనిష్ఠ స్థాయిగా ఉంచాలి. నాలుగు టీఎంసీలనే సాగుకు, విశాఖ పారిశ్రామిక అవసరాలకు, తాగునీటికి వినియోగించుకోవాలి. ఏలేరు నుంచి సాగుకు 1400 క్యూసెక్కులు, విశాఖకు 150 క్యూసెక్కుల వంతున సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత నిల్వలను సాగుకే కేటాయించాలని మెట్ట రైతులు కోరుతున్నారు.

## నష్టపోతే 'కౌలు'కునేదెలా..

శ్రీకాకుళం : కౌలు రైతులు పండించిన ఉత్పత్తులు ఈ-పంటలో నమోదు చేసుకోవాలన్నా.. విపత్తుల కారణంగా నష్టపోతే సాయం పొందాలన్నా.. ప్రభుత్వ లబ్ధి పొందడానికి సీసీఆర్సీ కార్డులు తప్పనిసరి. ఖరీఫ్ ప్రారంభమైనా వీటి మంజూరు నామమాత్రంగా సాగుతోంది. కౌలు గుర్తింపు కార్డులు వస్తే పంట సాగుకు అవసరమైన పెట్టుబడి రుణం పొందొచ్చని ఆశగా ఎదురుచూస్తున్నారు. రైతులకు అవగాహన లేకపోవడం.. వ్యవసాయ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో లక్ష్యం మేరకు ప్రక్రియ సాగడం లేదు.

జిల్లాలో కౌలు కార్డుల లక్ష్యం 9,800 కాగా ఇప్పటివరకు 6,402 మందికి జారీ చేశారు. ఈ-పంట నమోదు ప్రక్రియ త్వరలో మొదలవుతుంది. కౌలు రైతుల వద్ద సీసీఆర్సీ కార్డులు లేకపోతే వారి పేర్లు నమోదు కావు. పంట రుణాలు పొందలేరు. విపత్తుల సమయంలో పంట నష్టపోతే పరిహారమూ రాదు. ఇటీవల గ్రామ సచివాలయ, సాధారణ ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో కార్డుల అందజేత ప్రక్రియ



ఆలస్యమైందని సమాచారం. ఇప్పటికైనా అధికారులు కౌలు రైతులను గుర్తించి సకాలంలో వారు ప్రయోజనాలు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆయా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

**ప్రయోజనాలివీ..:** సీసీఆర్సీ కార్డు పొందిన రైతు వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై విత్తనాలు, ఎరువులు తీసుకోవచ్చు. బ్యాంకులు, పీఏసీఎస్‌ల నుంచి రుణాలు పొందొచ్చు. అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధి చేకూరుతుంది. ఈ కార్డుల కోసం సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలి. కౌలు రైతుకు కార్డు ఉంటే భూ యజమానితో పాటు సమానంగా పథకాలు వర్తిస్తాయి. ఈ-పంటలో వివరాల నమోదుకు ఇది తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు.

**అర్హులందరికీ అందజేస్తాం..**

సీసీఆర్సీ కార్డుల అందజేత ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. చాలా మంది రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకున్నారు. వారికి ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నాం. ఈ నెలాఖరుకు అర్హులందరికీ కార్డులు అందజేస్తాం. – కె.త్రినాథస్వామి, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం

## ప్రణాళికా లోపం.. విద్యార్థులకు శాపం..!

ఎచ్చెర్ల : శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులు అసౌకర్యాలతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆర్జీయూకేటీ అధికారుల ముందస్తు ప్రణాళికా లోపాలు వారిపాలిట శాపంగా మారుతున్నాయి. తరగతులు ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా అరకొర సౌకర్యాలతో కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. తాజాగా బ్యాచ్‌లు సర్దుబాటు నిర్ణయాలు కొత్త చిక్కులు తీసుకొచ్చింది..

ఎచ్చెర్ల మండలం షేర్‌మహ్మద్‌పురంలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఉంది. ఇప్పటివరకు పీయూసీ-1, 2తో పాటు ఇంజినీరింగ్-1, 2 బ్యాచ్‌లకు ఎస్.ఎం.పురం, శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో తరగతులు నిర్వహించేవారు. ఈసారి వర్సిటీ అధికారులు ఇక్కడున్న పీయూసీ-1ను నూజివీడుకు, అక్కడున్న ఇంజినీరింగ్-3, 4 బ్యాచ్‌లను శ్రీకాకుళానికి తరలించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇదెలా ఉన్నా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు, సమస్యలు, వసతులను పరిగణనలోకి తీసుకోలేదు. స్థానిక అధికారుల అభిప్రాయాలు దృష్టిలోకి తీసుకోకపోవడంతో కొత్తగా వచ్చిన విద్యార్థులకు అవస్థలు తప్పలేదు.

**పనులు ముందుకు సాగక..**

ప్రాంగణంలో రూ.62 కోట్లతో మూడువేల మందికి తరగతుల నిర్వహణకు సరిపడా అకడమిక్ భవన నిర్మాణ పనులు నాలుగేళ్ల కిందట ప్రారంభయ్యాయి. నేటికీ 30 శాతం కూడా పనులు




పూర్తికాలేదు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా, అందుకు తగినట్లుగా తాగునీరు సౌకర్యం మెరుగుపరచలేదు. వాడుక నీరు శుద్ధి చేసి బయటకు విడిచిపెట్టే ప్లాంట్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

**వసతిగృహాల్లో కానరాని సౌకర్యాలు..**

శివానీ ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో 1,100 మంది విద్యార్థులకు వసతి కల్పించే సామర్థ్యంతో తరగతుల నిర్వహణకు గతంలో అద్దెకు తీసుకున్నారు. కానీ ప్రస్తుతం అక్కడ 500-600 మందికే వసతి కల్పించి తరగతులు నిర్వహిస్తున్నారు. వీరికి సరిపడా పడకలున్నాయి. తాజా నిర్ణయాలతో 1,100 మందికి వసతి కల్పించాల్సి ఉంది. ఇందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయలేదు. 500 మందికి పరుపులు, మంచాలు లేవు. ఎస్.ఎం.పురం క్యాంపస్‌లో గతం కంటే మరో 700 మంది వరకూ విద్యార్థులు పెరగటంతో వారికి సైతం మంచాల కొరత ఏర్పడింది. ముగ్గురు మాత్రమే ఉండాల్సిన గదుల్లో ఏడెనిమిది మంది వరకు ఉంచుతున్నారు.

**సమస్యలు పరిష్కరిస్తాం..**

ఏ బ్యాచ్‌లు ఎక్కడ నిర్వహించాలనేది వర్సిటీ అధికారుల నిర్ణయం. అందుకనుగుణంగా విద్యార్థులకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకొంటున్నాం. మంచాలు, బెడ్‌లు కొంతమందికి లేకపోవటం వాస్తవమే. ఒంగోలు నుంచి తీసుకొచ్చే చర్యలు తీసుకొంటున్నాం. 600 పడకల కొనుగోలుకు టెండర్లు వేశాం. త్వరలో సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. – కె.వి.జి.డి.బాలాజీ, డైరెక్టర్, శ్రీకాకుళం ప్రాంగణం

# దశాబ్దాలుగా అదే వరస

చీమకుర్తి : ఇటీవల రూపుదిద్దుకున్న ఎన్నో రహదారులకు జాతీయ హోదా దక్కినా..ఒంగోలు – కర్నూలు రహదారికి ఆ మహా భాగ్యం దరిచేరడం లేదు. ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నా నేటికీ ఎలాంటి ఫలితం లేదు. దీంతో ఈ ఛిద్ర రహదారిపై అష్టకష్టాలు పడుతూ జిల్లావాసుల ప్రయాణం సాగుతోంది. ఒంగోలు – కర్నూలు రోడ్డుకు జాతీయ హోదా అన్నది దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. పశ్చిమ ప్రకాశంలో పలు రోడ్లు జాతీయ రహదారులుగా మారుతూ నాలుగు వరసలుగా విరాజిల్లుతుంటే ఎంతో ప్రాముఖ్యమున్న ఈ రోడ్డును మాత్రం ఆ జాబితాలో చేర్చడం లేదు. ఒంగోలు నుంచి బేస్తవారిపేట కూడలి వరకు ఉన్న 107 కిలోమీటర్ల రోడ్డుకు జాతీయ హోదా ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. అయితే ఒంగోలు – చీమకుర్తి మధ్య 21 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలంటే కారులో సైతం నలభై నిమిషాలు



పడుతుందంటే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఎందరో ప్రాతినిథ్యం..:** ఒంగోలు నుంచి చీమకుర్తి మండలం వరకూ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. అక్కడి నుంచి బేస్తవారిపేట కూడలి వరకు ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉంది. ఇద్దరు ఎంపీలు ప్రాతినిథ్యం వహిస్తున్నా జాతీయ హోదా మాత్రం నేటికీ కలగానే మిగిలింది. అదేవిధంగా సంతనూతలపాడు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు శాసనసభ్యులు సైతం నిత్యం ఆపసోపాలు పడుతూ జిల్లాకేంద్రానికి వస్తుంటారు. వీరేకాక ఒంగోలు నుంచి రాయలసీమ, పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు రాష్ట్ర రహదారులు జాతీయ రహదారులుగా మారి సర్వాంగ సుందరంగా తయారవుతున్నాయి. ఒంగోలు – పొదిలి మధ్య శిథిల రహదారిలో ప్రయాణిస్తూ ఏడాదికి కనీసం 25 మంది వరకూ మృత్యువాత పడుతున్నారు. ఇక క్షతగాత్రుల సంఖ్యకు అంతే లెక్కలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు హోదా కల్పించడంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆశల అలలు తీరం చేరేనా!

జిల్లా అభివృద్ధిలో మరో మణిహారం చేరనుంది.. తూర్పు తీరంలో పూసపాటిరేగ మండలం చింతపల్లి వద్ద మరో గొప్ప మత్స్య ఓడరేవు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్న మత్స్యకారులకు ఉపాధి దక్కనుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖ తరహాలో పూర్తిస్థాయి 'ఫిషింగ్ హార్బర్' ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో కొత్త ఆశలు చిగురించాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో వేలాది మంది మత్స్యకారులు చేపల వేటతో జీవనం సాగిస్తున్నారు. వేటకు వెళ్లే వీరంతా తమ బోట్లను తీరానికి చేర్చాలన్నా, చేపలను నిల్వ చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నా ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు కొన్నాళ్లుగా ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చింతపల్లి వద్ద ఆరు ఎకరాల్లో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపినా.. అయిదేళ్లు నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో మత్స్యకారులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మత్స్య ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తరలిస్తూ వృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ఫిషింగ్ హార్బర్ ప్రణాళికను తెరపైకి తెచ్చింది. దీని ఏర్పాటుకు తీర ప్రాంతంలో 22 ఎకరాల స్థల సేకరణకు యోచిస్తున్నారు. సెంట్రల్ కోస్టల్ అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు.



జిల్లాలో వేటాడిన మత్స్య సంపద వాహనాలతో విశాఖ హార్బర్‌కు తరలించి విక్రయిస్తున్నారు. దీంతో రవాణా ఖర్చు, సమయం వృథా అవుతున్నాయి. హార్బర్ ఏర్పాటైతే మత్స్యకారులు హార్బర్‌లోనే చేపలు విక్రయించవచ్చు. ఇతర రాష్ట్రాలకూ తరలించొచ్చు. మరోవైపు పర్యాటకంగానూ జిల్లా అభివృద్ధి చెందుతుంది. బహుముఖ లాభదాయక మత్స్య కేంద్రంగా నిలుస్తుందని ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

**ఇదీ పరిస్థితి...**

సముద్ర తీరం : 29 కి.మీ
పంచాయతీలు : 16
మత్స్యకార జనాభా : 27వేలు
వేటపై ఆధారపడిన
కుటుంబాలు : 6 వేలు
జిల్లాలో మోటరైజ్డ్ బోట్లు: 714
చింతపల్లిలో మోటరైజ్డ్: 487
సంప్రదాయ వేట పడవలు: 361

ఇవీ ప్రయోజనాలు..

రోడ్ల వసతులు మెరుగవుతాయి
కోల్డ్ స్టోరేజీలతో వ్యర్థాలు తగ్గుతాయి.
మత్స్య ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వస్తుంది.
ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది.
పరిశ్రమలు ఏర్పాటవుతాయి.
పర్యాటక రంగానికి ఊతం వస్తుంది.
అభివృద్ధి హబ్‌గా మారుతుంది.
అనుమతులు రాగానే ప్రారంభిస్తాం..

–శ్రీనివాసరావు, ఎఫ్‌డీవో మత్స్యశాఖ

–తీరంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు వర్షువలిగా ప్రారంభమైనా గత ప్రభుత్వం పూర్తిచేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకు 22 ఎకరాలు అవసరం. ఇటీవల సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ కోస్టల్ ఇంజినీరింగ్ ఆఫ్ ఫిషరీస్ అధికారులు ఈ ప్రాంతంలో స్థలాన్ని పరిశీలించి నివేదికను పంపించారు. అనుమతులు రాగానే స్థల సేకరణ పనులు చేపడతాం.

# అధికారం అండ.. ప్రతిపక్షం దందా



సింగరాయకొండ : వైకాపా నాయకులు స్థానిక అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకుని అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి, పొన్నలూరు మండలాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఆయా తహసీల్దారు కార్యాలయాల్లో కొందరు అధికారుల అండదండలతోనే అక్రమార్కులు ఈ తతంగాన్ని నడుపుతున్నారు. గతంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి వెంచర్లుగా మారుస్తున్నారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చకుండానే అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేశారు. అక్రమ వెంచర్లు మళ్లీ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. చాలా వాటికి అనుమతులు కూడా లేకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సైతం సమకూరడం లేదు. పనిలో పనిగా వెంచర్ల పక్కనున్న ప్రభుత్వ భూములను కలిపేసుకుంటున్నా యంత్రాంగం మొద్దునిద్ర నటిస్తోంది.

**భారీగా ధరలు పెంచేసి..**

రూ.వేలల్లో ఉన్న స్థలాల విలువ రూ.లక్షల్లోకి మారుతోంది. కనుమళ్ల, శానంపూడి, మూలగుంటపాడు, సోమరాజుపల్లి, సింగరాయకొండ గ్రామాల పరిధిలో అధికారులు సుమారు 30 అనుమతులు లేని వెంచర్లు గుర్తించారు. ఎకరాకు అనుమతి తీసుకుని అయిదెకరాల వరకు వెంచర్లు వేసినవి మరో 30 నుంచి 40 వరకు ఉన్నాయి. మండలంలోని శానంపూడి గ్రామ పరిధిలోని ప్రధాన రహదారి వెంబడి సర్వే నంబరు 438లో పదెకరాల స్థలంలో నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణానికి చెందిన వైకాపా నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా మూడు వెంచర్లు ఏర్పాటు చేశారు. కనుమళ్ల, సోమరాజుపల్లి, మూలగుంటపాడు గ్రామాల పరిధిలో సుమారు 50 ఎకరాల్లో వెంచర్లతో పాటు గృహ నిర్మాణాలు సాగుతున్నాయి. అక్కడ సెంటు స్థలాన్ని రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయిస్తున్నారు.

**ఆక్రమణలో అసైన్డ్ భూములు..** సింగరాయకొండలోని బాలయోగినగర్ సమీపంలో గతంలో పేదలకిచ్చిన అసైన్డ్ భూములను కొందరు తక్కువకు కొనుగోలు చేసి వెంచర్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. పైగా విద్యుత్తు, ఇతర శాఖల అధికారులు తమవంతు సాయం చేస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై సింగరాయకొండ ఇన్‌ఛార్జి తహసీల్దార్ పుల్లారావును వివరణ కోరగా..పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా వేసిన వెంచర్లలో హద్దు రాళ్లను తొలగిస్తామన్నారు. అక్రమార్కులకు నోటీసులు అందజేసి క్రిమినల్ చర్యలు సైతం చేపడతామన్నారు.

# అంతిమ కష్టాలు ఇక అంతం!



ఒంగోలు: ఆప్తులను పోగొట్టుకుని దుఃఖంలో ఉంటే వారి అంతిమ సంస్కారాలు ఎలా నిర్వహించాలనే దానిపై కష్టాలు పడాల్సి రావడం ఆవేదన కలిగిస్తోంది. మరుభూమిలో శవాలు పెట్టేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. జిల్లాలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ కష్టాలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం శ్మశానవాటికల్లో సమస్య పరిష్కారం దిశగా అడుగులేస్తోంది. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల్లో శ్మశానవాటికలు ఆక్రమణలో చిక్కుకోవడం, స్థానికంగా పంచాయతీలు పట్టించుకోకపోవడంతో కంప చెట్లు మొలిచి సమస్యగా మారాయి. కొన్నిచోట్ల కనీసం వెళ్లేందుకు దారి లేక పొలాల నుంచి కాలువ గట్ల వెంబడి వెళ్లాల్సి వస్తోంది. పట్టణాల్లోని పలుచోట్ల సమాధులతో నిండిపోయి జాగా లేకుండా పోయింది. సమస్యను గుర్తించిన ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికార యంత్రాంగం కదిలింది. ప్రస్తుతం శ్మశానవాటికల స్థలాలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి..? ఆక్రమణలో చిక్కుకున్నవి ఎన్ని..? తదితర వాటిపై ఆరా తీస్తున్నారు. ఎక్కడైనా స్థలం అందుబాటులో లేకపోతే సేకరించాలని ఆదేశాలుండడంతో ఆ దిశగా రెవెన్యూశాఖ అధికార యంత్రాంగం అన్వేషిస్తోంది. ఏయే గ్రామాల్లో ఎంతెంత స్థలం అవసరమనేది తహసీల్దార్లు లెక్కలు కట్టే పనిలో ఉన్నారు.

**దాతల సహకారం:** గ్రామాల్లో దాతల సహకారంతో పలుచోట్ల శ్మశానవాటికలు రూపురేఖలు మారాయి. గ్రామస్థుల నుంచి విరాళాలు సేకరించి అక్కడ సౌకర్యాలు కల్పిస్తున్నారు. కొన్నిచోట్ల దాతలు ముందుకొచ్చినా స్థలాలు ఆక్రమణలో చిక్కుకోవడంతో ముందడుగు పడడం లేదు. రెవెన్యూశాఖ అధికార యంత్రాంగం ఆక్రమణల సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తే కొంత వరకు సమస్య పరిష్కారమవుతుంది.

**ఆదేశాలిచ్చాం:** శ్మశానవాటికల్లో సమస్యలు పరిష్కరించే విషయమై ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. సమస్య పరిష్కారానికి రెవెన్యూశాఖ అధికార యంత్రాంగం చర్యలు చేపట్టనుంది. జిల్లాలో ప్రాంతాల వారీగా ఎక్కడెక్కడ స్థలాలు సేకరించాలనే విషయమై ఇప్పటికే తహసీల్దార్లకు ఆదేశాలు జారీచేశాం. అవసరమైనచోట ప్రైవేటుగా భూములను సేకరిస్తాం.

గోపాలకృష్ణ, జేసీ

# రభశా.. కబ్జాల రభస!

ఒంగోలు: ఒంగోలు నగర నడిబొడ్డునున్న ప్రభుత్వ స్థలాలు పరాధీనమవుతున్నాయి. వీటిని పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం చోద్యం చూస్తుండడంతో ఆక్రమణలకు అడ్డే లేకుండా పోతోంది. రూ.కోట్ల విలువైన భూముల్లో ఇళ్లు నిర్మించి వాటిని అద్దెలకిచ్చి కాసులు దండుకుంటున్నారు. నగరంలోని రహదారులు, భవనాలశాఖ (రభశా) ఆధ్వర్యంలో సీఆర్సీ నివాస సముదాయాల స్థలాలను ఒకరిని చూసి మరొకరు ఆక్రమించేస్తున్నారు. కొంత కాలానికి ఇక్కడ ప్రభుత్వ స్థలమనేది లేకుండా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ ఉద్యోగులకు ఆవాసం కల్పించేందుకు సీఆర్సీ నివాసాలను టైప్–ఎ, బి, సి, డి నాలుగు రకాలుగా నిర్మించారు. నాలుగు దశాబ్దాల కిందట నిర్మించడం, నిర్వహణ లేకపోవడంతో చాలా నివాసాలు నివాస యోగ్యంగా మారగా, మరికొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. ప్రస్తుతమున్న వాటిలో కూడా ఎవరు నివాసం ఉంటున్నారో తెలియని పరిస్థితి. ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు నివాసం ఉంటున్నట్లు సమాచారం. ఇక్కడ నివాస సముదాయాలకు ఆనుకుని ఉన్న స్థలాలను ఒక్కొక్కటిగా ఆక్రమించేసి భారీ భవంతులను నిర్మించేశారు. కొందరు ఏకంగా నాలుగంతస్థుల భవనాలు నిర్మించారంటే ఏ స్థాయిలో ఇక్కడ ఆక్రమణ లున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రాంతంపై అవగాహన ఉన్న ఉద్యోగులు కన్నేసి కబ్జా చేస్తున్నారు. పోలీసుశాఖలో ఏ.ఎస్.ఐ.గా పనిచేస్తున్న ఒకరు ఏకంగా భారీ భవంతిని నిర్మించి అద్దెకు ఇచ్చారు. ఉద్యోగ సంఘంలో పట్టున్న కొంతమంది నేతలు, స్థానిక రాజకీయ నేతలు స్థలాలు స్వాహా చేయడంలో ముందున్నారు. తాజాగా రహదారిని ఆనుకుని ఉన్న రూ.కోట్ల విలువైన 100 గదుల స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఏకంగా యంత్రాలతో చదును పనులు చేపట్టినా అధికారులు కనీసం కన్నెత్తి చూడటంలేదు. శిథిలమైన నివాసాల పక్కనే ఉన్న స్థలాన్ని బాహాటంగా ఆక్రమించేస్తున్నా చర్యలు



తీసుకోని అధికారుల తీరుపై స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలుత నివాసాల చుట్టూ ఉన్న స్థలాన్ని చదును చేసి క్రమేపీ కబ్జా చేసేస్తున్నారని వారంతా ఆరోపిస్తున్నారు.

**పొంచి ఉన్న ప్రమాదం**

నివాసాలను ఆనుకుని ఉన్న కొండను సైతం తొలిచేసి భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. తొలుత తాత్కాలికంగా రేకుల షెడ్లు వేస్తున్నారు. కొంతకాలం తరువాత కాంక్రీటు నిర్మాణాలు చేపడుతున్నారు. కొండను ఛిద్రం చేసి అంతకంతకూ పైపైకి నిర్మాణాలు చేపడుతున్నారు. కొండను తొలచడంతో వర్షాలకు బండరాళ్లు కదిలి దిగువకు జారిపోయే ప్రమాదం పొంచి ఉంది. కొండ నుంచి మట్టి పెళ్లలు విరిగిపడినా, బండరాళ్లు జారి పడినా దిగువన పెద్దసంఖ్యలో నివాసం ఉంటున్న సామాన్యుల ప్రాణాలకు ముప్పు తప్పదు. అధికార యంత్రాంగం ముందుగానే మేల్కొనాల్సిన అవసరం ఉంది. ఆక్రమణలు తొలగించాలని ఇప్పటికే రెవెన్యూ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని రహదారులు, భవనాలశాఖ ఈఈ కె.గోపినాయక్ పేర్కొన్నారు. రెవెన్యూశాఖ అధికార యంత్రాంగం సహకారంతో ఆక్రమణలు తొలగించి విలువైన స్థలాన్ని కాపాడతామన్నారు.

# పైడితల్లి ఆలయాభివృద్ధికి పచ్చజెండా

విజయనగరం :ఉత్తరాంధ్రుల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎట్టకేలకు పచ్చజెండా ఊపారు. అంతరాలయం, మండప విస్తరణ పనులు, ఆధునికీకరణకు ప్రభుత్వం సీజీఎఫ్ నిధులు రూ.1.80 కోట్లు మంజూరు చేసింది. దేవస్థానానికి ఇరువైపులా ఉన్న దుకాణాలను తొలగించి రెండేళ్లయినా.. విస్తరణ పనులకు మాత్రం నోచుకోకపోవడంతో అటు భక్తులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఈ పనులకు కొన్నేళ్లుగా దేవస్థానం మ్యాచింగ్ గ్రాంటు చూపిస్తున్నా.. గత ప్రభుత్వ హయాంలో దేవాదాయ శాఖ కాలయాపన చేస్తూ వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆలయ అభివృద్ధిపై దృష్టిసారించడంతో రూపురేఖలు మారనున్నాయి.

**17 అడుగుల మేర విస్తరణ**

పైడితల్లి ఆలయం లోపల మండపానికి తూర్పు, పడమర వైపున గోడలు తొలగించి, 17 అడుగుల చొప్పున విస్తరించనున్నారు. మ్యాచింగ్ గ్రాంట్‌గా ప్రత్యేక ఖాతాలో దేవస్థానం రూ.36 లక్షలు




చూపితే.. మిగిలిన రూ.1.44 కోట్లు ప్రభుత్వం విడుదల చేయనుంది. ఇందుకు చేపట్టాల్సిన నిర్మాణాల నివేదిక గ్రాంట్‌తో కలిపి చూపించాలి. గర్భగుడి, రాజగోపురాలకు ఎలాంటి మార్పు చేయరు.

**పండగ అనంతరం పనులు**

– కె.శిరీష, ఈవో, పైడితల్లి దేవస్థానం

ఈ ఏడాది అమ్మవారి సిరిమాను పండగ అనంతరం ఆలయ విస్తరణ పనులు చేపడతాం. ఇందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

# వసతి వేదన

విజయనగరం : అందని రక్షిత నీరు.. అధ్వానంగా వంట గదులు.. ప్రాంగణాల్లో క్షీణించిన పారిశుద్ధ్యం.. ఇదీ పలు వసతి గృహాల్లో పరిస్థితి. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో పరిస్థితులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధికారులు నిశితంగా పరిశీలించారు. ప్రతిచోటా విద్యార్థుల దయనీయ పరిస్థితులను చూసి చలించిపోయారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వసతి గృహాల వైపు కన్నెత్తి చూడలేదు. భవనాల మరమ్మతులకు కాసులు విదల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంచెలంచెలుగా వసతి గృహాల



మరమ్మతులకు నిధులిచ్చింది. కొన్నిచోట్ల పనులు పూర్తయ్యాయి. మరికొన్నిచోట్ల జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో భవనాల మరమ్మతులకు సుమారు రూ.15 కోట్లు విడుదల చేసింది. విజయనగరం జిల్లాలో ప్రభుత్వ బీసీ సంక్షేమ విద్యార్థుల వసతి గృహాలు 51, ఎస్సీ వసతి గృహాలు 30, ఎస్టీ వసతి గృహాలు 8, విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలు రెండు ఉన్నాయి. ప్రస్తుతం ప్రవేశాలు చివరి దశలో ఉన్నాయి. వీటిలో 6,745 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాలు 8, బీసీ హాస్టళ్లు 10, ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు 58 ఉన్నాయి. వీటిలో సుమారు ఇరవై వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

వసతి గృహాలు చాలా వరకు శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్నాయి. చాలాచోట్ల భవనాలకు ప్రహరీలు లేవు. కనీస మరమ్మతులు లేక గదుల్లో గచ్చులు, గోడలు పెచ్చులూడిపోయాయి. కొన్నిచోట్ల విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. మరుగుదొడ్లు సరిపడా లేవు. ఉన్నవాటికి వాడుక నీరు లేక వినియోగించలేకపోతున్నారు. బాలికల వసతి గృహాల్లో పరిస్థితి మరీ దయనీయం.

**43 చోట్ల తనిఖీలు**

సాంఘిక సంక్షేమ, బీసీ, గురుకుల ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతుల లేమిపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం అన్ని జిల్లాల్లో పరిస్థితిని పరిశీలించి నివేదించాలని గతంలో ఆదేశించింది. ఉమ్మడి జిల్లాలో ఇంత వరకు 43 వసతి గృహాల్లో తనిఖీలు చేపట్టిన న్యాయాధికారులు హైకోర్టుకు నివేదించారు. వీటిని పరిశీలించిన హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సౌకర్యాలు మెరుగుపర్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వివరణ ఇచ్చేందుకు ప్రతిపాదనలతో ఈ నెల 21న హాజరు కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా సంబంధిత సంక్షేమ శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులను ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో అధికార యంత్రాంగంలో కాస్త కదలిక కనిపించింది. వసతి గృహాల్లో తాజా పరిస్థితిపై నివేదికలు అందజేయాలని ఉభయ జిల్లాలకలెక్టర్లు సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

చురకలు



# విధులు పంచుకొని.. నిధులు నంజుకొని

విశాఖపట్నం : ఆరు నెలలుగా మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)కి కమిషనర్ లేక పాలన గాడి తప్పింది. పలు విభాగాల్లో కొందరు అధికారులు, సిబ్బందిలో విధుల పట్ల నిర్లక్ష్యం కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది గదులకు పరిమితమయ్యారు. దీంతో నగరంలో పరిస్థితులు పూర్తిగా అదుపు తప్పాయి. ముఖ్యంగా ప్రజారోగ్య విభాగంలో పలువురు సహాయ వైద్యాధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎక్కడా కనిపించడంలేదు. ప్రభుత్వం చెత్త తరలింపు రుసుములను రద్దు చేసిన తరువాత చెత్త సేకరణకు కార్మికులు సక్రమంగా ఇళ్లకు వెళ్లడంలేదు. అపార్ట్‌మెంట్లు, గ్రూప్‌హౌస్‌ల వద్ద చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త బిన్నులను ప్రతి రోజూ ఉదయం 7 గంటలకల్లా తరలించేవారు. ఇప్పుడు రెండు, మూడు రోజులకోసారి ఆ పనులు చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు రెండు పూటలా హాజరుకావాల్సి ఉండగా చాలా మంది ఉదయం మాత్రమే హాజరవుతున్నారు. ఐరిస్ తీసిన తరువాత పనిచేయకుండా కొందరు ఇళ్లకు వెళ్లిపోతున్నారు. రెండో పూట విధులకు 10-15 శాతం మాత్రమే హాజరవుతున్నట్లు సమాచారం. వారి వేతనాల్లో భారీగా కోతలు విధించి కొందరు అధికారులు పంచుకుంటున్నారన్న విమర్శలున్నాయి. కూలి ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికుల్లో 30శాతం మాత్రమే విధులకు వస్తున్నారు. మిగిలినవారి వేతనాలు పంపకాలు జరిగిపోతున్నాయి. వీటన్నింటిపై కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టిపెట్టాల్సి ఉంది.

**కాసుల కోసం కళ్లుమూసుకుంటూ:** నగరంలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్లాన్లు లేకుండా కొన్ని, ప్లానుకు విరుద్ధంగా కొన్ని నిర్మాణాలు చేపడుతుండగా కొందరు ప్రణాళికాధికారులే తెరవెనుక ఉండి వ్యవహారాలు నడిపిస్తున్నారు. చాలా నిర్మాణాల్లో ఉల్లంఘనలుంటున్నా, వాటిపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు చర్యలు చేపట్టడంలేదు. భారీ నిర్మాణాల వద్ద రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. ఆక్యుపెన్సీ ధ్రువీకరణపత్రాల(ఓసీ) మంజూరులో అక్రమాలు చోటుచేసుకుంటుండగా, నాలా, ఖాళీ స్థలం పన్ను చెల్లించకుండానే ప్లాను, ఓసీ కూడా ప్రణాళికాధికారులు ఇచ్చేస్తుండటం గమనార్హం. లంచమివ్వనిదే ఆస్తి పన్ను విధించడంలేదు. ఆస్తి బదలాయింపు, కొత్తగా పన్ను వేయడం, ఆస్తి పన్ను మదింపు వంటి ప్రతి దస్త్రానికి కొందరు సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇచ్చినవారికి తక్కువ మొత్తంలో ఆస్తి పన్ను విధిస్తూ జీవీఎంసీకి భారీగా నష్టం వాటిల్లేలా వ్యవహరిస్తున్నారు. లీజులు, మార్కెట్ల నుంచి ఆశీలు వసూలులో గుత్తేదారులకు సహకరిస్తూ జోనల్ అధికారులతో కలిసి పలువురు రెవెన్యూ సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

**టీడీఆర్ బాండ్లపై దృష్టిపెడితేనే?:** కూటమి హయాంలోనూ టీడీఆర్ల జారీలో జీవీఎంసీ అధికారులు వెనక్కు తగ్గడంలేదు. మురికివాడలకు, నాయకుల ఆస్తులున్న ప్రాంతాలలో రహదారులు అభివృద్ధి పేరిట టీడీఆర్లకు దరఖాస్తులొస్తున్నాయి. సింహాచలం దేవస్థానానికి చెందిన స్థలం కలిసిన ప్రాంతంలో రహదారి అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించి అక్రమ టీడీఆర్ పొందడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నాణ్యతలేని పనులతోపాటు, పని చేయకుండానే రికార్డు చేసే స్థాయికి జీవీఎంసీ ఇంజినీర్లు వెళ్లారు. నాలుగు కాసులు వచ్చే సీట్లకు ఏళ్ల తరబడి అతుక్కుపోయారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా నీటి సరఫరా, భూగర్భ మురుగునీటి వ్యవస్థలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రతి పనిలోనూ అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు.

# పగలు, రాత్రి.. భయానకం!!



విశాఖపట్నం : నగరంలో పలు కూడళ్ల వద్ద పరిస్థితి భయపెడుతోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడం, సిబ్బంది లేకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ప్రధానంగా భారీ వాహన చోదకులు ఇష్టారాజ్యంగా దూసుకెళ్లడంతో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. నగరంలో ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాలే ఇందుకు తార్కాణం.

**అవి మొత్తం 240:** నగరంలో అంతర్గత రహదారులు, జాతీయ రహదారి, బీచ్‌రోడ్, బీఆర్టీఎస్ రహదారి... ఇలా అన్ని చోట్ల 240 సిగ్నల్ పాయింట్లు వివిధ కూడళ్లలో ఉన్నాయి. ఎన్ఏడీ నుంచి లంకెలపాలెం వరకున్న కూడళ్ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, పోర్టు నుంచి వెళ్లే భారీ వాహనాలతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది.

లంకెలపాలెం కూడలి వద్ద రోడ్డు నిర్మాణంలోనే సాంకేతిక సమస్య ఉందనే చర్చ సాగుతోంది. కూడలికి అర కిలోమీటరు ముందు నుంచి వాలుగా ఉండటంతో వేగం అదుపుగాక ముందు ఉన్న వాహనాలపైకి దూసుకెళుతున్నారు. హెూమీబాబా ఆసుపత్రి కూడలి వద్ద కొత్త సిగ్నల్స్ పెట్టారు. కానీ, ఇంకా ప్రారంభించలేదు. ఆటోనగర్ కూడలి వద్ద హైవే నుంచి ఆటోనగర్ వెళ్లేందుకు యూటర్న్ తీసుకునే వాహనాలకు, అటు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఢీకొంటున్నాయి. వడ్లపూడి, కూర్మన్నపాలెం కూడళ్ల వద్ద కూడా ప్రమాదకర పరిస్థితే ఉంది. కూర్మన్నపాలెం కూడలి నుంచి ఎయిర్‌పోర్టు కూడలి వరకు మధ్యలో కొన్ని సిగ్నల్స్ పనిచేయడం లేదు.

**ఇటీవల ఇలా..**

ఈనెల 23న లంకెలపాలెం కూడలి ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఆగి ఉన్న వాహనాలపైకి సోమవారం రాత్రి ఓ లారీ దూసుకెళ్లింది. ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. కొందరు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. 21న శీలానగర్ కూడలిలో కంటైనర్‌ను వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

3న లంకెలపాలెం కూడలిలోనే అదుపు తప్పిన బొగ్గు లారీ ముందువెళుతున్న ఆటోను బలంగా ఢీకొట్టడంతో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి.

**ఎందుకిలా అంటే..** కొన్ని కూడళ్లలో సిగ్నల్ దీపాలు వెలగకపోవడం. రాత్రి 8 దాటితే కొన్ని చోట్ల సిగ్నల్స్ ఆపేయడం.. సిబ్బంది తగినంత మంది లేకపోవడం.

ఇంకొన్ని చోట్ల సిగ్నల్స్ పనిచేస్తున్నా.. భారీ వాహనాల డ్రైవర్లు మద్యం మత్తు, నిర్లక్ష్యంగా నడపడం.

పైవంతెనలు ప్రతిపాదనలతోనే: జాతీయ రహదారిపై కారుషెడ్డు, ఎండాడ, ఆదర్శనగర్, హనుమంతవాక, మద్దిలపాలెం, సత్యం జంక్షన్, గురుద్వారా, తాటిచెట్లపాలెం, గాజువాక, కూర్మన్నపాలెం, స్టీలుప్లాంటు, లంకెలపాలెం.. ఇలా ప్రధాన కూడళ్లలో పైవంతెనలు 12 నిర్మించేందుకు ప్రతిపాదనలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రత్యేక శ్రద్ధ పెట్టి డీపీఆర్ సైతం పూర్తి చేశారు. పైవంతెనల ప్రతిపాదనలున్నచోట నుంచే మెట్రో వెళ్లే అవకాశం ఉండటంతో ప్రస్తుతానికి పైవంతెనల ప్రతిపాదనలు అలా నిలిపారు. రెండూ కలిపి నిర్మించే ప్రణాళికలపై కసరత్తు చేస్తున్నారు.

**రోడ్డు ప్రమాదాల్లో మృతులు**

2023: 317

2024: 335

2025: 129 (ఇప్పటి వరకు)

నగరంలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి: 75 కి.మీ.

బీఆర్టీఎస్ రహదారి: 35 కి.మీ.పైగా

అంతర్గత ప్రధాన రహదారులు: 150 కి.మీ.

నగరంలో నిత్యం తిరిగే వాహనాలు: 5లక్షలకుపైగా

# త్వరలో సహకార వ్యవస్థకు సారథులు

అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో 96 సహకార సంఘాలున్నాయి. వీటిద్వారా రైతులకు అవసరమైన పంట రుణాలను అందిస్తున్నాయి. ఎకరా చెరకు తోట వేస్తే రూ. 75 వేలు రుణంగా అందిస్తారు. ఒక రైతుకు గరిష్ఠంగా రూ. 3 లక్షల వరకు రుణం ఇస్తారు. జిల్లాలో ఏటా రూ. 680 కోట్లు వరకు రుణాలుగా అందిస్తున్నారు. ఒక్క మునగపాక సొసైటీయే ఏటా 800 మంది రైతులకు రూ. 1.65 కోట్లు రుణాలుగా అందిస్తోంది.

రైతులకు అండగా నిలుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్)లను గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముందుగా ప్రతి సొసైటీకి ఛైర్మన్‌ను నియమించనుంది.



ఇందులో భాగంగానే ఇప్పటికే జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలకు అధ్యక్షులను నియమించారు. ఇదే విధంగా సహకార సంఘాలకూ తాత్కాలిక ఛైర్మన్లను నియమించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. వీరి పదవీకాలం ఆరు నెలలు. వీరి పదవీకాలం ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల బరిలో అభ్యర్థులుగా నిలిపేవారినే ప్రస్తుతం ఛైర్మన్లుగా నియమించేందుకు కసరత్తు చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో పలు సంఘాలు అక్రమాల పుట్టలుగా మారాయి. వైకాపా నాయకులనే పర్సన్ ఇన్‌ఛార్జులుగా నియమించి అప్పట్లో కాలం వెళ్లదీశారు. వీరి పదవీకాలం ఆరు నెలలైనా నాలుగైదుసార్లు పొడిగించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీరంతా రాజీనామా చేశారు.

**ఛైర్మన్ల కోసం పోటాపోటీ**

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబి) ఛైర్మన్‌గా జనసేనకు చెందిన కోన తాతారావును, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఛైర్మన్‌గా తెదేపాకు చెందిన కోట్ని బాలాజీలను నియమించారు. ఈ రెండింటిలో సభ్యులుగా ఉండేది సహకార సంఘాల అధ్యక్షులే. అందుకే సెంట్రల్ బ్యాంకు, డీసీఎంఎస్ ఛైర్మన్‌లను పీఏసీఎస్ నుంచి పోటీ చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్‌ను అనకాపల్లి మండంలోని ఒక సొసైటీ నుంచి రంగంలోకి దింపడానికి తెదేపా నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఏఏ సొసైటీ నుంచి ఎవరిని ఛైర్మన్‌గా నియమించాలనే అంశంపై ఇప్పటికే నియోజకవర్గాల వారీగా కూటమి నాయకులు చర్చలు జరిపి నట్లు తెలిసింది. కొన్ని నియోజకవర్గాల జాబితాలు సిద్ధం చేసి అధిష్ఠానానికి పంపారని తెలుస్తుంది. అనకాపల్లి నియోజకవర్గంలో అయిదు సొసైటీలుంటే వాటిలో.. రెండు తెదేపాకు, మూడు జనసేనకు కేటాయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. పట్టణంలోని రెండు సొసైటీల్లో చెరొకటి తీసుకోగా.. గ్రామీణ ప్రాంతాల్లో మూడింటిలో ఒకటి తెదేపా, రెండు జనసేన తీసుకున్నట్లు తెలిసింది. వీటి కోసం రైతుల్లో గట్టి పోటీ ఉంది. పదవిని పొందేందుకు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జుల చుట్టూ తిరుగుతున్నారు.

# గుట్టు వీడలేదు.. లెక్క తేల్చలేదు



అనకాపల్లి : పేదలు, అభాగ్యులకు ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే పింఛను కోసం పలువురు అర్హులు నిరీక్షిస్తుండగా.. గత ప్రభుత్వంలో అనర్హులైన అనేకమంది ఈనాటికీ అప్పనంగా పింఛను తీసుకుంటున్నారు. వైకాపా హయాంలో పార్టీల ముద్రవేసి పలువురు అర్హులకు పింఛను తొలగించగా.. అనర్హులకు లబ్ధి చేకూర్చారు. వైకల్యం నిర్దేశిత శాతం లేకున్నా.. పాలకుల ఒత్తిళ్లతో వైకల్యం ఉన్నట్లు కొందరు వైద్యులు అక్రమంగా ధ్రువీకరించేశారు. వాటి ఆధారంగా పింఛన్లు పొందేవారి వల్ల రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతోందని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అనర్హులు బోగస్ పింఛన్ల లెక్క తేల్చేందుకు తనిఖీలు చేయిస్తోంది. ఆరు నెలలుగా ఈ ప్రక్రియ కొనసాగుతున్నా బోగస్ పింఛన్ల వివరాలను మాత్రం అధికారులు బయటకు వెల్లడించక పోవడంపై విమర్శలు వస్తున్నాయి.

**పక్క జిల్లా వైద్యులతో తనిఖీలు:** జిల్లాలో 2.54 లక్షల పింఛనుదారులు ఉన్నారు. వీరిలో 30,845 మందిని తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటివరకు 15,478 మంది అర్హతను తనిఖీలు చేసి అవసరమైన వివరాలు సేకరించారు. ఇంకా 15,367 మంది పింఛన్లను తనిఖీలు చేయాల్సి ఉంది. బోగస్ పింఛన్లు బయట పడితే.. ఉద్యోగులకే చెడ్డపేరొస్తుందన్న నెపంతో కొంతమంది వైద్యులు నిర్ధారణ పరీక్షలు సరిగా చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. బోగస్ పింఛన్ల ఏరివేత బాధ్యత గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), వైద్య ఆరోగ్య శాఖలకు అప్పగించింది. గత ప్రభుత్వంలో వాళ్లే పింఛన్లు ధ్రువీకరించడంతో.. పక్క జిల్లాల వైద్యులతో తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలోని ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో తనిఖీలు చేస్తున్నారు.

అనంతరం వివరాలు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి నివేదిస్తున్నామని అధికారులు చెబుతున్నారు కానీ.. జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని బోగస్ పింఛన్లు మంజూరవుతున్నాయన్న వివరాలు మాత్రం అధికారులు బయటపెట్టడం లేదు.

**పక్కాగా పరిశీలన:** వారంలో మూడు రోజులు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ఆసుపత్రిలో ఇతర జిల్లాలు నుంచి వైద్యులు వచ్చి పింఛనుదారులను తనిఖీ చేస్తున్నారు. నిజంగా ఎంతశాతం వైకల్యంతో ఉన్నారన్నది పరిశీలిస్తారు. అర్హులకు ఎవరికీ అన్యాయం జరగదు. ఇళ్లలో మంచానికే పరిమితమైన వారి వివరాలు సేకరించాం. ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వమే అనర్హుల జాబితాను విడుదల చేస్తుంది. శచీదేవి, డీఆర్‌డీఏ పీడీ, అనకాపల్లి

# కుయ్యో.. రొయ్యో!

ఒంగోలు : సీఆర్‌జెడ్ పరిధిలో రొయ్యల చెరువులు, ఏ విధమైన కట్టడాలు నిర్మించకూడదని ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్) ప్రకటించినా కొందరు పట్టించుకోవడంలేదు. కోస్తా తీర ప్రాంతంలో ఇష్టారీతిన రొయ్యల చెరువులు తవ్వకాలు జరిపి సాగు చేస్తున్నారు. పిల్ల దశ నుంచే రొయ్య ఎదుగుదలతోపాటు వ్యాధుల నియంత్రణకు పలు రసాయనాలు వినియోగిస్తున్నారు. చెరువుల నుంచి వచ్చే కలుషిత వ్యర్థాలను పొరుగునే ఉన్న కాలువల్లోకి వదులుతున్నారు. దీంతో రక్షిత మంచినీటి పథకాలకు చెందిన నీటి వనరులు కలుషితమవుతున్నాయి. పచ్చని పొలాలు బీడు భూములుగా మారుతున్నాయి.

**అయిదు మండలాల్లో సాగు...:** జిల్లాలో సముద్ర తీర ప్రాంతం 50 కిలోమీటర్ల మేర ఉంది. ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, సింగరాయకొండ మండలాల పరిధిలోని 30 గ్రామాల్లో సుమారు 17 వేల ఎకరాల విస్తీర్ణంలో రొయ్యల సాగు చేస్తున్నారు. సముద్రపు అలలు వచ్చే గరిష్ఠ దూరం నుంచి 500 మీటర్లలోపు ఎలాంటి చెరువుల తవ్వకం, ఇతర నిర్మాణ పనులు చేపట్టకూడదు. రెండంకెల వృద్ధిలో భాగంగా రొయ్య సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడంతో కొందరు దాన్ని సాగుకు తీసుకుని తీరం వెంబడి ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో సైతం ఇష్టారీతిన చెరువులు తవ్వకం చేపట్టి సాగు చేస్తున్నారు. మరికొందరు తీరంలోనే బోర్లు వేసి ఉప్పునీటిని మళ్లిస్తున్నా



రు. ప్రత్యేకించి కొత్తపట్నం మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో 25కుపైగా రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. అవన్నీ సముద్రపు ఒడ్డునే ఉండడంతో వాటి నుంచి వచ్చే వ్యర్థాలను సమీప భూమిలోకి ఇంకిస్తున్నారు. లేకుంటే నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు.

**పిల్ల కాలువలా బకింగ్‌హాం కెనాల్**

బకింగ్‌హాం కెనాల్. సముద్ర తీర ప్రాంతానికి దగ్గరగా ఉంటుంది. అంతటి ప్రాధాన్యం గల కెనాల్ ఇప్పుడు పిల్ల కాలువను తలపిస్తోంది. నాగులుప్పలపాడు మండలం కనపర్తి నుంచి సింగరాయకొండ వరకు స్థానికులు రాజకీయ నాయకుల అండతో కాలువ ఇరువైపులా ఆక్రమించి రొయ్యల సాగును యథేచ్ఛగా చేస్తున్నారు. ఆక్రమణలో ఉన్న చెరువులకు సైతం సంబంధిత శాఖల అధికారులు అనుమతులు జారీ చేశారు. ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాల్సిన నేపథ్యంలో జలవనరుల శాఖ అధికారులు కాలువ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇంజినీరింగ్ విద్య.. అందని ద్రాక్ష

ఒంగోలు : రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ప్రకాశం ఒకటి.. వలసలకు మారుపేరు.. ప్రస్తుత తరం కూడా అందుబాటులో ఉన్న బడుల్లో పదోతరగతి వరకు చదివిన తరువాత హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలకు వలసపోతున్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్నత విద్య కళాశాలలు లేకపోవడం, ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు చెల్లించే స్థోమత లేకపోవడంతో పేదింటి పిల్లలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం (ఏకేయ) పరిధిలో ఇంజినీరింగ్ కళాశాల పెడతామని ఊరిస్తున్నారే తప్ప ఆచరణలో అడుగులు ముందుకు పడడం లేదు. ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయం అధికారులు సంయుక్త కార్యాచరణతో ముందుకెళితే కళాశాల ఏర్పాటుతో పేద విద్యార్థులను ఇంజినీర్లుగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుంది. ఇంటర్మీడియట్ తరువాత డిగ్రీ కోర్సుల్లో చేరేవారే జిల్లాలో ఎక్కువగా ఉంటున్నారు. జిల్లాలోని సుమారు 130 డిగ్రీ కళాశాలల్లో 30 వేలమందికిపైగా డిగ్రీ అభ్యసిస్తున్నారు. కాస్త స్థోమత ఉన్నవారు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరిపోతున్నారు. మిగిలినవారు ఓ వైపు పార్ట్‌టైం జాబ్ చేస్తూ డిగ్రీ కొనసాగిస్తున్నారు. అదే ఇంజినీరింగ్ విద్యలో మంచి ప్రతిభ చూపితే రూ.లక్షల జీతం పొందేందుకు అవకాశం ఉంటుంది. నాగార్జున విశ్వవిద్యాలయం



పరిధిలో జిల్లాలో పీజీ కేంద్రాలు తప్పించి వృత్తి విద్యా, సాంకేతిక కళాశాలలు ఏర్పాటు చేయలేదు. ఎనిమిదేళ్ల కిందట ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఏర్పాటైనా నిధుల్లేక ఒక్క భవనాన్ని నిర్మించలేదు. ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలంటే అఖిల భారత సాంకేతిక విద్యా మండలి నిబంధనల ప్రకారం 40 వేల చదరపు అడుగుల భవనాలు చూపించాలి. ప్రభుత్వ విశ్వవిద్యాలయం పరిధిలో అయినందున అనుమతులకు పెద్ద కష్టమేమి కాదు. ఆ దిశగా ఆలోచన చేస్తే పేద కుటుంబాలకు చెందినవారు ఏటా 300 నుంచి 400 మందిని ఇంజినీర్లుగా తయారు చేయవచ్చు.

**వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభిస్తాం**

ఒంగోలు నగర శివారు పేర్నమిట్ట వద్ద ఉన్న స్థలంలో ఇంజినీరింగ్ కళాశాల నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నాం. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిస్తాం. ప్రస్తుతం డిమాండు ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా ఎనలిటిక్స్.. అధునాతన కోర్సులతో ఇంజినీరింగ్ విద్యను అందుబాటులోకి తీసుకొస్తాం. డీవీఆర్ వర్తి, ఉపకులపతి, ఏకేయ

# రోగుల సహాయకులకు ప్రత్యేక సౌకర్యాలు

పెదవాల్తేరు : ప్రభుత్వ ఛాతి ఆసుపత్రికి క్షయ, ఎయిడ్స్ బాధితులు ఎక్కువగా వస్తుంటారు. క్షయ అంటువ్యాధి కావడంతో ఇతరులకు సోకే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో బాధితులకు సహాయకులుగా వచ్చే వారికి అంటువ్యాధులు సోకకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆసుపత్రికి ఎన్.ఎ.బి.హెచ్.ఐ.(నేషనల్ అగ్రిఫుడ్, బయోమ్యానుఫ్యాక్చరింగ్ ఇన్‌స్టిట్యూట్) గుర్తింపు పొంది ఉండడంతో ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీని కోసం ఆసుపత్రిలోని కొన్ని నిర్మాణాల్లో మార్పులు చేశారు. అదేవిధంగా ప్రత్యేక సదుపాయాలను సమకూర్చారు. వీటికయ్యే వ్యయం పూర్తిగా ఏపీ ఎం.ఎస్.ఐ.డి.సి. విభాగం భరిస్తుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు.

గతంలో రోగులతోపాటు వారి బంధువులకు ఒకటే వాష్‌రూమ్ ఉండేది. ఇక్కడికి ప్రధానంగా టీబీ, రేబిస్, కలరా తదితర వ్యాధులతో రోగులు వస్తుంటారు. ఇవన్నీ అంటువ్యాధులు కావడం, రోగులు వాడిన వస్తువులు ఇతరులు వాడితే ఆయా వ్యాధులు సోకుతాయనే ఆలోచనతో ప్రత్యేకంగా వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. వాటిల్లో అన్ని సదుపాయాలు కల్పించారు.

రోగులకు రక్తపరీక్షలు చేయడానికి ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు చేశారు. గతంలో ఎయిడ్స్, క్షయ వ్యాధి బాధితులతోపాటు ఇతరులకు ఒకటే ల్యాబ్ ఉండేది. క్షయవ్యాధిగ్రస్థులకు రక్త పరీక్షలు చేయడానికి ఉపయోగించే పరికరాల కారణంగా ఇతరులకు ఆ వ్యాధి సోకుతుందనే ఉద్దేశంతో ప్రత్యేకంగా లాబ్‌ను సిద్ధం చేశారు. సాధారణ వ్యాధులతో వచ్చే రోగులకు వేరుగా ల్యాబ్ ఉంది. ఎవరికైనా క్షయ ఉందని అనుమానిస్తే ఎ.ఆర్.టి. సెంటర్ దరి డీఎంసీ ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేస్తారు. ఆసుపత్రిలోని మెడికల్ రికార్డు సెంటర్‌ను కూడా ఆధునికీకరించారు. ఇక్కడ రోగుల కేస్‌షీట్లను భద్రపరుస్తున్నారు. ఆయా వివరాలను డిజిటలీకరణ చేస్తున్నారు. ఇందులో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి కార్పొరేట్ కార్యాలయం తరహాలో తీర్చిదిద్దారు.

చురకలు



# చెన్నై, చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్‌లలో దోపిడీ

గుత్తి : అనంతపురం, కర్నూలు జిల్లాల్లో చెన్నై ఎక్స్‌ప్రెస్, చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్‌లో చొరబడి ప్రయాణికులను నిలువు దోపిడీ చేశారు.రైల్వే సిగ్నల్ కేబుల్‌ను కత్తిరించి ఈఘాతుకానికి పాల్పడ్డారు. తాడిపత్రి మండలం కోమలి, కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని రామలింగాయపల్లి వద్ద దోపిడీలు జరిగినట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. కోమలి రైల్వేస్టేషన్ శివారులో సిగ్నల్ కేబుల్‌ను దుండగులు కత్తిరించగా చెన్నై ఎక్స్‌ప్రెస్‌కు లోకోపైలెట్ సిగ్నల్ ఇవ్వలేదని రైలును ఆపారు. సరిగ్గా తెల్లవారుజామున 3.55కి రైలు ఆగడంతో ముగ్గురు దుండగులు రైలులోని ఎస్-1 బోగీలోకి చొరబడి కడపకు వెళుతున్న గుత్తికి చెందిన విశాలాక్షి మెడలోని 2.7 తులాల బంగారు గొలుసును బలవంతంగా లాక్కున్నారు. అంతలో ప్రయాణికులు గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. ఆపరేటింగ్ అధికారులు




సిగ్నల్ కేబుల్‌ను కత్తిరించిన విషయాన్ని గుర్తించి తాత్కాలికంగా పేపర్‌లో రైలు వెళ్లడానికి అనుమతులతో కూడిన ఉత్వర్వులు ఇచ్చారు. దీంతో చెన్నై ఎక్స్‌ప్రెస్‌తోపాటు రెండు గూడ్స్ రైళ్లను పంపారు. కడపకు చేరుకోగా విశాలాక్షి జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులు కత్తిరించిన కేబుల్‌ను ఎస్అండ్‌టీ అధికారులు పునరుద్ధరించారు.

**రైలు ఆగడంతో..**కర్నూలు జిల్లా రామలింగాయపల్లిలో 2.30 గంటలకు ఆగింది. వెంకట్రాద్రి ఎక్స్‌ప్రెస్ వస్తుండటంతో క్రాసింగ్ ఇచ్చి చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్‌ను ఆపరేటింగ్ అధికారులు నిలిపారు. అక్కడ 11 నిమిషాలపాటు రైలు ఆగడంతో దుండగులు బోగీలోకి వెళ్లి ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు అక్కడే ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఏప్రిల్ 29న గుత్తిశివారులో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ జరిగినా రైల్వేపోలీసులు మొద్దునిద్రను వీడలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.. రెండు రైళ్లల్లో దోపిడీలు జరగడంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.

# సర్వే నంబర్లు మార్చి.. ఏమార్చి

కేవీబీపురం : ఎం.ఎ.రాజులకండ్రిగ గ్రామకంఠంలోని సర్వే సంఖ్య 256లో పాలూరు కుమారి, ఆమె భర్త వెంకటసుబ్బయ్య నివసిస్తున్నట్లు గ్రామ సచివాలయ సర్వేయర్ మునెయ్య అందించిన పొజిషన్ ధ్రువపత్రమిది. కానీ రెండు కిలోమీటర్ల దూరంలోని సర్వే సంఖ్య 512-2లోని గిరిజనకాలనీలో వీరు ఉంటున్నారు. వారు ఉంటున్న ప్రాంతం కొండ పోరంబోకు. ఇక్కడ రిజిస్ట్రేషన్లు జరగవు. పేదల అవసరాన్ని గుర్తించిన సర్వేయర్ మరో సర్వే సంఖ్య వేసి పొజిషన్ సర్టిఫికేట్లు జారీ చేశారు. ఇలాంటివి ఎం.ఎ.రాజులకండ్రిగలో పదుల సంఖ్యలో దర్శనమిస్తాయి. కేవీబీ పురం మండలం ఎం.ఎ.రాజుల కండ్రిగ సర్వే సంఖ్య 512-2లో నాలుగు ఎకరాల కొండ పోరంబోకు, సర్వే సంఖ్య 328-1లో కాలువ, 328-2లో గ్రామకంఠం 56 సెంట్లు, 328-3 నుంచి 17 వరకు పట్టా భూములున్నాయి. ఇదే రెవెన్యూలోనే సర్వే సంఖ్య 256లో 8.12 ఎకరాలు గ్రామకంఠం. గిరిజనులు నివసిస్తున్న ప్రాంతం నిషేధిత జాబితాలో ఉండటంతో వారి అవసరాన్ని సర్వేయర్ సొమ్ము చేసుకున్నారు. లబ్ధిదారులు ఒకచోట ఉంటే పొజిషన్ మరోచోట ఇచ్చి ఆ స్థలం రిజిస్ట్రేషన్ అయ్యేలా రికార్డులు తారుమారు చేశారు. ఎం.ఎ.రాజులకండ్రిగలోని ఎస్సీ, ఎస్టీల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని సదరు సర్వేయర్ 30 మందికిపైగా పొజిషన్ పత్రాలు అందించారు. ఒక్కొక్కరి వద్ద రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ తంతు 2022 అక్టోబర్ నుంచి 2024 ఏప్రిల్ వరకు సాగింది.

**ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తూ..**

కేవీబీ పురం మండలం కోటమంగాపురం సచివాలయ సర్వేయర్‌గా మునెయ్య ఉండేవారు. నాటి వైకాపా నేతల ఆశీస్సులతో ఎంఏరాజుల కండ్రిగ, సదాశివపురం, మిద్దికండ్రిగ సచివాలయాల్లోనూ ఇన్‌ఛార్జిగా బాధ్యత తీసుకున్నారు. ఆయా పంచాయతీల్లో గిరిజనులు ఎక్కువగా ఉండటంతో వారి నుంచి వసూళ్లకు పాల్పడ్డారు. ప్రభుత్వ, నిషేధిత స్థలాల రికార్డులు తారుమారు చేసి ఇలా అనేక ధ్రువపత్రాలు ఇచ్చారని ఆరోపణలున్నాయి. ఇన్‌ఛార్జిగా ఉన్న ఒక్క సచివాలయంలోనే ఆయన లీలలు ఇలా ఉంటే మిగిలిన ప్రాంతాల్లో ఇంకెన్ని అక్రమాలు ఉంటాయోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సర్వేయర్ అవినీతి బాగోతాన్ని కొందరు కలెక్టర్‌కు వివరించినట్లు సమాచారం. దీనిపై శ్రీకాళహస్తి ఆర్డీవోను వివరణ కోరేందుకు యత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

# ప్రై'వేట'.. కనిపించని బడిబాట

చిత్తూరు : కూటమి ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి తొమ్మిది రకాల పాఠశాలలను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలని, ఇందుకు ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు, ఎస్ఎంసీ సభ్యులు సమన్వయంతో బడిఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ఇది కాస్తా నత్తనడకన సాగుతోంది. ప్రైవేటు యాజమాన్యాలు మాత్రం గ్రామాల్లో ముమ్మరంగా తిరుగుతూ పిల్లలను తమవైపు మళ్లిస్తున్నారు. దాంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఈ నెల 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని, బడిబాట కార్యక్రమం నిర్వహించాలని విద్యాశాఖ సూచించింది. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలను ప్రారంభించారు. దాంతోపాటు మీ గ్రామంలో పాఠశాలను ఎత్తివేశారని చెబుతూ విద్యార్థులను వారి పాఠశాలల్లో చేర్పించుకుంటున్నారు. అలాగే ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటో తరగతికి ఎలాంటి ఫీజులు లేవని చెబుతూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. మోడల్ పాఠశాలల వ్యవస్థతో కొన్ని చోట్ల 3, 4, 5 తరగతులు రద్దు కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు.

**కొన్నింటిని పరిశీలిస్తే..**

పుత్తూరు మండలం తడుకు ప్రాథమిక పాఠశాలలో ఒకరు కూడా ప్రవేశం పొందలేదు.

పలమనేరు మండలం కల్లాడు ప్రాథమిక పాఠశాలలోనూ ఎవరూ చేరలేదు.

**బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి**

బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించడానికి అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నాం.

వరలక్ష్మి, డీఈవో, చిత్తూరు

# ఘాటెక్కిన మిరప సాగు



అనంతపురం: పెరిగిన పెట్టుబడులు.. అమాంతం పడిపోయిన ధరలు వెరసి మిరప రైతును తీవ్రంగా కుంగదీస్తున్నాయి. రెండేళ్లుగా కనీస ధర లేక ఉమ్మడి జిల్లా మిరప రైతులు నష్టపోయారు. వచ్చే ఏడాదైనా ధర పెరగకపోతుందా అని పంటను గోదాముల్లో నిల్వ చేసి ఆశగా ఎదురుచూస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. తెగుళ్ల రూపంలో కష్టాలు, ధరల రూపంలో నష్టాలు వెంటాడుతున్నా.. కొందరు రైతులు ఈ ఏడాది కూడా మిరప సాగుకు సిద్ధమవుతున్నారు. ఏటా రుణభారం పెరుగుతుండటంతో చాలామంది సాగు చేయడం మానేస్తున్నారు.

**సగానికి సగం పడిపోయి..**

2021-22లో చైనా లాంటి దేశాలకు ఎగుమతులు పెరగడంతో బ్యాడిగ మిరప ధర క్వింటాకు రూ.40 వేలకు పైగానే పలికింది. దీంతో రైతులు మిరప సాగును పెంచారు. ప్రధానంగా ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాల్లో విస్తీర్ణం పెరిగింది.

అంతర్జాతీయ మార్కెట్ కుదేలు కావడంతో గతేడాది ధరలు పతనమయ్యాయి. 2023లో రూ.35 వేలు ఉన్న ధర ఏడాదిలోనే రూ.12 వేలకు పడిపోయింది. దీంతో పంట అమ్ముకోకుండా గోదాముల్లో నిల్వ చేసుకుంటూ వచ్చారు. రెండేళ్లకుగాను 1.21 క్వింటాళ్ల మిరప బళ్లారిలోని శీతల గిడ్డంగుల్లో నిల్వచేసుకుని ఎప్పటికైనా ధర పెరగకపోదా అని నిరీక్షిస్తున్నారు.

2022-23లో 30 వేల ఎకరాల్లో సాగు చేయగా.. 2024-25లో 14 వేల ఎకరాలకు పడిపోయింది.

విదేశాలకు ఎగుమతి ఉంటేనే మిరపకు మంచి ధర లభిస్తుంది. మిరపపై పురుగు మందులు అవశేషాలు మోతాదుకు మించి ఉన్నాయనే కారణంతో పంటను తిరస్కరిస్తున్నారు. దీంతో ఎగుమతులు నిలిచిపోతున్నాయి.

**40 శాతం పెరిగిన పెట్టుబడి**

ఐదేళ్ల కిందటి వరకు ఎకరా మిరప సాగుకు సగటున రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టేవారు. కొవిడ్ తర్వాత మిరపలో నల్ల తామర బెడద మొదలైంది. దీన్ని నివారించడానికి పెద్దమొత్తంలో పురుగు మందులు వాడాల్సి రావడంతో పెట్టుబడులు అమాంతం పెరిగాయి. మార్కెట్‌లో 50 మి.లీ. రూ.2 వేలకు తక్కువగా దొరకడం లేదు. పురుగు మందులకే ఎకరాకు రూ.75 వేలు ఖర్చవుతోంది. ప్రస్తుతం ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నారు.

**పెట్టుబడిలో సగం రాదు**

హనుమేష్, పొలికి, విడపనకల్లు

సింజంట డబ్బి రకం 12 ఎకరాల్లో సాగు చేస్తే 600 బస్తాల దిగుబడి వచ్చింది. రూ.24 లక్షలు ఖర్చుపెట్టాను. బళ్లారిలోని శీతల గిడ్డంగిలో నిల్వ చేశా. ప్రస్తుతం క్వింటా రూ.10 వేలు పలుకుతోంది. అమ్మితే పెట్టుబడిలో సగం కూడా రాదు. శీతల గిడ్డంగి అద్దె భారం పెరుగుతోంది.

# అరకొర మందులు.. అవస్థల్లో కార్మికులు



హిందూపురం : మందులు, పరీక్షలు లేక కొట్నూరు, హిందూపురం ప్రభుత్వ కార్మికుల రాజ్యాంగ బీమా(ఈఎస్ఐ డిస్పెన్సరీ కేంద్రాలు)- వైద్యశాలలు అలంకార ప్రాయంగా మారాయి. దాదాపు నెలరోజులుగా మందులు అందుబాటులో లేక వేలాది మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మధుమేహం, ఇతర వ్యాధులకు సైతం మందులు అందుబాటులో లేక ప్రతిరోజూ ఆసుపత్రికి చికిత్సకు వచ్చే రోగులు ప్రైవేట్‌లో కొనుక్కోవాల్సి వస్తోంది. ఇక్కడికి మందులు సరఫరా కావాలంటే కర్నూలు జిల్లా ఆదోని నుంచి రావాలి. దీని కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు.. అది ఇప్పటి వరకు రాకపోవడంతో డిస్పెన్సరీలకు మందులు సరఫరా కాలేదని సిబ్బంది చెబుతున్నారు.

**వేతనంలో ప్రతి నెలా 5శాతం చెల్లించినా..**

ఈ డిస్పెన్సరీ కేంద్రాల పరిధిలో ఉన్న కార్మికులు ప్రతి నెలా తమకు వచ్చే వేతనాల్లో 1.5 శాతం, సంబంధిత యాజమాన్యం 3.5శాతం మొత్తం ఐదుశాతం డబ్బు వైద్యసేవలకు ఈఎస్ఐకి అందిస్తుంది. ఇంత మొత్తం ప్రతి నెలా కార్మికుల నుంచి అందుతున్నా తగిన వైద్య సదుపాయాలు అందటం లేదు. దీనివలన కార్మికులు అనారోగ్యాలకు గురైతే ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించి రెండు రకాల ఆర్థికంగా నష్టపోతున్నారు.

**కట్టు కట్టాలన్నా సిబ్బంది లేరు**

కార్మికులు పరిశ్రమల్లో పనిచేసే సమయంలో గాయాలపాలై ఆసుపత్రికి వస్తే కనీసం మందురాసి కట్టుకట్టేందుకు తగిన సిబ్బంది లేరు. దీనివలన ఇక్కడ ఏ చిన్న గాయమైనా ప్రభుత్వ ఆసుపత్రి, లేదా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సమస్యలపై ఎమ్మెల్యే బాలకృష్ణ చర్యలు తీసుకొని కార్మికులకు మందులు, వైద్యపరీక్షలు, చికిత్సలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

**కనీస పరీక్షలేవీ?**

డిస్పెన్సరీ కేంద్రాల్లో రెండేళ్ల నుంచి పరీక్షలకు తగిన రసాయనాలు సరఫరా లేక కనీస పరీక్షలు జరగటం లేదు. యూరిన్, థైరాయిడ్, మలేరియా, కిడ్నీ తదితర దాదాపు 20 రకాల పరీక్షలు ఇక్కడ చేయాల్సి ఉంది. దీనికోసం టెక్నిషియన్ అందుబాటులో ఉన్నా రసాయనాలు సరఫరా లేక ఎలాంటి పరీక్షలు జరగటం లేదు.

ఈఎస్ఐ డిస్పెన్సరీ కేంద్రాలు- హిందూపురం, కొట్నూరు

పరిశ్రమలు - 80వరకు

కార్మికులు - 40వేల మంది

ప్రస్తుతం ఉన్న సిబ్బంది- 7

ఖాళీలు - 13

**పంపిణీ కేంద్రానికి మందులు చేరాయి**

డిస్పెన్సరీ కేంద్రాలకు అవసరమైన మందులకు మార్చిలోనే ఇండెంట్ చేశాం. ఈ మందులు ఇప్పటికే పంపిణీ కేంద్రం ఆదోనికి చేరాయి. అక్కడి నుంచి రావాల్సి ఉంది. రవాణాలో సమస్య వలన జాప్యం జరిగింది. త్వరలోనే వస్తాయి.రవికాంత్, వైద్యాధికారి

# అభ్యసన సామర్థ్యాలకు విద్యాశక్తి

పెనుకొండ : గణితం, విజ్ఞానశాస్త్రం విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి, జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు విజయం సాధించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం విద్యాశక్తి పథకం అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ మద్రాస్ వారి సహకారంతో నిర్వహిస్తున్న విద్యాశక్తి(ఫేజ్-2)కింద రాష్ట్ర వ్యాప్తంగా 74 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శ్రీసత్యసాయి జిల్లా నుంచి ఒక్క పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మాత్రమే ఎంపికైంది. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయడానికి విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో, ప్రాక్టికల్ రికార్డు పుస్తకాలు అందజేస్తున్నారు. మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం పథకాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ కళాశాలలో నూతన తరగతి గదులు, అత్యాధునిక ల్యాబ్‌లు, దాతల సహకారంతో 50 కంప్యూటర్లతో ప్రత్యేకమైన ల్యాబ్ అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 380 మంది, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 160మంది ఉన్నారు. కళాశాలలో ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల ద్వారా 2025-26 విద్యాసంవత్సరంలో కళాశాల చేరే విద్యార్థుల సంఖ్య 400 దాటనుంది. ఇప్పటికే 160మంది చేరారు.

**గ్రామీణ విద్యార్థులకు వరం**

గ్రామీణ ప్రాంతాల నుంచి గణితం, విజ్ఞానశాస్త్రం అభ్యసించే విద్యార్థులు, కార్పొరేట్ కళాశాలల విద్యార్థులతో నీట్, జేఈఈ లాంటి పరీక్షల్లో పోటీ పడేవిధంగా ప్రతి రోజు శిక్షణ ఇవ్వడం కోసం విద్యాశక్తి పథకం అంతర్జాలం ద్వారా ఐఐటీ మద్రాస్ సహకారంతో కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యాశక్తి తరగతులు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు



ఛాంపియన్ బ్యాడ్జిలు అందజేస్తారు. విద్యార్థులు ఈతరగతులను సద్వినియోగం చేసుకుని తమ బంగారు భవితకు మార్గం సుగమం చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

**పాఠాలు గుర్తుండిపోతాయి**

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విద్యాశక్తి పథకం ద్వారా నిర్వహిస్తున్న తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయి. తరగతి గదిలో అధ్యాపకులు బోధించిన పాఠ్యాంశాలు కాకుండా పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసే విధంగా పాఠాలు క్షుణ్ణంగా వివరిస్తారు. ఈ తరగతులు అంతర్జాలం ద్వారా వినడం వల్ల గుర్తుండిపోతాయి. అక్షయ, ఎంపీసీ

**పోటీ పరీక్షలకు ఉపయోగం**

విద్యాశక్తి పథకంతో ఇంటర్ పూర్తిచేసిన తరువాత జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలంటే ప్రత్యేక శిక్షణకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. విద్యాశక్తి తరగతులు భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయి. వసీం, ఎంపీసీ

# వేటుపడినా.. వీడని వక్రబుద్ధి

తిరుచానూరు : పన్ను ఆదాయం పక్కదోవ పట్టకుండా ప్రభుత్వం ఓవైపు పటిష్ఠ చర్యలు చేపడుతుండగా పంచాయతీ సిబ్బంది మాత్రం ఏంచక్కా పక్కదోవపట్టిస్తున్నారు. తిరుచానూరు పంచాయతీ పరిధిలో ఏకంగా రూ.22 లక్షలను బిల్లు కలెక్టర్ రమేష్ నాయుడు స్వాహాచేసినట్లు వెల్లడైంది. ఏడాదిగా వసూలు చేసిన నగదు సొంతానికి వాడుకుంటున్నా పంచాయతీ కార్యదర్శులు గుర్తించనట్లు తెలుస్తోంది. పంచాయతీకి ఏటా పన్నుల రూపంలో రూ.2 కోట్లకు పైగా వసూలవుతుంది. ఎప్పటికప్పుడు ట్రెజరీలోని ప్రభుత్వ ఖాతాకు నగదు జమచేయాల్సి ఉండగా బిల్లు కలెక్టర్ పక్కదోవ పట్టించాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇక్కడ ఇన్‌ఛార్జ్ పంచాయతీ కార్యదర్శుల పాలన నడుస్తోంది. వారు పూర్తిస్థాయిలో లేకపోవడం... అప్పుడప్పుడు వచ్చినా పన్నుల గురించి పట్టించుకోకపోవడంతో స్వాహా చేసినట్లు అధికారులు ఆలస్యంగా గుర్తించారు. ఇంత జరిగినా చర్యలు తీసుకునేందుకు అధికారులు సంశయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బిల్లు కలెక్టర్‌పై చర్యలు తీసుకుంటే తమ నిర్లక్ష్యం ఎక్కడ భయపడుతుందోనన్న కారణంతో నిధుల స్వాహా విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు స్పష్టమవుతోంది. స్వాహా చేసిన మొత్తం మరింత ఎక్కువగా ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



**అప్రమత్తం**

తిరుచానూరు బిల్లు కలెక్టర్ నిర్వాకంతో మండలస్థాయి అధికారులు అప్రమత్తమయ్యారు. మిగిలిన పంచాయతీల్లోనూ బిల్లులు వసూలు, చెల్లింపులపై ఆడిటింగ్ మొదలుపెట్టారు. రికార్డులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.

**పన్ను వసూలుకు దూరం ఉంచినా..**

గత తెదేపా పాలనలో ఇదే బిల్లు కలెక్టర్ సస్పెండ్‌కు గురయ్యారు. పంచాయతీ పరిధిలోని అపార్ట్‌మెంట్ వాసులకు ఇంటి పన్ను వేసేందుకు దాదాపు రూ.5 లక్షల వరకు వసూలు చేయగా ఫిర్యాదు అనంతరం సస్పెండ్ చేశారు. గత ప్రభుత్వ పాలనలో బిల్లు కలెక్టర్‌గా తిరిగి నియమితులైనా పన్ను వసూలు బాధ్యతలకు దూరంగా ఉంచారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయన పూర్తిస్థాయి బిల్లు కలెక్టర్ బాధ్యతలు చేపట్టి తన వక్రబుద్ధిని చూపించాడు. ఘటనపై డివిజన్ పంచాయతీ అధికారి సురేష్ నాయుడును వివరణ కోరగా ఇప్పటికే విచారణ చేసి నివేదిక సిద్ధం చేశామన్నారు. నిధులు స్వాహా చేసినట్లు ఇన్‌ఛార్జ్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన మాధవి గుర్తించి నోటీసులు ఇచ్చారని వెల్లడించారు.

# సొంత భవనాల్లో పాలనెప్పుడో ?

చిత్తూరు : రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఆదాయాన్ని అందించే ప్రధాన శాఖల్లో స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖ ప్రధానమైనది. ఎంత ఆదాయం ఆర్జించి ఏం లాభం? కార్యాలయానికి సొంత భవనాల్ని సమకూర్చుకోలేని స్థితిలో ఈ శాఖ ఉంది. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు కొన్ని ఇంకా అద్దె భవనాల నుంచే పాలన కొనసాగిస్తు న్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు దాదాపు చాలాచోట్ల సొంత భవనాలు ఉన్నాయి. ఇంకా అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండటం గమనార్హం. దీంతో నెలవారీగా అద్దె చెల్లించడం భారంగా మారుతోంది. ప్రభుత్వం స్పందించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్ని సొంత భవనాల్లో నిర్వహించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**ఐదుచోట్ల ఇలా..**జిల్లాలో 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. చిత్తూరు రూరల్, బంగారుపాళ్యం, కార్వేటినగరం, నగరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు చాలా ఏళ్లుగా అద్దె భవనాల నుంచే కార్యకలాపాలు



నిర్వహిస్తున్నాయి. అద్దె చెల్లింపులకు బడ్జెట్ సక్రమంగా విడుదల కాకపోవడంతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. చిత్తూరు అర్బన్, కుప్పం, పుంగనూరు, పలమనేరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సొంత భవనాల ద్వారా పాలన సాగిస్తున్నాయి.

**కనీస సౌకర్యాల కరవు..**

అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు బాగానే జరుగుతున్నాయి. అయితే పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే క్రయవిక్రయదారులకు కనీస సౌకర్యాలు లభించడం లేదనే విమర్శలు ఉన్నాయి. కూర్చునేందుకు కుర్చీలు ఉండవు, మరుగుదొడ్లు ఉన్నా.. అవి అలంకార ప్రాయమే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా కార్యాలయాలకు సొంత భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# గానుగాట ఉన్నట్టా.. లేనట్టా?

చోడవరం : గోవాడ చక్కెర కర్మాగారం పరిధిలోని గ్రామాల్లో ఈ ఏడాది చెరకు సాగు ముందుకు సాగడం లేదు. 2025-26 కాలానికి గానుగాట జరుగుతుందో, లేదోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి, కర్మాగారం ఎండీ రైతులకు భరోసా ఇచ్చేలా ఇప్పటివరకు ప్రకటన చేయకపోవడంతో చెరకు సాగుకు మొగ్గు చూపడం లేదు. గతంలో ఏటా ఎంత విస్తీర్ణంలో చెరకు సాగు చేస్తున్నారు. కర్మాగారానికి ఎన్ని టన్నులు సరఫరా చేస్తారంటూ ఆరా తీస్తూ రైతుల నుంచి ఒప్పంద ప్రతాలు రాయించుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. కర్మాగారంలో శాశ్వత ప్రాతిపదికన పనిచేసే వ్యవసాయ క్షేత్ర సిబ్బంది ఆరుగురే ఉన్నారు. కొద్దోగొప్పో చెరకు సాగవుతున్నా.. పంటంతా గోవాడ కర్మాగారానికే వస్తుందన్న గ్యారంటీ లేదు. ప్రైవేటు కర్మాగారాలు, రసంగా విక్రయించే వారు, బెల్లం తయారీదారులు పొలాల వద్దకు వెళ్లి చెరకు కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. ఈ పరిస్థితుల్లో కర్మాగారంలో పరిధిలో పండే చెరకంతా గానుగాటకే వస్తుందన్న నమ్మకం లేదని ఫీల్డ్‌మెన్లు చెబుతున్నారు. గ్రామాల్లో కార్శి తోటలు కనిపిస్తున్నా, చెరకు దవ్వ నాటిన మడులు పెద్దగా లేవు. చెరకు పండించే భూముల్లో సరుగుడు నారు వేస్తున్నారు. కర్మాగారం మనుగడ ప్రశ్నార్థకంగా మారకముందే గానుగాటపై పాలకులు స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు, రైతు సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

ఈ చిత్రంలోని రైతు పేరు కోయిలాడ సూరిబాబు. బుచ్చెయ్యపేట మండలం కుముందానిపేట స్వగ్రామం. గోవాడ కర్మాగారానికి ఏటా 30 టన్నుల వరకు చెరకు సరఫరా చేసేవారు. గతేడాది నుంచి సాగు తగ్గించారు. ఈ ఏడాది సాగు ఊసే ఎత్తడం లేదు.

చురకలు



# 'అఖండ 2'లో ఐటమ్ గాళ్?

నటసింహా నందమూరి బాలకృష్ణ- బోయపాటి కాంబినేషన్ లో వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ అఖండకు పార్ట్ 2 తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సీక్వెల్ సినిమాతో బాలయ్య నటవిశ్వరూపాన్ని మరోసారి అభిమానులు చూడబోతున్నారు. ఇది భారీ యాక్షన్ ఎంటర్ టైనర్. వినోదానికి కొదవేమీ ఉండదని బోయపాటి టీమ్ చెబుతోంది. అయితే రొమాన్స్ పార్ట్ కోసం గ్లామరస్ కథానాయికల్ని ఎంపిక చేసుకున్నా కానీ, ఐటమ్ పాటతో మరింత కిక్కు పెంచాలని కూడా ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. అంతేకాదు.. ఇప్పటికే ఐటమ్ భామను ఫైనల్ చేసేందుకు బోయపాటి సీరియస్‌గా ప్రయత్నిస్తున్నారు. మలయాళ బ్యూటీ సంయుక్త మీనన్‌ను ఐటమ్ పాట కోసం ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. సంయుక్త ఇప్పటివరకూ మలయాళం, తెలుగులో అగ్ర హీరోల సరసన భారీ చిత్రాల్లో



నటించింది. తనదైన అందం, నట ప్రతిభతో మైమరిపించింది. అయితే సంయుక్త రూపం ట్రెడిషనల్ అప్పియరెన్స్ కి ప్రత్యేకించి ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడు తన ఇమేజ్‌ని బ్రేక్ చేసి సంయుక్త ఐటమ్ పాటలో నర్తిస్తుందా? అన్నది ఆసక్తిగా మారింది. ఇటీవల సమంత, తమన్నా ఐటమ్ పాటల్లో నర్తించినా వారికి ఉన్న ఇమేజ్ పూర్తి భిన్నమైనది. గ్లామరస్ క్వీన్స్ గా తొలి నుంచి ఎస్టాబ్లిష్ అయ్యారు. అయితే సంయుక్త మీనన్ గ్లామరస్ హీరోయిన్ ట్యాగ్ కంటే ట్రెడిషనల్ బ్యూటీ అన్న ట్యాగ్ తోనే అందరి దృష్టిలో ఉంది. అందుకే ఇప్పుడు బాలయ్య సినిమాలో ప్రత్యేక గీతానికి ఓకే చెబుతుందా? అన్నది వేచి చూడాలి. ఒకవేళ అంగీకరిస్తే, ఆ తర్వాత సంయుక్తకు ఈ తరహా గ్లామర్ ఎలివేషన్ ఉన్న సినిమాల్లోను అవకాశాలు పెరిగే ఛాన్సుంది.

## శ్రీలీలనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?

సోషల్ మీడియా యుగంలో నెటిజనుల అనైతిక ప్రవర్తన గురించి ఎంత చెప్పినా తక్కువే. అయినదానికి కానిదానికి ట్రోలింగ్ చేయడం రెగ్యులర్ వ్యాపకంగా మారింది. ఇక సెలబ్రిటీలకు ఇది తీవ్ర ఇబ్బందికర పరిణామంగా మారుతోంది. సోషల్ మీడియాల్లో దిగజారి కామెంట్లు చేసే అపరిపక్వ సమాజం, అందులో వ్యక్తుల గురించి ఏమని చెప్పాలి. విలువలకు తిలోదకాలిచ్చి తీవ్రమైన పదజాలంలో దూషించే లేదా ద్వేషించే మనుషులు సామాజిక మాధ్యమాల్లో పరిచయమవుతారు. కథానాయికలు లేదా నటీమణులను బూతు పదాలతో తిట్టే అలవాటు, సామాజిక మాధ్యమాల్లో చూస్తూనే ఉన్నాం. ఇలాంటి అనైతిక వ్యక్తులను నియంత్రించే వ్యవస్థ లేకపోవడం



కూడా పెను సమస్య. ఇటీవలి కాలంలో అందాల కథానాయిక, డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలను విమర్శించే లేదా తీవ్ర పదజాలంతో దూషించే, అసభ్యకరంగా తిట్టే ఒక వర్గం రెడీగా ఉంటోంది. సదరు నటీమణి గురించి అగౌరవంగా, అవమాన కరంగా మాట్లాడే వ్యక్తులు సోషల్ మీడియాల్లో ఉన్నారు. వారు ఉపయోగించే భాష అత్యంత నీచమైనది. జూనియర్% సినిమాలోని కిరీటితో శ్రీలీల వైరల్ సాంగ్ నుండి స్క్రీన్‌షాట్‌లు, క్లిప్‌లను వైరల్ చేస్తూ పలువురు అసభ్యకర కామెంట్లను పోస్ట్ చేస్తున్నారు. శ్రీలీల డబ్బు కోసం అందాల్ని ఆరబోసేందుకు సిద్ధంగా ఉంటుందని ఒక నెటిజన్ కామెంట్ చేసాడు. చాలామంది అసభ్యకరమైన, అభ్యంతరకరమైన భాషను కూడా ఉపయోగించారు. నిజానికి ఐటమ్ పాటల్లో చాలా మంది అగ్ర నాయికలు అందాల్ని ఆరబోసారు. కత్రిన కైఫ్, సమంత, తమన్నా, త్రిష లాంటి అగ్ర నాయికలు అందాల ఆరబోతలో ఎక్కడా తగ్గలేదు. కానీ ఇప్పుడిలా శ్రీలీలను మాత్రమే టార్గెట్ చేయడం తగునా? అని అభిమానులు ప్రశ్నిస్తున్నారు. శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్ లో కార్తీక్ ఆర్యన్ సరసన నటిస్తోంది. అట్లీ తదుపరి చిత్రంలో శ్రీలీల నటిస్తుందని కథనాలొస్తున్నాయి. ఇటు టాలీవుడ్ లోను పలువురు ఫిలింమేకర్స్ వినిపించిన కథల్ని ఫైనల్ చేసే అవకాశం ఉందని తెలిసింది.




# హరిహర వీరమల్లు నైజాం రైట్స్.. క్రేజీ డీల్ సెట్టయ్యిందిగా..




ఈ వారం టాలీవుడ్‌లో అందరి దృష్టి ఒక్క సినిమాపైనే ఉంది. పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన భారీ పీరియాడిక్ యాక్షన్ ఎంటర్టైనర్ హరిహర వీరమల్లు కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఎట్టకేలకు ఆ సినిమా విడుదలకు సిద్ధమైంది. జూలై 24న థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పరచుకుంది. ఒక వైపు పవన్ కళ్యాణ్ గ్యాప్ తర్వాత పూర్తి స్థాయి సినిమా చేయడం, మరోవైపు క్రిష్ దర్శకత్వం వహించడంతో ఈ సినిమాపై హైప్ కొనసాగుతోంది. ఈ సినిమాను ఏఎం రత్నం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. స్టార్ క్యాస్టింగ్, పాన్ ఇండియా టెక్నికల్ టీం, గ్రాండ్ సెట్‌లతో నిర్మితమైన ఈ చిత్రం ఇప్పటివరకు వచ్చిన ప్రమోషనల్ మెటీరియల్‌తో మంచి పాజిటివ్ బజ్‌ను సంపాదించుకుంది.

ట్రైలర్, పాటలు మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. ఇటీవల హైదరాబాదులో జరిగిన ప్రెస్ మీట్, ప్రీ రిలీజ్ ఈవెంట్‌లతో హైప్ మరింత పెరిగింది. ఇప్పుడీ సినిమా నైజాం రైట్స్ హాట్ టాపిక్‌గా మారాయి. తాజా సమాచారం ప్రకారం, హరిహర వీరమల్లు చిత్రాన్ని నైజాం ఏరియాలో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేయబోతుంది. ఇండస్ట్రీలో వినిపిస్తున్న మాటల ప్రకారం, ఈ హక్కులను వారు దక్కించుకోవడానికి రూ.35 కోట్ల వరకు ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. ఇది పవన్ కెరీర్‌లోనే అత్యధికంగా చెప్పుకోవచ్చు. మైత్రీ సంస్థ ఈ సినిమాను భారీగా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తోంది. ప్రీమియర్లతో పాటు, నైజాంలోని కీలక థియేటర్లలో స్పెషల్ స్క్రీనింగ్‌లు, భారీ మల్టిప్లెక్స్ రిలీజ్‌లు కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా మొదటి రోజు నుంచే భారీ కలెక్షన్లు రాబట్టే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మాస్ ప్రేక్షకులతో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఈ సినిమా ఆకట్టుకునే విధంగా రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాబీ డియోల్ విలన్ పాత్రలో కనిపించనున్నారు.

ఎమ్.ఎం.కీరవాణి సంగీతం ఇప్పటికే మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. మొత్తంగా చూస్తే, నైజాం రైట్స్ భారీ ధరకు అమ్ముడవడమే కాకుండా, హరిహర వీరమల్లుతో పవన్ కళ్యాణ్ మరోసారి బాక్సాఫీస్ విజయాన్ని నమోదు చేసే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. మరి కంటెంట్ ఎంతవరకు మెప్పిస్తుందో చూడాలి.

# కబీర్ సింగ్ ను గుర్తుచేస్తున్న సైయారా



బాలీవుడ్ రొమాంటిక్ డ్రామా 'సైయారా' బాక్సాఫీస్ వద్ద భారీ విజయం వైపునకు దూసుకెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. జూలై 18న రిలీజైన ఈ సినిమా, ఓపెనింగ్ రోజు పెద్దగా వసూళు సాధించలేదు. అయితే మౌత్ టాక్ వల్ల వీకెండ్ అయిన శనివారం పుంజుకుంది. రెండో రోజు ఆక్యుపెన్సీ పెరిగింది. దీంతో మల్టీప్లెక్స్ లు ఫుల్ అవుకున్నాయి. తొలి రోజుతో పోలిస్తే, రెండో రోజు కలెక్షన్లు 15- 20 శాతం పెరిగిటన్లు తెలుస్తోంది. దీంతో శనివారం రోజే రూ.24 కోట్ల నెట్ వసూళ్లు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఓపెనింగ్ డే కు రెండో రోజుకు స్పందన పెరిగిందన డానికి ఇదే ఉదాహరణ. దీంతో ఓవరాల్ గా సినిమాకు స్పందన పెరగడంతో థియేటర్ల సంఖ్య కూడా పెంచాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. బాలీవుడ్ తోపాటు నార్త్ లో యూపీ, బీహార్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లో అయిత ఓపెనింగ్ రోజు కూడా డీసెంట్ కలెక్షన్లు వచ్చాయి. మరీ ముఖ్యంగా ఢిల్లీ, యూపీ సర్క్యూట్ లలో సైయారా కు విశేష ఆదరణ దక్కుతోంది. అక్కడ ఇది బ్లాక్ బస్టర్ సినిమాలు ఛావా, సికిందర్, హౌస్ ఫుల్ 3 చిత్రాలను దాటేసింది. దీంతో నార్త్ లో ఈ సినిమా నిలకడగా వసూళ్లు సాధిస్తుందని ట్రేడ్ వర్గాల అంచనా. అయితే ఇదంతా చూస్తుంటే గతంలో బాలీవుడ్ బ్లాక్ బస్టర్ కబీర్ సింగ్ ట్రెండ్ ను సైయారా ఫాలో అవుతున్నట్లు అనిపిస్తోంది. కబీర్ సింగ్ ఏ సర్టిఫికేట్ సినిమా కావడంతో కొన్ని పరిమితులతోనే రిలీజ్ అయ్యింది. ఆ తర్వాత హిట్ టాక్ తో మెల్లిగా పికప్ అయ్యింది. అలా కబీర్ సింగ్ భారీ విజయం దక్కించుకుంది. ఇప్పుడు సైయారా విషయంలోనూ ఇదే జరిగేలా కనిపిస్తుంది. ఓపెనింగ్ డే అంతంత మాత్రం ఉన్న కలెక్షన్లు, రెండో రోజు పెరిగాయి. ఇక మూడోరోజు ఆదివారం కావడంతో వసూళ్లు ఇంకా పెరిగే ఛాన్స్ ఉంది. పైగా కబీర్ సింగ్ ఏ సర్టిఫికెట్, కానీ సైయారా ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్ ను కూడా ఆకర్షిస్తుంది. ఒకవేళ బాక్సాఫీస్ వద్ద ఇదే జోరు కొనసాగితే సైయారా 2025లో బాలీవుడ్ లో సూపర్ హిట్ సినిమాల్లో ఒకటిగా నిలుస్తుందని ట్రేడ్ పండింతులు చెబుతున్న మాట!

# కర్మను అనుసరిస్తున్న యంగ్ హీరోయిన్?

చాలా మంది విధిని మార్చగలమని భ్రమిస్తారు. తాము ఏది అనుకుంటే అదే నడుస్తుందని కలలు కంటారు. కానీ చివరిగా.. అవన్నీ కల్లలు అని ప్రూవ్ అవుతుంది. పైనుంచి ఒక బిగ్ బాస్ మానవ ప్రపంచాన్ని ఆపరేట్ చేస్తుంటాడు. అతడి ఆశీర్వాదం లేనిదే మోక్షం దక్కదని ఆధ్యాత్మిక గురువులు, భక్తులు చెబుతుంటారు. అయితే విధిని సైతం మార్చాలని ప్రయత్నించే దురంధరులకు ఈ సంఘంలో కొదవేమీ లేదు. కానీ అంతిమంగా ప్రతి దురంధరుడు ఒక నిజం తెలుసుకుంటాడు. ఆ తర్వాత గౌతమ బుద్ధుడిలా మారతాడు. జైనుడిలా వెజిటేరియన్ మాత్రమే తింటాడు. ఇప్పుడు ఇదే కేటగిరీలో కర్మ సిద్ధాంతాన్ని నమ్మే ఒక టాలీవుడ్ హీరోయిన్ చెప్పిన విషయాలు ఆశ్చర్యపరిచాయి. తాను కర్మ ప్రిన్సిపల్ ని నమ్ముతానని, కర్మ సిద్ధాంతాన్ని నమ్మేప్పుడు కచ్చితంగా జ్యోతిష్య శాస్త్రాన్ని, న్యూమరాలజీని కూడా నమ్ముతానని చెప్పింది. అయితే చాలా చిన్న వయసులో ఇలాంటి



ఒక గొప్ప విషయాన్ని ఆకలింపు చేసుకున్న ఆ యువనటి ఎవరో తెలుసా? నిస్సందేహంగా నిధి అగర్వాల్. ఉత్తరాది అమ్మాయి. టాలీవుడ్ లో అక్కినేని హీరోలతో కెరీర్ ప్రారంభించి చాలా దూరం ప్రయాణించింది. ఇప్పుడు ఈ బ్యూటీ పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన 'హరి హర వీరమల్లు' చిత్రంలో నటించింది. వీరమల్లు ఈ నెల 24న థియేట్రికల్ గా విడుదలవుతున్న సంగతి తెలిసిందే. తాజా ఇంటర్వ్యూలో తాను కర్మ ప్రిన్సిపల్ ని అనుసరిస్తానని హోస్ట్ తో వెల్లడించింది. తినే ఆహారంలోను వెజిటేరియన్ కి నార్తర్న్ డిషెస్ కి ప్రాధాన్యత ఉంటుందని తెలిపింది. అలాగే తన పేరులో అక్షరాలను న్యూమరాలజీ ప్రకారం ఎంపిక చేసుకున్నానని కూడా నిధి వెల్లడించింది. ఇక నిధి వర్కవుట్లు, ఆహార అలవాట్లు తనలో మెరుపులకు కారణం. నియమ నిష్ఠలతో జీవనం సాగిస్తుంది గనుకనే నిధి అంత బ్యూటిఫుల్ లుక్స్ తో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. బాలీవుడ్ లో హేమమాలిని, ఆమె కుమార్తెలు, మీరా రాజ్ పుత్, అనుష్క శర్మ- విరాట్ కోహ్లీ సహా చాలా మంది కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు. సంఘంలో మెజారిటీ మేధోవర్గాలు భగవద్గీతను అనుసరిస్తున్నారు.

## థియేటర్ లో స్నాక్స్ రేట్లపై తెలుగు హీరో గరం.. పట్టించుకుంటారా?

ఒకప్పటితో పోలిస్తే, ఇప్పుడు ఓ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ థియేటర్ లో సినిమా చూడడం చాలా ఖరీదైపోయింది. దేశవ్యాప్తంగా సింగిల్ స్క్రీన్లు, మల్టీప్లెక్స్ లలో సినిమా టికెట్ల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇక పెద్ద స్టార్ సినిమా రిలీజ్ అయ్యిందంటే చాలు టికెట్ పై మరింత ఎక్కువ ధర వడ్డిస్తారు. దీంతో మధ్య తరగతి వ్యక్తులు థియేటర్లకు రావాలంటే ఖర్చుకు భయపడిపోతున్నారు. ఇక ఎలాగోలా టికెట్ కొనుక్కొని లోపలికి వెళ్తే, అక్కడ స్నాక్స్ పేరిట మరో దోపిడి! ఏది కొందామన్నా ధరలు భగ్గుమంటాయి. మనం తీసుకెళ్లేది లోపలికి అనుమతించరు. లోపల దొరికేవి మనం కొనుక్కోలేనం. అయినా కాస్త ధైర్యం చేసి ముందడుగు వేస్తే నలుగురున్న ఫ్యామిలీ ఏదో టైమ్ పాస్ కోసం తినే స్నాక్స్ కు వెయ్యికి పైనే ఖర్చుతుంది. ఒక విధంగా చూసుకుంటే సినిమా టికెట్ ధర కంటే, థియేటర్ లోపల పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ కే ఎక్కువగా ఖర్చు అవుతోంది. ప్రేక్షకులు ఎన్నో రోజులుగా ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య ఇదే. ఫలితంగా ఇది సినిమా బాక్సాఫీస్ కలెక్షన్ లను సైతం ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తోంది. అయినా పట్టించుకునేవారేరీ? అయితే టాలీవుడ్



యువ నటుడు నిఖిల్ థియేటర్ స్నాక్స్ ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఓవైపు సినిమా టికెట్ రేట్లు గురించి మాట్లాడుతూనే, పాప్ కార్న్ కూల్ డ్రింక్స్ ధరలపై స్పందించారు. ఈ సమస్యపై దృష్టి పెట్టాలని సంబంధిత సంస్థలను కోరారు. టికెట్ ధరను పరిమితం చేయాలి. కానీ థియేటర్ లోపల పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ ధరలు విపరీతంగా ఉన్నాయి. నేను రీసెంట్ గా ఒక థియేటర్‌లో సినిమా చూశాను. అయితే సినిమా టికెట్ కంటే స్నాక్స్ కే నేను ఎక్కువ డబ్బులు ఖర్చు చేశాను. ఇది నన్ను షాక్ కు గురి చేసింది. దయచేసి దీనిపై దృష్టి పెట్టాలని డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు రిక్వెస్ట్ చేస్తున్నా. బిగ్ స్క్రీన్ పై సినిమా చూసే ప్రేక్షకుల సంఖ్యను పెంచండి.

కనీసం మా వెంట తెచ్చుకున్న వాటర్ బాటిళ్లనైనా థియేటర్ లోపలికి తీసుకెళ్లేలా అనుమతించండి. అని నిఖిల్ సోషల్ మీడియా ఖాతా ఎక్స్ లో పోస్ట్ షేర్ చేశారు. నిఖిల్ ఇలా థియేటర్లలో స్నాక్స్ ధరలపై మాట్లాడడం నెటిజన్లను ఆకర్షిస్తోంది. హీరో పోస్ట్ కు నెటిజన్లు పూర్తి మద్దతు ఇస్తున్నామంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇప్పుడైనా దీనిపై థియేటర్ యాజమాన్యాలు స్పందించాలని కోరుకుంటున్నారు. కానీ, ప్రేక్షకుల గోడు వినేవారెవరు?

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536